thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 214 కరీంనగర్ శనివారం, 11 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.



## మావోయిస్టు పార్టీలో విభేదాలు వాస్తవమే

### మావోయిస్టు వికాస్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట ముగ్గురు మావోయిస్టు పార్టీ కీలక నేతలు లొంగిపోయారు. వారిలో కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ ఉన్నారు. అయితే.. లొంగుబాటు అనంతరం మావోయిస్టు వికాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టు పార్టీలో విభేదాలు ఉన్నమాట వాస్తవమే అని కుండబద్దలు కొట్టారు. మావోయిస్టు అగ్రనేతల మధ్య విభేదాలు మొదలయ్యాయని అన్నారు. ఆయుధాలు వదిలిపెట్టాలనే అంశంపైనే దండకారణ్యంలో విస్తృతంగా చర్చ జరుగుతోందని చెప్పారు. ఇదేం కొత్త కాదని.. మావోయిస్టుల్లో ఆధిపత్య పోరు సహజమే అని స్పష్టం చేశారు. అంతకుముందు డీజీపీ శిశధర్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిస్టులు పంతానికి పోకుండా లొంగిపోవాలని సూచించారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు సంబంధించిన వారు మొత్తం 72 మంది ఉన్నారు.. ఇందులో 8 మంది కేంద్ర కమిటీ సభ్యులు అని వెల్లడించారు. అందరూ ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.

# ఏం చేద్దాం..!?

### బీసీ రిజర్వేషన్లపై మేధావులు, మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ సలహాదారులతో చర్చించనున్న సీఎం




హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల అంశం .. కోర్టులో వీగిపోతుందని తెలిసే రేవంత్ రెడ్డి కావాలనే బీసీ లపై ప్రేమ ఉన్నట్టు ఈ రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చి నాటాకలు ఆడిందనేది ప్రతిపక్షాల ఆరోపణ. ఏ రిజర్వేషన్స్ అయినా.. 50 శాతానికి మించకూడదన్న రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఉన్నా సరే.. వచ్చే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసం రేవంత్ రెడ్డి ఆడిన గేమ్ ప్లాన్ అని బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. బీసీలపై అంత చిత్తశుద్ధి ఉంటే.. రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి పీఠాన్ని బీసీలకు అప్పగించాలని చెబుతున్నాయి. మరోవైపు హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలా లేదా హైకోర్టులో తుది తీర్పు వచ్చే వరకు వేచి చూడాలా అనే దానిపై సహచర మంత్రులతో పాటు పార్టీలో చర్చించనున్నట్లు సమాచారం. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను పూర్తిగా అధ్యయనం చేసి, న్యాయ నిపుణుల సూచన మేరకు తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలకు దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా హైకోర్టు స్టే విధించింది.

ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోనుంది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేస్తున్నట్లు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటన చేసింది. ఈ మేరకు గురువారం సాయంత్రం గెజిట్ జారీ చేసింది. గతనెల 29న ఇచ్చిన ఎన్నికల షెడ్యూల్‌ను రద్దు చేసింది. తదుపరి నోటిఫికేషన్ వచ్చే వరకు ఈ నోటిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది.




## మరో యుద్ధం ప్రారంభం కాబోతుందా..?

యుద్ధం.. మన ఆసియాలో మరో యుద్ధం ప్రారంభం కాబోతుందా.. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం రాబోతుందా.. ఆఫ్ఘనిస్తాన్ టార్గెట్?గా ఆ దేశ రాజధాని కాబూల్ పై పాకిస్తాన్ బాంబులతో విరుచుకుపడుతుంది. పాక్, ఆఫ్ఘన్ దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే కాబూల్ సిటీని టార్గెట్ చేస్తూ.. పాకిస్తాన్ చేసిన దాడుల్లో చాలా మంది చనిపోయారు. పాక్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్న ఆఫ్ఘనిస్తాన్.. ప్రతిదాడులకు సిద్ధం అంటోంది. దీంతో ఈ రెండు దేశాల మధ్య యుద్ధం రాబోతుందా అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

**పాకిస్తాన్.. ఆఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య గొడవలకు కారణం ఏంటి..:** TTP.. తెహరికి తాలిబనర్ పాకిస్తాన్. ఇది ఉగ్రవాద సంస్థ. దీనికి ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్లు మద్దతు ఇస్తున్నారు. ఈ TTP సంస్థ.. ఆఫ్ఘనిస్తాన్ కేంద్రంగా పాకిస్తాన్ లో దాడులకు తెగబడుతుంది. రైళ్లు పేల్చివేయటం.. బాంబులు పేల్చటం వంటివి చేస్తుంది. ఆఫ్ఘనిస్తాన్ కేంద్రంగా.. తాలిబన్ల మద్దతుతో నడుస్తున్న టీటీపీని కట్టడి చేయాలని పాకిస్తాన్ కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నా.. ఆఫ్ఘన్ తాలిబన్ల డోంట్ కేర్ అన్నట్లు ఉన్నారు. దీంతో పాకిస్తాన్ ఇప్పుడు.. ఆఫ్ఘనిస్తాన్ లోని టీటీపీ టార్గెట్ గా విమానదాడులకు తెగబడింది. మరో కీలక అంశం. పాకిస్తాన్ దేశంలో ఉన్న లక్షల మంది ఆఫ్ఘనిస్తానీయులను తిరిగి వాళ్ల దేశం పంపిస్తుంది పాకిస్తాన్. తాలిబన్లపై ఒత్తిడి తీసుకురావటానికి శరణార్థులను ఉపయోగిస్తుంది. ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్ దేశంలో ఆర్థికంగా చితికిపోయింది. తాలిబన్ల దగ్గర డబ్బులు లేవు. ఈ క్రమంలోనే లక్షల మందిని తిరిగి ఆఫ్ఘనిస్తాన్ పంపించటం ద్వారా.. తాలిబన్లపై ఒత్తిడి తీసుకొస్తుంది. ఇది కూడా తాలిబన్లకు తలనొప్పిగా మారింది. మరో అంశం డ్యూరాండ్ లైన్. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య 2 వేల 600 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఆ సరిహద్దు నుంచి టీటీపీ ఉగ్రవాదులు పాకిస్తాన్ లోకి ప్రవేశించి పాకిస్తానీయులను చంపుతున్నారనేది పాక్ వాదన. ఈ క్రమంలోనే సరిహద్దుల్లో రెండు దేశాల సైన్యం మధ్య తరచూ కాల్పులు, గొడవలు, కొట్లాటలు జరుగుతున్నాయి. ఇన్నాళ్లు తాలిబన్ల విషయంలో ఆచితూచి స్పందించిన పాకిస్తాన్.. ఇప్పుడు టీటీపీ టార్గెట్ గా ఆఫ్గనిస్తాన్ దేశంపై వైమానిక దాడులకు దిగింది. టీటీపీ చీఫ్ ను చంపినట్లు కూడా ప్రకటించింది పాక్. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పాక్, ఆఫ్ఘన్ దేశాల మధ్య పరిణామాలను భారత్ తీవ్రంగా పరిగణిస్తుంది. దీనికి కారణం లేకపోలేదు. ఈ రెండు దేశాల్లోని బాధితులు భారత్ వైపు వచ్చే అవకాశం ఉంది. ఇది దేశ భద్రతకు ముప్పుగా భావిస్తుంది భారత్.. మొత్తానికి పాక్, ఆఫ్గనిస్తాన్ దేశాల మధ్య యుద్ధం మొదలైంది. కాకపోతే పూర్తి స్థాయిలో కాదు. ఆఫ్ఘన్, పాక్ రెండు దేశాలు ఆర్థిక సంక్షోభంలోనే ఉన్నాయి. ఒక వేళ పూర్తి స్థాయి యుద్ధం చేసినా.. అది మూడు, నాలుగు రోజుల్లోనే క్లోజ్ కావొచ్చు.




## ముంచుకొస్తున్న మరో అల్పపీడనం..

హైదరాబాద్, అక్టోబర్ 10: దక్షిణ ఒడిశా నుండి కోస్తా ఆంధ్ర తీరం రాయలసీమ తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్రమట్టం నుండి 0.9 కి మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతుంది. దీని ప్రభావంతో తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు కూడా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు తెలంగాణ, ఏపీ మీదుగా కొనసాగుతున్న ద్రోణికి ఉపరితల ఆవర్తనం తోడైంది. దీని ప్రభావంతో అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడి రేపటికి (అక్టోబర్ 11) అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో వచ్చేవారం మళ్లీ కుండపోత వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది.

# హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

## నరెడ్కో 15వ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్: నగర సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రియల్ ఎస్టేట్ వేగంగా దూసుకెళ్తుందని పేర్కొన్నారు. నరెడ్కో 15వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు పలికిందని గుర్తు చేశారు. మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలను బిల్డర్లు దృష్టిలో పెట్టుకోవాలని భట్టి సూచించారు. భవిష్యత్తులో నగరంలో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయని చెప్పారు. ప్రతి సంవత్సరం నగర అభివృద్ధికి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**ఫలితాలు కనిపిస్తున్నాయి..** హైదరాబాద్‌లో రెండు సంవత్సరాల్లో రూ.20 వేల కోట్లు కేటాయించి చేపట్టిన పనుల ఫలితాలు ఇప్పుడే కనిపిస్తున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పనులు నగర రూపురేఖలను మార్చబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల 39 %బూ% ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పనులకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.11,927 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రూ.13,704 కోట్ల వ్యయంతో మరికొన్ని తాగునీటి, సీవరేజ్ ప్లాంట్ పనులు ప్రతిపాదనలో ఉన్నాయని స్పష్టం చేశారు. మొత్తంగా సీవరేజ్, తాగునీటి సరఫరా కోసం రూ.25,631 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎలివేటెడ్ కారిడార్..** ప్యారడైజ్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేను కలుపుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు రూ.1,487 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు భట్టి చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఢిల్లీలో మకాం వేసి కేంద్ర డిఫెన్స్ మంత్రిని ఒప్పించారని గుర్తు చేశారు. శామీర్‌పేటలో రూ.3,619 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నామని తెలిపారు. దేశంలోని ఇతర ఏ నగరాల్లో లేనివిధంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు, మంచినీటి సరఫరా హైదరాబాద్ నగరంలో సరఫరా జరుగుతుందని భట్టి తెలిపారు.


**ఒక్కో పాఠశాలను రూ.25 కోట్లు..** ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఉచితంగా విద్యను అందించేందుకు ఒక్కో పాఠశాలను రూ.25 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం నిర్మిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకుగాను రూ.11,500 కోట్ల బడ్జెట్ కేటాయించి పాఠశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు చెప్పారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే బిల్డర్లు పరిమితం కావొద్దని సూచించారు. మధ్యతరగతి దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయాలని పేర్కొన్నారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



## నవీన్ యాదవ్ ద లోకల్ బాయ్ ఆఫ్ జూబ్లీహిల్స్!

హైదరాబాద్ : 1978 నుంచీ జూబ్లీహిల్స్ స్థానికులకు అవకాశం ఇవ్వలేదన్నది తాజాగా కాంగ్రెస్ నుంచి అభ్యర్థి నవీన్ యాదవ్ చేసిన కామెంట్. ఇంతకీ ఏంటీ జూబ్లీహిల్స్ హిస్టరీ. ఈ నియోజకవర్గం గతంలో ఏ సెగ్మెంట్లో భాగంగా ఉండేది? ఆ డీటైల్స్ ఏంటి? అని చూస్తే.. ఇది 1952 లో ద్విసభ్య సభగా ఉండేది. ఇక్కడ ఎస్సీ కేటగిరిలో ఒకరు, జనరల్ కేటగిరిలో ఒకరు ఎంపికయ్యారు. వారెవరని చూస్తే బత్తులు సుమిత్రాదేవి ఎస్సీ కేటగిరి, నవాజ్ జంగ్ జనరల్ కేటగిరి. ఆ తర్వాత 1960లో ఇక్కడ ఉప ఎన్నిక జరగ్గా.. ఈ ఎన్నికలో సికింద్రాబాద్ కి చెందిన పార్సీ సంపన్నురాలు రోడా మిస్త్రీ గెలిచారు. 1962ఎన్నికలోనూ ఆమే గెలిచారు. ఆ తర్వాత ఈ సెగ్మెంట్ హిస్టరీ 2009లో మొదలైనట్టు తెలుస్తుంది. ఈ ఎన్నికల్లో పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి గెలిచారు. అప్పటి వరకూ ఇది ఖైరతాబాద్ సెగ్మెంట్లో ఉండేది. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ గెలిచారు. 2018, 2023లోనూ ఆయనే గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. మాగంటి సైతం ఈ ప్రాంతానికి స్థానికులేం కాదు. ఆయన హైదరాబాద్ లోని హైదర్‌గూడ నివాసి. దీంతో నవీన్ యాదవ్ అన్నట్టు ఈ నియోజకవర్గానికి స్థానికులు ఎమ్మెల్యేగా అయ్యిందే లేదు. మొన్న కాంగ్రెస్ టికెట్ ఇచ్చిన అజర్ సైతం ఇక్కడి వారు కారు. మైనార్టీ ఓటు బ్యాంకు ఎక్కువగా ఉందన్న కోణంలో ఈ ప్రాంతం నుంచి ఆయన్ను పోటీకి దింపారు అధిష్టానం పెద్దలు. ఇప్పుడు తొలిసారి నవీన్ యాదవ్ తానీ ప్రాంత స్థానికుడిననీ.. మీ బిడ్డను గెలిపించాలనీ కోరుతున్నారు. అర్ధశతాబ్దం నుంచీ జూబ్లీహిల్స్ లో అన్యులు రాజ్యమేలుతున్నారనీ.. మీ ఇంటి తమ్ముడు మీరు పిలిస్తే పలకడానికి యూసఫ్ గూడ చెక్ పోస్టులోని నా ఆఫీసు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయనీ.. మీకందరికీ అందుబాటులో ఉంటానని అంటున్నారాయన. అంతే కాదు పదేళ్ల పాటు జూబ్లీహిల్స్ లో అభివృద్ధి చేయలేని పార్టీ ఇప్పుడు అధికారం కోల్పోయాక మాత్రం చేస్తుందా? అన్న లాజిక్ లాగుతున్నారు. తనపై పెట్టినవన్నీ ఫాల్స్ కేసులనీ.. అవన్నీ వీగిపోతాయి కాబట్టి.. చదువుకున్న వాడ్ని.. స్థానికుడ్ని.. నాకు ఓటు వేసి గెలిపిస్తే మీ ఇంటి మనిషిగా ఉంటూ.. మీకు అన్ని పనులు చేసి పెడతానంటున్నారు నవీన్ యాదవ్.



## బంజారాహిల్స్‌లో రూ.750 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

### రూ.750 కోట్ల భూమిని ఆక్రమించి బౌన్సర్లు, వేట కుక్కలతో కాపలా.. కబ్జా నుంచి కాపాడిన హైడ్రా

హైదరాబాద్: బంజారాహిల్స్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.750 కోట్ల విలువైన భూమిని అధికారులు కాపాడారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. గతంలో ప్రభుత్వం 5 ఎకరాల్లో 1.20 ఎకరాలను జలమండలికి కేటాయించింది. ఈక్రమంలో 1.20 ఎకరాలతో పాటు మొత్తం 5 ఎకరాల భూమి తనదంటూ పార్థసారథి అనే వ్యక్తి కోర్టుకెక్కాడు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపలా పెట్టాడు. కోర్టులో వివాదం ఉండగా మొత్తం భూమిని తన అధీనంలోకి తీసుకొని అందులో షెడ్లు నిర్మించాడు. ప్రభుత్వ భూమిని అడ్డాగా చేసుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు జలమండలి, రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ వాటర్ రిజర్వాయర్ నిర్మించాలనే జలమండలి ప్రయత్నాలను పార్థసారథి అడ్డుకున్నాడు. ఫేక్ సర్వే నంబర్ (403/52)తో ప్రభుత్వ భూమిని కొట్టేసే ప్రయత్నం చేశాడు. ఈ మేరకు పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి 403 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంటే.. 403/52తో ఆక్రమణలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధరించారు. అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌తో 5 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ పార్థసారథి క్లెయిమ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈక్రమంలో షేక్‌పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య శుక్రవారం ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారు వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్లను హైడ్రా తొలగించింది. 5 ఎకరాల చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి.. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే

హైదరాబాద్, అక్టోబర్ 10: హైదరాబాద్ మహానగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికల నగారా మోగింది. అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీల నేతలు, అధినేతలు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే ఖరారు చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీ మాత్రం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతను బరిలో నిలిపింది. బీజేపీ సైతం అభ్యర్థిని ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. అలాంటి వేళ.. బీజేపీలో చోటు చేసుకుంటున్న వరుస పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. కారు గుర్తుకు ఓటు కమల పార్టీ బలోపేతానికే అంటూ హింట్ సైతం ఇచ్చారు. దిక్కుతోచని స్థితిలో బీజేపీ కార్యకర్తలు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అంటూ ఆయన ఎద్దేవా చేశారు. చివరగా బీజేపీ ఈక్వల్ టూ బీఆర్ఎస్ అంటూ ఇంగ్లీష్ అక్షరాలతో రాసుకొచ్చారు. చివరగా జూబ్లీహిల్స్ బై ఎలెక్షన్స్ అంటూ ట్యాగ్ చేశారు. కారు, కమలం గుర్తులు ఉన్న ఫోటోలను ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. 2023 ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టినా.. హైదరాబాద్ మహానగరంలోని ప్రజలు మాత్రం బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ జంట నగరాల్లో తన ప్రభావాన్ని నిలుపుకొంది. ఆ క్రమంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ వరుసగా మరోసారి గెలిచారు. అయితే ఆయన తీవ్ర అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించారు. దీంతో ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.



దీంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ సతీమణి సునీత పేరును ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖారారు చేసింది. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం గత ఎన్నికల్లో బరిలో నిలిచి ఓడిన నవీన్ యాదవ్‌కు అవకాశం ఇచ్చింది. అదీకాక గతంలో ఇదే అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. బీజేపీ మాత్రం అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు పలువురి పేర్లను పరిశీలిస్తుంది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరును నిజామాబాద్ ఎంపీ ధర్మపూరి అర్వింద్ తాజాగా తెరపైకి తీసుకు వచ్చారు. ఆయనకు గతంలో ఏబీవీపీతో అనుబంధం ఉందంటూ ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు. దీనిపై బొంతు రామ్మోహన్ వెంటనే స్పందించారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని.. బీజేపీ నుంచి బరిలో దిగే ప్రసక్తే లేదంటూ కుండ బద్దలు కొట్టారు. కానీ బీజేపీ నుంచి ఎవరు బరిలో దిగనున్నారనే అంశంపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది. బీఆర్ఎస్ పార్టీతో గతంలో అనుబంధం కొనసాగించిన వారే.. బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారనే ఒక ప్రచారం మాత్రం స్థానికంగా కొనసాగుతోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారని తెలుస్తుంది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచి మోదీకి గిఫ్ట్ ఇస్తాం: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్: బీసీలను భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు. "నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చింది. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయి. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తాం. ఈ ఉప ఎన్నికలో గెలిచి ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి. రేపటి నుంచి కార్యకర్తలు, నేతలు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేయాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందాన్ని తిప్పికొట్టాలి" అని రామచందర్‌రావు కోరారు.

# 12 మంది గల్ఫ్ కార్మికులను వెనక్కి రప్పించాల్సిందే.. హరీష్ డిమాండ్

హైదరాబాద్ : జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 22 నెలలు గడిచినా కాంగ్రెస్ గల్ఫ్ పాలసీ, ఎన్ఆర్ఐ పాలసీకి అతి గతి లేదని విమర్శించారు. కనీసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుకు దిక్కు లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో వలసలు వాపస్ అయితే.. కాంగ్రెస్ పాలనలో వలసలు మొదలయ్యాని వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది గల్ఫ్ కార్మికులను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు.






## ఆర్మీ చేతికి అవిశ్రాంత పక్షి మార్ట్‌లెట్..!

భారత అమ్ముల పొదిలోకి త్వరలోనే మరో అధునాతన అస్త్రం చేరనుంది. రక్షణరంగంలో పరస్పర విస్తృత సహకారం కోసం భారత్-యూకే మధ్య కీలకమైన ఒప్పందం జరిగింది. దీనికింద తేలికపాటి, బహుళ ప్రయోజనకర క్షిపణి వ్యవస్థ 'మార్ట్‌లెట్'లను భారత సైన్యానికి సరఫరా చేసేందుకు అంగీకారం కుదిరింది. ఈ ఒప్పందంతో భారత గగనతల రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని కేంద్రం తమ ప్రకటనలో వెల్లడించింది. ఇంతకీ ఏంటీ 'మార్ట్‌లెట్' క్షిపణులు..? అవి ఎలా పనిచేస్తాయి?

**ఆ పక్షి పేరు మీదుగా..** ఈ మార్ట్‌లెట్ క్షిపణులను ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌కు చెందిన 'థేల్స్ ఎయిర్ డిఫెన్స్' అనే రక్షణరంగ సంస్థ అభివృద్ధి చేస్తోంది. పురాణాలు, ఇతిహాసాల్లో ఉండే 'మార్ట్‌లెట్' అనే పక్షి పేరు మీదుగా ఈ క్షిపణులకు పేరు పెట్టారు. ఎప్పుడూ విశ్రాంతి తీసుకోని, అలుపెరగని పక్షి అని దీని అర్థం. ఇవి తేలికపాటి, బహుళ ప్రయోజనకర ఎయిర్-టు-ఎయిర్, ఎయిర్-టు-సర్ఫేస్, సర్ఫేస్-టు-సర్ఫేస్, సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు.

**6 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను..** గగనతల రక్షణతో పాటు డ్రోన్లు, సాయుధ వాహనాలు వంటి మిలిటరీ టార్గెట్‌లను కూడా ఛేదించేలా వీటిని రూపొందించారు. లేజర్ బీమ్ గైడెన్స్ ఆధారంగా రూపొందించిన ఈ క్షిపణిని పదాతిదళ సైనికులు భుజంపై ఉంచుకొని ప్రయోగించే వీలు ఉంటుంది. సాయుధ వాహనాలకు అనుసంధానం చేసి హెలీకాప్టర్లు, నౌకల నుంచి కూడా ప్రయోగించొచ్చు. ఆరు కిలోమీటర్ల పరిధిలో భూ, గగనతల ముప్పును ఈ క్షిపణులు ఎదుర్కోగలవు. 13 కిలోల బరువు ఉండే ఈ మిసైల్స్ ధ్వని వేగం కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్లగలవు. వీటిని 2019 నుంచి బ్రిటిష్ మిలిటరీలో వినియోగిస్తున్నారు. ఇవే క్షిపణులను ప్రస్తుతం రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వినియోగిస్తోంది.

**భారత నేవీ కోసం రోల్స్ రాయిస్..** మరోవైపు, భారత నౌకాదళంతో కలిసి పనిచేసేందుకు బ్రిటన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్‌రాయిస్ ఆసక్తి కనబర్చింది. నౌకాదళం అభివృద్ధి చేస్తున్న దేశీయ తొలి ఎలక్ట్రిక్ యుద్ధ నౌక డిజైనింగ్‌లో ఈ కంపెనీ భాగస్వామి కానున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధ నౌకకు హైబ్రీడ్ ఎలక్ట్రిక్, పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను అందించనున్నట్లు సమాచారం.



# రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నాకు ముఖ్యం: మాజీ ఎంపీ అంజన్‌కుమార్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో అలకబూనిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ బుజ్జగించారు. అంజన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఏ పరిస్థితుల్లో టికెట్‌ను వేరే వాళ్లకు కేటాయించాల్సి వచ్చిందనే విషయాన్ని ఆయనకు వివరించారు. అనంతరం అంజన్‌తో పాటు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ చర్యలతో మనస్తాపానికి గురైనట్లు అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. కష్టకాలంలో పార్టీ వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కనపెడతారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. "పార్టీలో నేను చాలా సీనియర్. నేనెప్పుడూ ఓడిపోలేదు.. అందరూ కలిసి ఓడగొట్టారు. నాకు టికెట్ ఇస్తే గెలిచేవాడిని. కరోనాతో వెంటిలేటర్‌పై వైద్యం చేయించుకున్నా. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశాను. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టాను. రెండు సార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాను. రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నా ముఖ్య ఉద్దేశం" అని అంజన్‌కుమార్ అన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరూ జూబ్లీహిల్స్‌లో అంజన్‌కుమార్ యాదవ్ పోటీచేయాలని భావించారని.. అధిష్ఠానం వేరేవాళ్లకు టికెట్ కేటాయించిందన్నారు. కరోనా సమయంలో అంజన్‌కుమార్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని.. ఆయన కూడా కరోనా బారిన పడ్డారని చెప్పారు. నగరంలో కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని, అంజన్ సారథ్యంలోనే ఎన్నికల్లో పార్టీ ముందుకు వెళ్తుందని తెలిపారు. ఉప ఎన్నికలో అందరం కలిసి పనిచేస్తామని పొన్నం పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి భాజపా: కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇవ్వడంతో భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు సంబరాలు చేసుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. వారికి కనీసం బాధ కూడా లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వంపై ద్వేషమా.. బీసీలపై ప్రేమ లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. "అసెంబ్లీలో మద్దతు తెలిపి ఇప్పుడు సన్నాయి నొక్కులు ఎందుకు? బీసీ బిల్లుకు మేం మద్దతిచ్చాం.. కేసులో కూడా ఇంప్లీడ్ అయ్యాం. మీరెందుకు కాలేదు. సుప్రీంలో 50శాతం దాటొద్దని తీర్పు ఉంది. 9వ షెడ్యూల్‌లో పెట్టడం ద్వారా తమిళనాడులో ప్రత్యేక పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు అమలుచేశారు. రాజ్యాంగాన్ని సవరించే అవకాశం కేంద్రానికి ఉన్నా చేయడం లేదు. బాధ్యత మొత్తం భాజపా పైనే ఉంది. కానీ డొంకతిరుగుడు రాజకీయాలతో ప్రజలను పార్టీ నేతలు గందరగోళానికి గురిచేస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో



దోషి భాజపా.. వాళ్లకు మద్దతిస్తోంది భారత రాష్ట్ర సమితి. అన్ని పార్టీల నేతలను దిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. అవసరమైతే.. అన్ని పార్టీలతో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఏర్పాటు చేయాలి. ఈ బిల్లు ఆమోదం పొందితే రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ముందడుగు పడుతుంది." అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. హైకోర్టు స్టేపై ఆర్.కృష్ణయ్య మండిపాటు..

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టే జీర్ణించుకోలేకపోతున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల జీవోను, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత ఎప్పుడూ స్టే ఇవ్వలేదు అని చెప్పారు. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్టే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని సుప్రీంకోర్టు తీర్పు ఉందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టుకు విరుద్ధంగా హైకోర్టు స్టే ఇవ్వడం బీసీ ప్రజల నోరు కొట్టడమేనని.. నోటికాడ అన్నం ముద్ద లాక్కోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంటే ఇంత చిన్నచూపు, నిర్లక్ష్యమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం తన వంతు ప్రయత్నం చేసుకుంటూ వస్తుందని చెప్పారు. దీని వెనుక ఏదో కథ నడిచినట్లు అనుమానాలు ఉన్నాయన్నారు.



**ఎగువ నుంచి వస్తున్న వరదతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు 4 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయానికి 83 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 7,190 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయికి చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది.**



## నిండుకుండలా సాగర్ జలాశయం 4 గేట్లు ఎత్తి నీటి విడుదల

# జీఎస్టీ మార్పులు: ధరల, వ్యాపార, వినియోగదారుల సమగ్ర ప్రభావాలు




వస్తు మరియు సేవల పన్ను (జీఎస్టీ) భారతదేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణ. 2017 జూలై 1న 'ఒకే దేశం – ఒకే పన్ను' అనే నినాదంతో ప్రారంభమైన ఈ పన్ను విధానం భారత ఆర్థిక నిర్మాణంలో శాశ్వతమైన మార్పులకు దారి తీసింది. జీఎస్టీకి ముందు కేంద్రం, రాష్ట్రాలు వేర్వేరు పన్నులను విధించేవి %–% సెంట్రల్ ఎక్సైజ్, వ్యాట్, సర్వీస్ టాక్స్, ఎంటర్టైన్మెంట్ టాక్స్ వంటి పన్నులు ఒకదానిపై మరొకటి చేరి, వినియోగ దారునిపై ద్విగుణీకృత భారాన్ని మోపేవి. వ్యాపారవేత్తలు పన్నుల లెక్కలు, లావాదేవీలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జీఎస్టీ అమలుతో ఆ అడ్డంకులు తొలగి, దేశవ్యాప్తంగా ఒకే పన్ను వ్యవస్థ ఏర్పడింది. జీఎస్టీ అమలులోకి రాగానే పన్ను శ్రేణులు 5%, 12%, 18%, 28%గా నిర్ణయించ బడ్డాయి. అవసరాల ఆధారంగా ఈ రేట్లను జీఎస్టీ కౌన్సిల్ సమీక్షిస్తూ మార్పులు చేస్తూ వస్తోంది. పాలు, పిండి, కూరగాయలు, ఫలాలు, ఔషధాలు, విద్యా సేవలు, ప్రాథమిక అవసరాల వస్తువులపై 0%%–%5% రేట్లు ఉండగా, లగ్జరీ వస్తువులు, ఆటోమొబైల్, సిగరెట్లు, సాఫ్ట్ డ్రింక్స్, ఏసీలు, ఆభరణాలు, విలాస సేవలపై 18%%–%28% పన్నులు అమలులో ఉన్నాయి. ఈ విభజన పన్ను వ్యవస్థలో సమతౌల్యాన్ని కల్పించింది ౧ అవసరాల వస్తువులకు సడలింపు, విలాస వస్తువులకు అధిక రేట్లు. కరోనా మహమ్మారి సమయంలో (2020%–%21) కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా పన్ను రాయితీలు ప్రకటించింది. వైద్య పరికరాలు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, శానిటైజర్లు, మాస్కులు, ఆరోగ్య సేవలపై పన్ను తగ్గింపులు చేయడం వల్ల వైద్య రంగానికి ఊరట లభించింది. అదే సమయంలో ప్రాథమిక అవసరాల వస్తువులపై తాత్కాలిక రేటు తగ్గింపులు ప్రజలకు ఉపశమనం కల్పించాయి. దీని వలన ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావడమే కాకుండా ప్రజల కొనుగోలు శక్తి నిలబెట్ట బడింది. ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఆర్థిక అవసరాలు, ద్రవ్యోల్బణ ఒత్తిడి, ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలు దృష్టిలో ఉంచుకొని పన్ను రేట్లలో కొన్ని మార్పులు జరిగాయి. ముఖ్యంగా లగ్జరీ ఉత్పత్తులు, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, సిగరెట్లు, సాఫ్ట్ డ్రింక్స్ వంటి వస్తువులపై 28% వరకు పన్ను పెంచబడింది. ఈ మార్పు వల్ల వినియోగదారుల ఖర్చు సగటున 5%–10% పెరిగింది. అయితే పాలు, ధాన్యాలు, కూరగాయలు, వైద్య సేవలు, విద్యా సేవలపై తక్కువ పన్ను రేట్లు కొనసాగించడం వల్ల సామాన్య ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తోంది. జీఎస్టీ మార్పుల ప్రభావం చిన్న, మధ్యతరహా వ్యాపారాలపై స్పష్టంగా కనిపిస్తోంది. అధిక పన్ను రేట్లు ఉండే ఉత్పత్తుల తయారీ వ్యయాలు పెరగడంతో చిన్న వ్యాపారాలు లాభసాటిగా నిలబడలేక పోతున్నాయి. కొంతమంది %మీావీజు%లు ఖర్చు భారాన్ని వినియోగదారులపై మోపడం తప్ప వేరే మార్గం లేకుండా పోయింది. మరోవైపు తక్కువ రేట్ల కేటగిరీలో ఉన్న ఉత్పత్తులను తయారు చేసే చిన్న వ్యాపారాలు వేగంగా విస్తరించాయి. పన్ను చెల్లింపుల డిజిటల్ వ్యవస్థ, ఇన్వాయిసింగ్ సౌకర్యం, ఆన్లైన్ ఫైలింగ్ సిస్టమ్ వల్ల వ్యాపార పారదర్శకత పెరిగింది, అయితే కొందరు చిన్న వ్యాపారులు సాంకేతిక అవగాహన లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీఎస్టీ మార్పులు ప్రభుత్వ ఆదాయంపై కూడా ప్రభావం చూపుతున్నాయి. 2017%–%18లో కేంద్రానికి ?92,000 కోట్ల ఆదాయం లభించగా, 2024%–%25 నాటికి అది ?1.80 లక్షల కోట్లకు పెరిగింది. రాష్ట్రాల వాటా కూడా పెరుగుతూ, పన్ను వనరుల విస్తరణకు దోహద పడింది. పన్ను ఎగవేతలు తగ్గడంతో ప్రభుత్వ ఆదాయ స్థిరత్వం పెరిగింది. జీఎస్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రాల సమన్వయం పటిష్టమవడంతో పన్ను సమగ్రత స్థిరపడింది. ప్రాథమిక అవసరాల వస్తువులపై రేటు తగ్గింపులు, సబ్సిడీలు వల్ల వినియోగదారులకు సుమారు ?10,000 కోట్ల ఉపశమనం లభించింది. 2025లో అమల్లోకి వచ్చిన తాజా జీఎస్టీ సవరణల్లో 'కొత్త పన్ను అమలు'గా పిలువబడే మార్పులు ఆర్థిక కార్యకలాపాలపై మరింత స్పష్టమైన ప్రభావం చూపుతున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాల ప్రకారం కొన్ని విలాస సేవలపై అదనపు 2% సెస్ అమలు చేయబడింది. ఈ సెస్ ద్వారా కేంద్రం 'గ్రీన్ ఫండ్' సృష్టించి పర్యావరణ పరిరక్షణ, పునరుత్పత్తి శక్తి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చే యత్నం ప్రారంభించింది. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ పరికరాలు, బయోఫ్యూయెల్ ఉత్పత్తులపై పన్ను రేట్లు 12% నుండి 5%కి తగ్గించ బడ్డాయి. ఈ మార్పు పర్యావరణ అనుకూల పరిశ్రమలకు ఊతమిచ్చి, స్వచ్ఛ శక్తి రంగాన్ని ప్రోత్సహించే దిశగా దోహద పడుతోంది. అలాగే ఆన్లైన్ సేవలు, డిజిటల్ మార్కెటింగ్, ఫ్రీలాన్స్ వృత్తులు, ఇన్ఫ్లూయెన్సర్ ఆర్థిక వ్యవస్థలపై కొత్త పన్ను నియమాలు అమలవుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా ఈ వర్గాలకు ప్రత్యేక జీఎస్టీ నిబంధనలు రూపొందించ బడ్డాయి, తద్వారా డిజిటల్ వాణిజ్యం పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ నిబంధనల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగడం మాత్రమే కాదు, డిజిటల్ రంగంలో సమాన పోటీ వాతావరణం ఏర్పడుతోంది. జీఎస్టీ మార్పులు ధరల స్థిరత్వం, వినియోగదారుల కొనుగోలు శక్తి, వ్యాపారాల లాభదాయకత, ప్రభుత్వ ఆదాయ స్థిరత్వం ౧ ఈ నాలుగు ప్రధాన స్తంభాల మధ్య సమతౌల్యం సాధించే ప్రయత్నంగా కొనసాగుతున్నాయి. వినియోగదారుల కోణంలో తక్కువ రేట్లు జీవన వ్యయాన్ని తగ్గిస్తే, వ్యాపారుల దృష్టిలో వేగవంతమైన రిఫండ్ వ్యవస్థలు, ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ సౌలభ్యం వ్యాపార సౌలభ్యాన్ని పెంచుతున్నాయి. ప్రభుత్వ దృష్టిలో జీఎస్టీ ఆదాయం స్థిరంగా పెరుగుతుండడం, పన్ను ఎగవేత తగ్గడం ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేస్తోంది. ఎనిమిదేళ్ల అనుభవం చూపినట్లుగా జీఎస్టీ వ్యవస్థ పన్ను పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చింది. లావాదేవీల పారదర్శకత పెరగడం, అవినీతి తగ్గడం, వ్యాపార పద్ధతులు సాంకేతిక ఆధారితంగా మారడం వంటి ఫలితాలు కనిపిస్తున్నాయి. అయితే ఇంకా కొన్ని సమస్యలు ౧ చిన్న వ్యాపారుల రిఫండ్ ఆలస్యం, రిటర్న్ ఫైలింగ్ సాంకేతికతపై అవగాహన లేకపోవడం, గడువుల సమస్యలు వంటి అంశాలు సవాళ్లుగానే ఉన్నాయి. సమగ్రంగా చూస్తే, జీఎస్టీ మార్పులు భారత ఆర్థిక దిశను శాస్త్రీయంగా, పారదర్శకంగా మారుస్తున్నాయి. ధరల నియంత్రణ, వ్యాపార సౌలభ్యం, వినియోగదారుల రక్షణ, ప్రభుత్వ ఆదాయ స్థిరత్వం మధ్య సమతౌల్యం సాధించగలిగితే, భారతదేశం పన్ను సంస్కరణలలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. భవిష్యత్తులో జీఎస్టీ వ్యవస్థ మరింత సరళంగా, ప్రజానుకూలంగా, వ్యాపారానుకూలంగా మారే అవకాశం ఉన్నది. ఇదే జీఎస్టీ సంస్కరణల అసలైన విజయపథం ౧ అభివృద్ధి, పారదర్శకత, సమతౌల్యం కలిసిన ఆర్థిక శక్తి. **రామ కిష్టయ్య సంగన భట్ల – సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**

# ధర్మజ్ఞాన ప్రవాహం... చాగంటి కోటేశ్వరరావు




తెలుగు సాంస్కృతిక సంప్రదాయంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల్లో మేల్కొలిపి, వేదపురాణ జ్ఞానాన్ని సులభమైన భాషలో సమాజానికి చేరవేసిన ఆధునిక యుగ ధర్మబోధకులలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అగ్రగణ్యులు. ఆయన వచన జ్యోతి కోట్లాది మంది భక్తుల హృదయాలను ప్రకాశింప జేస్తూ, వేదాంత బోధనలకు ప్రజా ప్రాచుర్యాన్ని కలిగించిన మహనీయుడిగా నిలిచారు. చాగంటి కోటేశ్వరరావు 1959 జూలై 14న తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ పట్టణంలో జన్మించారు. తండ్రి చాగంటి సీతారామయ్య గారు, తల్లి అంజనమ్మ గారు. చిన్ననాటి నుంచే వేదమంత్రాల శ్రవణం, శాస్త్ర చర్చలపై ఆసక్తి ఆయనలో పుష్కలంగా కనిపించింది. రాజమండ్రిలోనే విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన వృత్తిరీత్యా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాకినాడ)లో ఉద్యోగం చేశారు. ఆయన జీవితం నిబద్ధత, నియమ పాలన, నిజాయితీకి మాదిరిగా నిలిచింది. పదవీ విరమణ అనంతరం సమస్త సమయాన్ని ఆధ్యాత్మిక ప్రసంగాలకు, ధర్మప్రచార సేవలకు అంకితం చేశారు. ప్రభుత్వ సేవ ముగిసినా ప్రజాసేవ ఆయనలో అంతర్భూతంగా కొనసాగింది. చాగంటి ప్రవచనాలు భక్తి, జ్ఞానం, తాత్వికతల సమ్మేళనం. ఆయన వాక్యాలలో శాస్త్ర సారం, జీవిత మార్గదర్శనం, మానవ విలువల ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తాయి. రామాయణం, మహాభారతం, భాగవతం, శివపురాణం, దేవీభాగవతం, ఉపనిషత్తులు, వేదాంత సూక్తులు వంటి శాస్త్ర సమూహాల సారాంశాన్ని సూటిగా, సులభంగా ప్రజలకు అందించడం ఆయన ప్రత్యేకత. ఆయన చెప్పే భాషలో కవితాత్మకత, ఆయన బోధనలో తాత్వికత, ఆయన ప్రవచనంలో ఆచరణాత్మకత సమన్వయమై ఉంటుంది. ఆయన మాటలు కేవలం వినోదం కాదు ౧ మనసును మేల్కొలిపే జ్ఞాన స్ఫురణ. చాగంటి ప్రవచనాల ప్రధాన ఉద్దేశ్యం శాస్త్ర జ్ఞానాన్ని జీవన జ్ఞానంగా మార్చడం. ఆయన తరచూ చెబుతారు ౧ "శాస్త్రం పుస్తకంలో ఉండకూడదు, మన హృదయంలో ఉండాలిబీ ప్రార్థన దేవునికోసం కాదు, మన మనసు శాంతికోసం." ఈ వాక్యమే ఆయన ఆధ్యాత్మికతకు ప్రతీక. రామాయణం ఆయనకు భక్తి శాస్త్రం, మహాభారతం ధర్మ విజ్ఞానం, భాగవతం ఆత్మ వికాసానికి మార్గదర్శి. ఆయన ప్రవచనాలు వింటే పౌరాణిక కథలు మన ముందే సజీవమవుతాయి. భక్తి టీవీ, ఎస్వీబీసీ, ఇతర భక్తి చానెల్స్, యూట్యూబ్ వేదికల ద్వారా ఆయన ప్రవచనాలు కోట్లాది మంది ప్రజలకు చేరాయి. ఆయన 42 రోజుల రామాయణ పారాయణం, 42 రోజుల శ్రీమద్భాగవత ప్రవచనం, శివ పురాణం, లలితా సహస్రనామ బోధనలు విస్తృత ప్రజాదరణ పొందాయి. తిరుమలలో జరిగిన మహా భాగవత ప్రవచన శ్రేణులు ఆయనకు జాతీయ స్థాయి ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016లో ఆయనను రాష్ట్ర సాంస్కృతిక సలహాదారుగా నియమించింది. అదేవిధంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమానికి ఆయనను బ్రాండ్ అంబాసడర్గా నియమించడం ఆయన సేవలకు ప్రభుత్వ గుర్తింపు. చాగంటి ప్రవచనాల్లో హాస్యం, ఉదాహరణ, శాస్త్రం, సంస్కారం అన్నీ సమన్వయమై ఉంటాయి. ఆయన వ్యంగ్యం కూడా శాంతి, సత్యం, ధర్మం వైపు దారి తీస్తుంది. కుటుంబ విలువలు, దంపతుల పరస్పర గౌరవం, పిల్లల్లో సంస్కారం, సమాజంలో నైతిక జీవనశైలి, ఆచరణీయ ధర్మం ౧ ఇవన్నీ ఆయన ప్రసంగాల్లో తరచూ ప్రతిధ్వనిస్తాయి. ఆయన "సంస్కారం లేని భక్తి అర్థరహితంబీ భక్తి లేని విద్య హృదయ రహితం" అని చెప్పిన వాక్యం ఆయన ఆలోచనా లోతుని ప్రతిబింబిస్తుంది. ఆయన ప్రసంగాలు భక్తిని మాత్రమే కాదు, మనస్సును శుద్ధి చేసే ఆధ్యాత్మిక సాధనాలు. చాగంటి బహుమతులను, ఆర్థిక లాభాలను స్వీకరించరుబీ ఆయన ఆధ్యాత్మిక వాక్య ప్రచారం స్వార్థ రహితం. ప్రజల ఆధ్యాత్మిక మేలు కోసం మాత్రమే మాట్లాడుతారు. ఈ ఆచరణ ఆయనలోని నిజమైన సన్యాసత్వానికి నిదర్శనం. ఆయన ప్రసంగాల ద్వారా ఎన్నో కుటుంబాలు ధార్మిక విలువలకు మళ్లాయిబీ యువత ధర్మబద్ధ జీవనానికి ఆకర్షితమయ్యారు. ఆయన రచనలు, పుస్తకాలు, ఆడియో, వీడియో ప్రసంగాలు భక్తి, జ్ఞానం, తాత్వికతను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమైనా అవగాహన లోపం తొలగగానే ప్రజలు ఆయన ఉద్దేశ్యాన్ని గౌరవంగా అర్థం చేసుకున్నారు. ఆయన ప్రతి ప్రసంగం సత్యాన్ని సున్నితంగా చెప్పే శైలికి ముద్ర. ఆయన చెబుతారు ౧ "ధర్మం మనిషిని దేవుని దగ్గరికి తీసుకుపోదుబీ అది మనిషిని నిజమైన మనిషిగా మలుస్తుంది." ఇదే ఆయన బోధనలోని తాత్విక సారం. చాగంటి కోటేశ్వరరావు ఆధునిక వ్యాసులుబీ ఆయన జీవితం ఒక ఉపనిషత్తు వంటిది. ఆయన చెప్పిన ప్రతి మాటలో వేదాంతముంది, బోధించిన ప్రతి అంశంలో భక్తితత్త్వముంది, చూపిన ప్రతి దారిలో జీవన మార్గదర్శకం ఉంది. ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవం భక్తి మాత్రమే కాదు, బుద్ధి పట్ల ఉన్న మన్నన కూడా. జ్ఞానం విన్నవాడు పండితుడు, జ్ఞానం పంచినవాడు గురువు, జ్ఞానాన్నే జీవించినవాడు చాగంటి కోటేశ్వరరావు. ఆయన వాక్యజ్యోతి ఎప్పటికీ ఆరని దీపంలా తెలుగు భూమిలో వెలుగుతూ ఉంటుంది. ఇంతటి గొప్ప ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దక్షిణ కాశీగా, నవ నరసింహ క్షేత్రాలలో ఒకటిగా, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు త్రిమూర్తుల నిలయంగా, ఈ క్షేత్రాన్ని దర్శిస్తే యమ లోకం వెళ్ళే అవకాశం అవసరం ఉండదని పేరెన్నిక గన్న, గంభీర గౌతమీ తీరాన వెలసిన తీర్థం క్షేత్రం అయిన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శ్రీమఠం స్వామి మైదాన ప్రాంగణంలో శనివారం, ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి 8గంటల వరకు ప్రవచనాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు చాగంటి ధర్మపురిలో ప్రవచించ డానికి అంగీకరించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశానుసారం దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తలు, ఈఓ శ్రీనివాస్, సిబ్బంది, అధికారులు, ప్రభుత్వ, మున్సిపల్, దేవస్థాన ఉద్యోగులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు, స్వాగత తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల**

# ఇజ్రాయెల్-హమాస్ సీజ్ ఫైర్.. ట్రంపే కుదిర్చాడా..?



మధ్యప్రాచ్యంలో ఏళ్లుగా కొనసాగుతున్న రక్తపాతం, విధ్వంసం, అనిశ్చితికి తెరపడనుంది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం తొలి దశపై సంతకాలు జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ రాజకీయాల్లో ముఖ్య మలుపుగా భావించవచ్చు. ఇది కేవలం రెండు పక్షాల మధ్య తాత్కాలిక శాంతి కాకుండా, గాజా ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే ప్రయత్నంగా కూడా చూడవచ్చు. ఈ ఒప్పందంలో ప్రధానంగా గాజాలో బంధీగా ఉన్న ఇజ్రాయెల్ పౌరుల విడుదలకానున్నారు. అలాగే హమాస్ నిర్బంధంలో ఉన్న మరికొంత మంది సైనికులను తిరిగి పంపడం వంటివి జరగనున్నాయి. ప్రతిగా, ఇజ్రాయెల్ తమ బలగాలను గాజా సరిహద్దు ప్రాంతాల నుంచి వెనక్కు పిలిపించనుంది.

ఈ చర్య, పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించే తొలి ప్రయత్నంగా భావించవచ్చు. ఈ ఒప్పందం పటిష్ఠంగా కొనసాగేందుకు అంతర్జాతీయ హామీలు, యునైటెడ్ నేషన్స్ పర్యవేక్షణ కీలకం కానుంది. కేవలం సంతకాలతో కాదు.. ఆచరణలో నిజమైన శాంతి కోసం రెండు పక్షాలు కూడా నిరంతరం కృషి చేయాలి.

**మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు..** ఈ సీజ్ ఫైర్ గురించి భారత ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది గొప్ప నిర్ణయం అన్నారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం కనుగొనడం గొప్ప విషయం అన్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వంపై శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల్లో ఇక శాంతి పూలు పూయాలని ఆకాంక్షించారు.

**వ్యూహాత్మక అడుగు...** ట్రంప్ ప్రకటించిన ఈ పీస్ ప్లాన్ అమెరికా విదేశాంగ వ్యూహానికి భాగమని చెప్పాలి. మధ్యప్రాచ్య రాజకీయాల్లో తిరిగి తన ఆధిపత్యాన్ని చాటుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఒప్పందం జరిపినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ, దీనివల్ల ఆ ప్రాంత ప్రజలకు ఊరట లభిస్తే, అది ప్రపంచానికే లాభమని చెప్పాలి. సీజ్ ఫైర్ ఒప్పందం తొలి దశ మాత్రమే. హమాస్ మిలిటెంట్ల భవిష్యత్ పాత్ర, గాజా పునర్నిర్మాణం, ఇజ్రాయెల్ భద్రతా ఆందోళనలు వంటి అంశాలు ఇంకా ముందున్నాయి. యుద్ధం కన్నా ఇరు దేశాలు శాంతిగా మాట్లాడుకోవడమే మంచిది.

**శాంతికి నూతన ఆరంభం..** గాజా నేతపై పూలు పూయాలంటే తుపాకీ నోరు మూసుకోవాల్సిందే. ఈ సీజ్ ఫైర్ ఆ దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగు. ఈసారి శాంతి కేవలం ఒప్పంద పత్రాల్లో కాకుండా ప్రజల మనసుల్లో కూడా రావాలని ప్రపంచం ఆశిస్తోంది. యుద్ధం వల్ల ఎంత నష్టం జరిగిందో ఇరు దేశాలకు తెలిసి రావాలి. శాంతి విలువ ఏపాటితో అర్థం చేసుకోవాలి. గాజాలో నిర్మాణాల అవశేషాలు, నిరాశ్రయులైన వేలాది కుటుంబాలు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల ఆర్తనాదం ఇవన్నీ ఆ దేశం గుర్తుంచుకోవాలి. ఈ ఒప్పందం కేవలం రాజకీయ పత్రం మాత్రమే కాదు.. అది మానవతకు ఒక కొత్త పాఠం కావాలి. ఇజ్రాయెల్, హమాస్ మధ్య నమ్మకం పునరుద్ధరించడానికి ఈ ఒప్పందం తొలి అడుగుగా ఉండొచ్చు. కానీ దీన్ని నిలబెట్టే బాధ్యత కేవలం రాజకీయ నాయకులదే కాదు.. ఆయా దేశాల్లోని పౌరులపై కూడా ఉంది. అంటే.. ద్వేషాన్ని వదిలి, పరస్పర అర్థం చేసుకోవడం మాత్రమే శాశ్వత శాంతికి దారి చూపగలదు. ప్రపంచ శాంతికి వేదికగా అమెరికా ప్రయత్నం కొనసాగుతున్నప్పటికీ, స్థానిక వాస్తవాలను విస్మరించద్దు. గాజా పునర్నిర్మాణం, ఆర్థిక సాయం, విద్యా అవకాశాలు ఇవన్నీ భవిష్యత్తులో స్థిరత్వానికి ఆధారం కావాలి. చరిత్రలో ఎన్నో ఒప్పందాలు కాగితం మీదే మిగిలిపోయాయి. ఈసారి అలా కాకుండా.. ప్రతి గాజా చిన్నారి చిరునవ్వు చూడగల భవిష్యత్తు కోసం ఈ సీజ్ ఫైర్ ఉండాలని ప్రపంచం కోరుకుంటోంది.

# రావల్పిండి చికెన్ టిక్కా.. ముజఫరాబాద్ కుల్ఫీ ఫలూదా.. ఎయిర్ ఫోర్స్ డే డిన్నర్ మెనూ వైరల్

భారత వైమానిక దళం 93వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన డిన్నర్ మెనూ వైరల్ అవుతోంది. దీనికి సంబంధించిన మెనూ కార్డు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఇటీవల పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో పలు ఉగ్రశిబిరాలపై మన దళాలు విరుచుకుపడిన సంగతి తెలిసిందే. నాటి దాడుల్లో ముఖ్యమైన లక్ష్యాలను గుర్తు చేసేలా డిన్నర్ లో వడ్డించిన పలు ఆహార పదార్థాలకు పేర్లు పెట్టారు. రావల్పిండి చికెన్ టిక్కా.. ముజఫరాబాద్ కుల్ఫీ ఫలూదా వంటి ఉగ్ర శిబిరాల పేర్లతో వంటలు తయారు చేశారు. అంతేకాకుండా ఆయా వంటల పేర్లతో ఒక ఆహ్వాన పత్రం ముద్రించి సైనికాధికారులకు పంపించారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పునావాలా ఎక్స్ లో దీనికి సంబంధించిన ఫొటోను షేర్ చేశారు. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఆ ఫొటోకు నెటిజన్లు పలు కామెంట్స్ చేస్తున్నారు. ఇక మెనూ కార్డులో '93 సంవత్సరాల ఐఏఎఫ్..




తప్పుపట్టలేని, అపారమైన కచ్చితమైనది' అనే టైటిల్ తో ముద్రించారు. ఇక ఆ మెనూలో పాకిస్థాన్ నగరాలు, పాక్ ఆక్రమిత ప్రాంతాల పేర్లతో వంటకాలను తయారు చేసినట్లు పేర్కొన్నారు. రావల్పిండి చికెన్ టిక్కా మసాలా, రఫీకీ రర్హా మటన్, భోలారి పనీర్ మేతి మలై, సుక్కుర్ షామ్ సవేరా కోఫ్తా, సర్గోధా దాల్ మఖానీ, జాకోబాబాద్ మేవా పులావ్, బహవల్పుర్ నాన్, ఇక డెజర్టల విషయానికొస్తే బాలకోట్ తిరమిసు, ముజఫరాబాద్ కుల్ఫీ ఫలూదా, మురిద్కే మీతా పాన్ ఉన్నాయి. ఇవన్నీ పాకిస్థాన్ తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దాడులు చేసిన ప్రాంతాలే కావడం విశేషం. రావల్పిండి పాకిస్థాన్ లోని ప్రధాన సైనిక స్థావరం, ఆ దేశంలో సైనిక కార్యకలాపాలకు రావల్పిండి కేంద్రం. ఇస్లామాబాద్ పక్కనే ఉన్న ఈ నగరం ఆర్థిక, రవాణా పరంగా కీలకంగా చెబుతారు. ఇక రావల్పిండి సమీపంలో నూర్ఖాన్ ఎయిర్బేస్ ఉంది. భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు ఉన్న సందర్భాల్లో ఈ ప్రాంతంలోని సైనిక స్థావరాలు వార్తలలో నిలుస్తాయి. అదేవిధంగా సుక్కుర్, జాకోబాబాద్ సింధ్ ప్రావిన్స్ లో ఉంటాయి. సర్గోధా, బహవల్పూర్ పంజాబ్ ప్రావిన్స్ లో ఉన్నాయి. బాలాకోట్ ఖైబర్ పఖ్తూన్ఖ్వా ప్రావిన్స్ లో ఉండగా, ముజఫరాబాద్ ఆక్రమిత కాశ్మీర్ లో భాగంగా చెబుతున్నారు.

# ముష్కర ముఠా కొత్త కుట్ర.. జైషే మహిళా బ్రిగేడ్!!

పహల్గాం దాడికి ప్రతీకారంగా మన సైనికులు జరిపిన దాడులతో పూర్తిగా దెబ్బతిన్న జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ కొత్త కుట్రలకు తెరతీసిందని ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. 'ఆపరేషన్ సిందూర్'తో కకావికలమైన ఉగ్రవాదులు ఇప్పటికే తేరుకోలేకపోయారు. పలు ఉగ్రవాద కేంద్రాలపై మన దేశ వైమానిక దళం దాడులు చేయడంతో వందల మంది ఉగ్రవాదులు మరణించారు. ఇక ఈ నష్టం నుంచి బయటపడేందుకు ముష్కర ముఠాలు కొత్త ఎత్తుగడులు వేస్తున్నట్లు సమాచారం. భారత్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఉగ్రవాదుల భార్యలతో ప్రత్యేక మహిళా బ్రిగేడ్ తయారు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత కోలుకోడానికి ప్రయత్నిస్తున్న మసూద్ అజహర్ మహిళా బ్రిగేడ్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రిక్రూట్మెంట్ నిర్వహిస్తున్నట్లు మన నిఘా వర్గాలు గుర్తించాయని అంటున్నారు. ఈ మేరకు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు ప్రత్యేక కథనాలు ప్రసారం చేశాయి. 'జమాతే ఉల్ మామినాత్' పేరుతో ఈ స్పెషల్ బ్రిగేడును జైషే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



ఇందుకోసం బహవల్పూర్లోని జైషే ప్రధాన కేంద్రంలో నియామకాలు ప్రారంభించినట్లు చెబుతున్నారు. ఈ కొత్త యూనిట్ కు మసూద్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్ పూర్ లోని ఈ జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో జైషే కేంద్రం దారుణంగా ధ్వంసమవడమే గాక, మసూద్ అజార్ కుటుంబానికి చెందిన పది మంది మరణించారు. ఈ విషయాన్ని ఇటీవల జైషే కమాండర్ కూడా ధ్రువీకరించారు. మరణించిన వారిలో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. ప్రధానంగా జైషే మహిళా బ్రిగేడులో ఆ సంస్థ కమాండర్ల భార్యలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. వీరితోపాటు బహవల్పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను నియమించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐసిస్, బోకో హరామ్, హమాస్ వంటి ఉగ్ర ముఠాలు మహిళలను నియమించుకుని వారిని ఆత్మాహుతిదాడులకు ఉపయోగించుకున్న ఘటనలు నమోదయ్యాయి. ఇప్పుడు జైషే కూడా అదే పంథాను అనుసరించేందుకు సిద్ధమవుతోందని అంటున్నారు.

చురకలు

## సంపాదకీయం

# ఉచితాలు అనుచితాలు... పెద్దాయన చెప్పారు వినండయ్యా !

కాదేదీ ఉచితం ఈ లోకంలో. ఏదీ ఫ్రీగా రాదు, ఒకరికి ఒక చోట ఉచితంగా ఇచ్చారు అంటే మరో చోట ఇంకొందరి కష్టం నుంచి మాత్రమే దాన్ని తెచ్చి ఇస్తున్నారు అని అర్ధం. అంటే ఉచిత పథకాలు అమలు అవుతున్నాయి అంటే పన్నులు చెల్లించే వారి రెక్కల కష్టం నుంచి మాత్రమే అని గుర్తించాలి. సమ సమాజం కోసమే ఇదంతా అన్న వాదన కూడా తార్కికంగా చెల్లదని అంటున్నారు. ఎందుకంటే ఉచితాలు అందుకున్న వారు ఎప్పటికీ ఆర్ధికంగా బలోపేతం అయినది చరిత్రలో ఎక్కడా లేదు అని కూడా ఆర్ధిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అందుకే ఉచితాలు వద్దు మహాప్రభో అని అంతా మొర పెట్టుకుంటున్నారు.

**జనాలకు అర్ధమైంది :** ఓటర్లే ఎపుడూ తెలివైన వారు ఎందుకంటే వారి బుర్రలో అన్ని పార్టీలూ ఉంటాయి. సుదీర్ఘమైన కాలం పాటు ఉమ్మడి ఏపీలో పాలించిన కాంగ్రెస్ ని దించి తొమ్మిది నెలల టీడీపీకి పట్టం కట్టారు అంటే జనాల తెలివిని వెల కట్టడం ఎవరికి సాధ్యం అని అంటారు. ఇందిరమ్మని అమ్మగా చూసిన వారే తరువాత కాలంలో ఓడించేశారు. అంతే కాదు స్వయంగా ఆమె పోటీ చేసిన చోట కూడా ఎంపీగా కూడా గెలిపించలేదు అంటే ఓటర్ల వ్యూహాల ముందు ఎవరైనా బలదూర్ అన్నది అర్ధం అవుతోంది కదా. ఇక ఉచితాల విషయంలో ఓటర్ల మైండ్ సెట్ ఎలా ఉంటుంది అంటే ఎవరైనా తమ జేబులో నుంచి తీసి ఇస్తున్నారా అన్నదే.

**జగన్ ని ఓడించారుగా :** తన చేతికి ఎముక లేదని తానే సంక్షేమ సృష్టి కర్తను అన్నట్లుగా ఏకంగా రెండు లక్షల డెబ్బై వేల కోట్ల రూపాయల సొమ్ముని ప్రజల ఖాతాలో నగదు బదిలీ పథకం ద్వారా అయిదేళ్ళూ ఇచ్చిన జగన్ ని 2024 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఎందుకు ఓడించారు అంటే పథకాలకు ఇచ్చిన సొమ్ము ఆయన జేబులో నుంచి ఇచ్చినది కాదని అర్ధం చేసుకోబట్టే అని అంటున్నారు. అంతే కాదు చంద్రబాబు అంతకంటే ఎక్కువ ఇస్తాను అని అనబట్టే అని కూడా చెబుతున్నారు. మరి రేపటి రోజున జగన్ ఇంతకంటే ఎక్కువ పథకాలు డబ్బులు పెంచి మరీ ఇస్తాను అంటే చంద్రబాబు ఇస్తున్న పథకాల సంగతేంటి అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది కదా అని సైతం అంటున్నరు.

**ఉచిత బస్సు కస్సు బుస్సు :** ఏపీలో ఉచిత బస్సు వల్ల ఒరిగిందేమీ లేదని అంటున్నారు. ఉచితంగా బస్సు ఎక్కి కిక్కిరిసిపోయిన తరువాత మహిళలు విమర్శించేది ప్రభుత్వాన్నే అని అంటున్నారు ఎక్కువ బస్సులు వేయలేదని కూడా నిందిస్తున్నారు. పురుషులు అయితే ఈ బస్సుల వల్ల తమ కొంప ముంచారు అని అంటున్నారు. ఆటో డ్రైవర్లు అయితే సరే సరిగా ఉంది. తమ ఉపాధి పోయింది అని వారు మండి పోతున్నారు. మరో వైపు చూస్తే ఉచిత బస్సుల వల్ల తాము సమయానికి విధులకు వెళ్ళలేకపోతున్నామని మహిళా ఉద్యోగులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ స్కీం ఏ మేరకు ఓట్లు తెస్తుందని ప్రశ్నలు ఉన్నాయి.

**వెంకయ్య చెప్పింది వాస్తవం :** ఉచిత బస్సులతో సహా ఫ్రీబీస్ మీద మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు తీవ్ర స్థాయిలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాజాగా నెల్లూరు పర్యటనలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా విషయాలే చెప్పారు. అసలు ఉచితాలు ఎందుకు అని ప్రశ్నించారు దానికి బదులు అభివృద్ధి చేసి చూపించాలని అన్నారు. ఉచితాల వల్ల జనాలలో సంతృప్తి పెరగకపోగా మరిన్ని కోరుకుంటారని వాటిని తీర్చడం ఎవరి తరమని లాజిక్ తో కూడిన ఆయన ప్రశ్నకు జవాబు అయితే లేదు మరి. అప్పులు చేసి మరీ ఉచితాలు అందించడం అవసరమా అన్న సూటి ప్రశ్నకు సమాధానం కోసం వెతుక్కోవాల్సిందే. అంతే కాదు ఎన్ని అప్పులు తెస్తున్నారు, ఎందుకోసం తెస్తున్నారు, అయిదేళ్ళలో చేసిన అప్పులేమిటి వాటిలో దిగిపోయేనాటికి ఎన్ని తీరుస్తున్నారు ఇలాంటి ప్రశ్నలు పెద్దాయన చాలానే వేశారు. మరి ఉచితాల వెంట బడుతూ ఓట్ల పంట పండించుకుందామని చేసే ప్రయత్నాలు పెద్దగా ఫలించవని కూడా అంటున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ఉచితాలు అమలు అవుతున్నాయి. అధికార పక్షమైనా విపక్షమైనా కూడా ఈ విషయంలో ఒకటికి పది సార్లు ఆలోచించాలని అంతా కోరుకుంటున్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ హీరో జయప్రకాష్ నారాయణ్ - అక్టోబర్ 11... 'లోక్ నాయక్' జన్మదినం



జె.పి.గా సుప్రసిద్దులైన జయప్రకాశ్ నారాయణ్ (అక్టోబరు 11, 1902, అక్టోబరు 8, 1979) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, రాజకీయ నాయకుడు. సిద్ధాంత కర్త, సోషలిస్ట్ నాయకుడు. ఆయనను "క్విట్ భారతదేశం ఉద్యమం హీరో" అని పిలుస్తారు. 1970 వ దశకంలో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా ప్రతిపక్షానికి నాయకత్వం వహించి సంపూర్ణ విప్లవానికి పిలుపు నివ్వటం ద్వారా జయప్రకాశ్ నారాయణ్ చిరస్మరణీయు డయ్యాడు. ఆయనను ప్రజలు "లోక్ నాయక్" అని సగౌరవంగా పిలుచు కుంటారు. గత భారత ప్రభుత్వం ఆయన జయంతిని "ప్రజాస్వామ్య పరిరక్షణ దినం"గా ప్రకటించింది. జయప్రకాశ్ నారాయణ్ బెంగాల్ ప్రెసిడెన్సీ లోని ఉత్తర ప్రదేశ్ లోని బలియా జిల్లాకు, బీహారు లోని సారన్ జిల్లాకు మధ్యన గల సీతాబ్ది యారా గ్రామంలో 1902 అక్టోబర్ 11న జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్యను, కళాశాల విద్యను పాట్నాలో అభ్యసించాడు. అటుపిమ్మట అమెరికాలో 8 సం.లు, వివిధ విశ్వ విద్యాలయా లలో ఉన్నత విద్యనభ్యసించాడు. అమెరికాలో ఉన్న సమయంలో మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేశాడు. ఆ కాలంలోనే యం.యన్.రాయ్ రచనల ప్రభావానికి లోనయ్యాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) లో చేరాడు. 1920లో జయప్రకాశ్ నారాయణ్ స్వాతంత్ర్య సమర యోధురాలు, కస్తూరిబా గాంధీ అనుచరురాలు అయిన ప్రభావతీ దేవిని వివాహ మాడాడు. అమెరికా నుండి వచ్చిన వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు ఇండియన్ నేషనల్ కాంగ్రెసులో చేరి త్వరలోనే మహాత్మా గాంధీకి ప్రియ శిష్యుడుగా మారాడు. 1932లో శాసనోల్లంఘన ఉద్య మంలో పాల్గొన్నందుకు భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932 లో ఆయనకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించ బడింది. విడుదలైన తరువాత కాంగ్రెసులో అంతర్భాగంగా కాంగ్రెస్ పార్టీలోని వామపక్ష సమూహంలో, వామపక్ష భావాలతో స్థాపించ బడిన కాంగ్రెసు సోషలిష్టు పార్టీ స్థాపనకు కృషి చేసి, జనరల్ సెక్రటరీగా నియమించ బడ్డాడు. ఈ పార్టీ భారత స్వాతంత్ర్య ప్రచారానికి నాయకత్వం వహించిన సంస్థ. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో సీనియర్ కాంగ్రెసు నేతలంతా అరెష్టు చేయబడిన సమయంలో జయప్రకాశ్ నారాయణ్... రాం మనోహర్ లోహియా, బాసవన్ సింగ్ వంటివారితో కలసి ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ వైపు పాల్గొనడాన్ని వ్యతిరేకించి నందుకు 1939 లో బ్రిటిష్ వారు మళ్లీ జైలు పాలయ్యారు, కాని తరువాత అతను నాటకీయంగా తప్పించు కున్నాడు. కొంతకాలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, హింసాత్మక ప్రతిఘటనను, నిర్వహించడానికి ప్రయత్నించి, 1943 లో అరెస్టయి, 1946 లో విడుదలైన తరువాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మరింత ఉగ్రవాద విధానాన్ని అవలంబించాలని కాంగ్రెస్ నాయకులను ఒప్పించడానికి ప్రయత్నించారు. స్వాతంత్ర్యా నంతరం జె.పి. ఆచార్య నరేంద్ర దేవ్, బాసవన్ సింగ్ మొదలైన వారితో కలసి కాంగ్రెసు నుండి బయటకు వచ్చి తమ సోషలిస్టు పార్టీ ద్వారా ప్రతిపక్ష పాత్ర పోషించారు. 1948 లో ఆయన, చాలా మంది కాంగ్రెస్ సోషలిస్టులతో కలిసి కాంగ్రెస్ పార్టీని వీడారు. అలా 1952 లో ప్రజా సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. అనంతరం బీహారు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల రాజకీయాలలో ఈ పార్టీ ప్రముఖ పాత్ర పోషించింది. 1954 లో జె.పి. రాజకీయాల నుండి విరమించుకుని తన జీవితాన్ని ప్రముఖ గాంధేయవాది అయిన ఆచార్య వినోబా భావే యొక్క సర్వోదయ ఉద్యమానికి, దానిలో అంతర్భాగమైన భూదాన్ ఉద్యమా నికి అంకితం చేశాడు. తన భూమి నంతా పేద ప్రజలకు ఇచ్చివేసి హజారిబాగ్‌లో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాడు. జె.పి. త్వరితగతిన భారతదేశంలో మహాత్మా గాంధీ భావాలకు అనుగుణంగా ఆయన అడుగు జాడలలో నడుస్తున్న సర్వోదయ ఉద్యమ కారులలో కెల్లా ప్రముఖునిగా రూపొందాడు. 1960 వ దశకం చివరిలో జయప్రకాశ్ నారాయణ్ తిరిగి బీహారు రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీలంగా వ్యవహరించ నారంభించాడు. 1974 లో నారాయణ్ అకస్మాత్తుగా భారత రాజకీయ రంగంలో ప్రధాని అవినీతి మరియు పెరుగుతున్న అప్రజాస్వామిక ప్రభుత్వంగా తీవ్రంగా విమర్శించారు. బీహారులో జె.పి. నాయకత్వం వహించిన ఒక విద్యార్థి ఉద్యమం ఆతర్వాత బీహారు ఉద్యమంగా ప్రసిద్ధి పొందిన ఒక ప్రజా ఉద్యమంగా మారినది. ఈ ఉద్యమ సమయం లోనే శాంతి యుతమైన సంపూర్ణ విప్లవానికి జె.పి. పిలుపునిచ్చాడు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఆరోపణల క్రింద నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీని దోషిగా పేర్కొంటూ అలహా బాదు హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే జె.పి. ఇందిర రాజీనామాకు డిమాండ్ చేసి, మిలిటరీకి, పోలీసు యంత్రాంగానికి చట్ట విరుద్ధమైన, అనైతికమైన ఆజ్ఞలను పాటించ నవసరం లేదని సూచించాడు. ఈ పరిణామాలు ఇలా జరుగు తుండగానే ఇందిరాగాంధీ 1975 జూన్ 25 అర్ధరాత్రి నుండి దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెనీ) ని విధించింది. జె.పి.ని, ప్రతిపక్ష నేతలను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆఖరికి కాంగ్రెసు పార్టీ లోనే యంగ్ టర్క్‌లుగా పిలువబడుతున్న అసమ్మతి నేతలు కూడా అరెస్టు చేయబడ్డారు. జె.పి. ఛండీఘర్లో డిటెన్యూగా ఉంచబడ్డాడు. బీహారు వరదల సమయంలో అచటి పునరావాస కార్యక్రమాన్ని పర్యవేక్షించుటకు పెరోల్ పై విడుదల కోరినా కూడా ప్రభుత్వం తిరస్కరించింది. ఆఖరికి జె.పి. ఆరోగ్యం క్షీణించడంతో నవంబరు 12 న విడుదల చేయబడ్డాడు. చివరికి ఇందిరా గాంధీ జనవరి 18, 1977న ఎమర్జెన్సీని తొలగించి ఎన్నికలను ప్రకటించడంతో ఆమెను ఎదుర్కోవటానికి కాంగ్రెసుకు వ్యతిరేకంగా జె.పి.మార్గదర్శకత్వంలో జనతా పార్టీ రూపుదిద్దుకున్నది. చివరికి జనతా పార్టీ ఎన్నికలలో కాంగ్రెసును ఓడించి, ఇందిరను గద్దె దింపి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచిన మొట్ట మొదటి కాంగ్రెసేతర పార్టీగా చరిత్రలో స్థానం సంపాదించింది. భారతదేశంలో ప్రజాస్వామ్య పునరుద్దరణకు పోరాడిన లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అక్టోబరు 8, 1979లో మరణించాడు. మరణానంతరం 1998లో భారత ప్రభుత్వం ఇతనికి దేశంలో అత్యున్నత పురస్కారమైన భారత రత్న ను ప్రకటించింది. ఇదిగాక జె.పి. చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా 1965లో మెగసెసే అవార్డు ప్రకటించబడింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బాలికల హక్కుల పరిరక్షణకుసమాజం సన్నద్ధం కావాలి - అక్టోబర్ 11...అంతర్జాతీయ బాలికా దినోత్సవం





అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహించ బడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కెనడా తన తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళామంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసిందిబీ 2011, డిసెంబరు 19న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2012, అక్టోబరు 11న తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఆమోదించే తీర్మానానికి ఓట్లు వేయగా, అధికారికంగా బాలికా దినోత్సవం గుర్తించబడిందిని తీర్మానం పేర్కొంది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వాషింగ్టన్ లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు. ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, నలుగురిలో బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్యసమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను, కుటుంబాలను కోరింది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిల పట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవు తున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాప్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగు తున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పత్రికల పంపిణీలో పేపర్ బాయ్స్ నిరుపమాన సేవలు

## – పేపర్ బాయ్స్ సేవలను గుర్తించాలి – అక్టోబర్ 11...అంతర్జాతీయ వార్తాపత్రిక క్యారియర్ దినోత్సవం

ఆధునిక సమాజంలో ప్రింట్ మీడియా కన్నా సోషల్ మీడియా వేగవంతంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ ఫోన్ లు అందుబాటు లోకి వచ్చాక డిజిటల్ యుగంలో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం నానాటికీ పెరిగిపోతోంది. అప్డేట్స్ తో వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ మాధ్యమాల ద్వారా విషయం వెనువెంటనే బహిరంగం అవుతుండగా, ప్రింట్ మీడియా వాటి వేగానికి, టెక్నిక్స్ కు పోటీ పడలేక పోతోంది. లైవ్ వీడియోలతో వస్తున్న అంశాలు, బ్రేకింగ్ న్యూస్ కోసం అధిక సంఖ్యాకులు ప్రభావితులు అవుతున్నారన్నది వాస్తవం. నేటి వార్త తెల్లవారి మార్కెట్ లోకి ప్రచురితం అయి వచ్చే సాంప్రదాయ పత్రికల కోసం చాలామంది ఎదిరి చూసే పరిస్థితులు కనిపించడం బాధాకరం. ఒకనాడు నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు వార్తా పత్రికలు మాత్రమే చెరవేసేవి. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్యవర్తిత్వం వహిస్తూ వారథులుగా పత్రికలు పని చేసేవి. ప్రజా బాహుళ్యానికి నిత్యం చైతన్య పరుస్తూ, ప్రగతికి బాటలు వేసేవి. ఇప్పటికీ కొన్ని ఆ పనులు చేస్తూనే ఉన్నాయి. గతంలో దిన, వార, పక్ష, మాస, ద్వైమాసిక, పత్రికలు...సాహిత్య, విద్య, ఉపాధి, పరిశోధన, సినిమా, హాస్య, విజ్ఞాన, ఆధ్యాత్మిక పత్రికలు... చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి పిల్లల పత్రికలు వివిధ రకాలుగా అలరించేవి. దిన పత్రికలు ప్రాచుర్యాన్ని పొందాక, సమాచార వ్యవస్థ అంతంత మాత్రమే ఉన్న నాటి రోజుల్లో నేటి పేపర్ రేపు, ఉదయం రావాల్సిన పత్రికలు మధ్యాహ్నం పాఠకుల చేతికి చేరేవి. అయితే వేగవంతంగా పాఠకుని గుమ్మానికి పత్రికలను చేర్చేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చి, ప్రచురణ కేంద్రాలను పెంచుకుని, సర్క్యులేషన్లను త్వరితం చేసుకున్నాయి. అలాంటి స్థితిలో పత్రికలు పాఠకునికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది నిస్సందేహంగా పేపర్ బాయ్. నియమిత స్థలాల్లో పాత్రికేయులు ఆహరహం శ్రమించి, సేకరించి పంపిన వార్తలను ఉప సంపాదకులు సరిచేసి, సంపాదకుని ఆమోద ముద్ర పడిన తర్వాత ముద్రణకు రంగం సిద్ధం చేశాక, ముద్రిత దిన పత్రికలను పాఠకులకు చేరవేయడం లో పేపర్‌బాయ్‌ల కష్టాలు, ఇబ్బందులు అందరికీ తెలిసిందే. నిర్ణీత ప్రదేశాలలో పంపిణీ వాహనాల కోసం అర్ధ రాత్రి దాటి నప్పటి నుంచి ఎదిరి చూస్తూ, అందుకున్న కట్టలు విప్పి, సెట్లుగా అమర్చుకుని, ఇళ్ళల్లో చందాదారులు, కొనుగోలు దారులు నిద్రలేచి, లేవక ముందే నడిచి లేదా సైకిల్‌పై వెళ్లి గడప గడపకు ఆగి, ముంగిళ్ళలో వేసి, తలుపుల బిడియాలకు చెక్కి పై అంతస్థులో ఉంటే ఎగురవేత ద్వారా వేసిన, వేస్తున్న విషయాలు నిత్య జ్ఞాపకాలే. స్వాతంత్రోద్యమ సమయంలో లోకమాన్యుడు బాలగంగాధర్ తిలక్ పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్ బాయ్‌గా పనిచేశారు. అలాగే ప్రఖ్యాత శాస్త్రవేత్త, దివంగత భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్ బాయ్‌గా పని చేయడం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రాపూరి భరద్వాజ, తెలంగాణ తొలి బి సి కమిషన్ ఛైర్మెన్, ప్రముఖ తత్వవేత్త, శతాధిక గ్రంథ రచయిత బి ఎస్ రాములుగా చిర పరిచుతులైన బేతి శ్రీరాములు పేపర్ ఏజెంటుగా, బాయ్ గా ఇలా గొప్పవారు పేపర్‌బాయ్‌లుగా పనిచేసిన వారే అన్న విషయం తెలుసు కోవాలి. అమెరికా లాంటి దేశాలలో వృత్తిపరంగా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా, నామోషీ గా భావించక వివిధ కారణాలతో కొందరు దిన పత్రికలు పంచడం చేస్తుండడం విశేషం. పేపర్ బాయ్ పేరుతో జయశంకర్ దర్శకత్వం వహించిన, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన...సంతోష్ శోభన్, రియా సుమన్ తాన్యా హోప్, పోసాని కృష్ణ మురళి, అన్నపూర్ణ, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, కల్పలత, సన్నీ, అభిషేక్ మహర్షి, మహేష్ విట్ట తదితర తారాగణం నటించిన ఒక తెలుగు చలన చిత్రం 2018, ఆగష్టు 31న విడుదల కావడం గమనార్హం. వాస్తవానికి ప్రింట్ మీడియా ఇంకా ఎన్నో రకాల ప్రయోజనాలను కల్పిస్తునే ఉంది. అమెరికా, కెనడా వంటి అనేక దేశాలు తమ ప్రకటనల వాహకాలుగా ప్రింట్ మీడియాపై ఎక్కువగా ఆధారపడు తున్నాయనే విషయం మరిచి పోలేనిది. ప్రభుత్వాలు కూడా చిన్న పెద్ద పత్రికలకు చేయూతను అందిస్తున్నాయి. పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు, ఆరోగ్య వైద్య సదుపాయాలు, ప్రయాణ టిక్కెట్ టికెట్ల రాయితీ గల బస్ పాస్ లు, వివిధ రకాల యాడ్స్ తదితరాలతో ప్రోత్సాహాలను అందించడం జరుగుతున్నది. అలాగే చదువుకోసం, ఆర్థిక స్వావలంబన కోసం, జీవనోపాధి కోసం చాలామంది చాలా పత్రికలకు పేపర్ బాయ్స్ గా పనిచేస్తున్న వారిని ప్రభుత్వాలు, యాజమాన్యాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. చేస్తున్న పని చిన్నదా పెద్దదా అన్నది కాకుండా, వారి సేవలను గుర్తించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.




**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# సృజనకు పట్టం

మణుగూరు : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ అనుసంధానంతో 'వికసిత్ భారత్ బిల్డ్థాన్-2025'కు శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే తొలిసారిగా ఆరు నుంచి 12వ తరగతుల వరకు చదివే అన్ని యాజమాన్యాలకు అవకాశం కల్పించారు. స్థానిక ప్రత్యక్ష సమకాలీన సమస్యలకు ఆవిష్కరణల రూపంలో పరిష్కారం చూపాలని సూచించారు. ఒక్కో విద్యాలయం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఒక్కొక్కరు నాలుగు బృందాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో కనిష్ఠంగా ముగ్గురు, గరిష్ఠంగా ఏడుగురు విద్యార్థులను బృందాలుగా చేయొచ్చు. ఆసక్తి ఉన్నవారు వివరాలను బిల్డ్థాన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. వారు థీమ్స్ గురించి వివరించే పద్ధతులపై ప్రత్యక్షంగా అనుసంధానం కానున్నారు. దీనికి అవసరమైన మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపారు. కార్యక్రమానికి సంబంధించి బడుల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రతులను కూడా ప్రదర్శించనున్నారు.

**నమోదు విధానం..**

కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకంగా మొత్తం రూ.కోటి బహుమతులను అందించేందుకు ప్రకటన చేసింది. జిల్లా స్థాయిలో వెయ్యి, రాష్ట్ర స్థాయిలో వంద, జాతీయ స్థాయిలో పది ప్రాజెక్టులను ఎంపికచేసి విజేతలుగా ప్రకటిస్తారు. తుది విజయం సాధించిన వారికి ప్రోత్సాహకం లభించనుంది. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో నమోదు




చేసుకుంటే అదే యూజర్ ఐడీతో లాగిన్ అయ్యే అవకాశం కల్పించారు. ముందుగా ఉపాధ్యాయులు వీబీబీ.ఎంఐసీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అనంతరం విద్యార్థుల వివరాలు అందులో నిక్షిప్తం చేయాలి. ఆవిష్కరణలకు సంబంధించిన వీడియోను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దానికనుగుణంగా పరిశోధనలు చేసి రెండు నిమిషాల నిడివితో వీడియో తీసి దానిని సదరు వెబ్‌పేజీలో అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 13వ తేదీ వరకు అవకాశం ఉంది.

**ప్రధానాంశాలు..**

ఆత్మనిర్భర్ భారత్‌లో స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు, పరిష్కారాలు.
స్వదేశీ ఆలోచనలు, జ్ఞాన వ్యవస్థల ఆవిష్కరణలు పెంపొందించడం.
సమృద్ధి భారత్‌లో స్థిరమైన మార్గాలను సృష్టించడం.
స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం.

విద్యార్థుల ఆలోచనలకు డిజిటల్ రూపం ఇచ్చేందుకు ప్రవేశపెట్టిన వికసిత్ భారత్‌లో భాగంగా ప్రతి పాఠశాల నుంచి 50 మంది విద్యార్థులతో 10 బృందాలను ఏర్పాటు చేయాలని ఎంఈఓలతో పాటు పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థుల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభకు ఈ పథకం ఎంతో ఉపయోగకరం.
బి.నాగలక్ష్మి డీఈఓ


# ఒప్పంద కార్మికులకు వరం!

కొత్తగూడెం : ఈఎస్ఐ సదుపాయంతో కార్పొరేట్ పరిధిలో 1,500 మంది, కొత్తగూడెం ఏరియా పరిధిలో 1,000 మంది ఒప్పంద కార్మికులకు లబ్ధి చేకూరనుంది.

సింగరేణి సంస్థలో ఒప్పంద కార్మికులకు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) వర్తింపజేయాలని యాజమాన్యం నిర్ణయించింది. కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఒప్పంద కార్మికుల పేర్లను ఈఎస్ఐ వెబ్‌సైట్లో నమోదు చేయనుంది. నమోదు ప్రక్రియ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మొదలుకానుంది. రెండు రోజుల పాటు కొనసాగనుంది. నమోదు ప్రక్రియను సింగరేణి, ఈఎస్ఐ అధికారులు సంయుక్తంగా నిర్వహించనున్నారు.

**పథకం అమలు తీరు..**

ఒప్పంద కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని యూనియన్ల విజ్ఞప్తులకు సీఎండీ ఎన్.బలరాం స్పందించారు. ప్రయోగాత్మకంగా రెండు ఏరియాల్లోని ఒప్పంద కార్మికులను ఈఎస్ఐలో తొలుత చేర్చాలని ఆదేశించారు. నెలకు రూ.21వేల లోపు వేతనాలు పొందే




ఒప్పంద కార్మికులు ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నప్పటి నుంచి ఈఎస్ఐకి గుత్తేదారు తనవద్ద పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో 3.75శాతం చొప్పున చెల్లించాలి. సదరు కార్మికులు తమ వేతనంలో 0.75శాతం చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గుత్తేదారులకు ఆర్థికంగా భారం కాకుండా వారి తరపున కార్మికులకు 3.75శాతం చొప్పున సింగరేణి యాజమాన్యం చెల్లించేందుకు ముందుకొచ్చింది.

ఈఎస్ఐ ద్వారా ఒప్పంద కార్మికులు, కుటుంబ సభ్యులకు పరిమితిలేని మొత్తంతో ఆరోగ్య రక్షణ(వైద్యఖర్చులు భరించటం ద్వారా)కు భరోసా లభిస్తుంది. గర్భధారణ సమయంలో ఉద్యోగినులకు వేతనంతో కూడిన సెలవులు వర్తిస్తాయి. అనారోగ్యంగా ఉన్నప్పుడు కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు దొరుకుతాయి.

**నమోదు ప్రక్రియకు కావాల్సినవి**

గుత్తేదారుల కాంట్రాక్టు నమోదు ఐడీలు, ఆధార్ నంబర్లు, సీఎస్టీ చెల్లింపు ఐడీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, మొబైల్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు తీసుకురావాలి. వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లతో ఒప్పంద కార్మికులు హాజరుకావాలి. వేతనాల వివరాలు, స్టేట్మెంట్లు, మొబైల్ నంబర్లను రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించాల్సి ఉంటుంది. బుధవారం, గురువారం (ఈనెల 8, 9)న జరిగే నమోదు కార్యక్రమానికి నిర్ణీత సమయాల్లో ఒప్పంద కార్మికులు హాజరుకావాలని సింగరేణి అధికారులు సూచించారు.

# కాసులిస్తేనే కాగితాలు కదులుతాయ్



కరీంనగర్ : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే కీలక ఔషధ నియంత్రణ విభాగం గాడి తప్పుతూనే ఉంది. గతంలోనూ అవినీతికి చిరునామాగా మారింది. గతంలో ఆ శాఖ అధికారుల పనితీరుపై ఆరోపణలు ఎదుర్కొన్నా మార్పు రావడంలేదు. తాజాగా అవినీతి నిరోధకశాఖ దాడుల్లో పట్టుబడటం జిల్లాలో చర్చనీయాంశమైంది. మెడికల్ దుకాణాలు, హోల్‌సెల్ ఏజెన్సీలలో విక్రయించే ఔషధాలు సరైన విధంగా ఉన్నాయా లేవా? నిబంధనల ప్రకారం విక్రయిస్తున్నారా లేదా? అనే విషయాలపై ఆ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుంటారు. వీటితోపాటు కొత్తగా మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారికి లైసెన్స్‌లు ఇస్తుంటారు. ఈ శాఖలో ప్రతి పనికీ కాసులు లేనిదే కాగితాలు కదలడంలేదనే విమర్శలున్నాయి.

**ఆది నుంచి అదే తీరు**

పదేళ్ల కిందట ఇద్దరు ఔషధ నియంత్రణ అధికారులు వేర్వేరు కారణాలతో లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అయినా శాఖ అధికారుల కార్యకలాపాల్లో మార్పు రాలేదు. మూడేళ్ల కిందట జిల్లాలోని ఒక ప్రాంతానికి సంబంధించిన మెడికల్ షాప్ ఏర్పాటుకు లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుంటే అది ఇవ్వడం కోసం ఆ శాఖలో పని చేసే ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కారు. అయినా మార్పు లేకపోగా ఉన్నత స్థాయి అధికారులు కూడా తామేమి తక్కువ కాదన్నట్లుగా మంగళవారం అనిశాకు దొరకడంతో.. ఆ శాఖ అవినీతికి అడ్డాగా మారిందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**రామ రామ ఇదేమి పాపం**

ఆ శాఖలో ఏ పని కావాలన్నా, కాగితాలు కదలాలన్నా మధ్యవర్తి ద్వారా సంప్రదింపులు జరుపుతూ, ఆ వ్యక్తితోనే లంచాలు పుచ్చుకుంటూ పనులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆ శాఖకు అనుబంధంగా ఉండే ఒక ప్రైవేటు వ్యక్తి మధ్యవర్తిగా ఉంటూ అధికారుల తనిఖీల్లో గుర్తించిన లోపాలను తెలుసుకొని సంబంధిత వ్యక్తుల దగ్గరికి వెళ్లి మధ్యవర్తిత్వం చేస్తూ లంచం డబ్బులు తీసుకుంటుండగా అనిశాకు చిక్కినట్లు తెలుస్తోంది. ఆ మధ్యవర్తిని ఆరా తీయడంతో అధికారుల ప్రమేయం ఉన్నట్లు తేలింది. వారికీ అవినీతి మరకలు అంటక తప్పలేదు.

జిల్లా ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా అధికారి భాగస్వామ్యం ఉన్నట్లు తేలడంతో వారిని కూడా బాధ్యులను చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక మధ్యవర్తి ద్వారా లంచం బాగోతం బయటపడటంతో రామ రామ ఇదేమి పాపం అంటూ ఆ శాఖ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. ఇదే మధ్యవర్తి ద్వారా నెలనెలా డబ్బులు దండుకున్నట్లు విమర్శలున్నాయి. మామూళ్లు ఇవ్వని వారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి చిన్న, చిన్న తప్పులను బయట పెట్టి అందినకాడికి దోచుకుంటున్నారు. మొదటి నుంచి ఈ శాఖపై ఉన్న అవినీతి మరక మాత్రం పోవడం లేదు.

# క్లిక్ చేస్తే మొత్తం ఖాళీ



జగిత్యాల : జగిత్యాల పట్టణానికి చెందిన ఫిరోజ్ అనే యువకుడికి అపరిచిత నంబరు నుంచి వాట్సప్ సందేశం వచ్చింది. 'మీ వాహనానికి చలాన్ పడింది. ఇందులో ఇచ్చిన లింక్ ద్వారా రూ.1000 చెల్లించాల'ని అందులో ఉంది. దాన్ని క్లిక్ చేయగానే ఫిరోజ్ ఖాతా నుంచి రూ.లక్ష మాయమయ్యాయి. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు జగిత్యాల సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇలా ఈయన ఒక్కరే కాదు.. ఎంతో మంది సైబర్ మోసాలకు గురవుతున్నారు. జిల్లాలో ప్రతి రోజు సగటున రెండు కేసులకు తగ్గకుండా నెలకు 65 వరకు నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 655 కేసులు నమోదు కాగా బాధితుల ఖాతాల నుంచి సైబర్ మోసగాళ్లు రూ.3,20,53,809 ఖాళీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు 17 మందిని అరెస్టు చేయగా రూ.89,96,812 రికవరీ చేసినట్లు జగిత్యాల సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ తెలిపారు.

**ఏపీకే లింకులు తెరవొద్దు**

ప్రతి ఒక్కరూ రెండు బ్యాంకు ఖాతాలు నిర్వహించాలి. ఒకదాన్ని యూపీఐ కోసం వాడుతూ ఖర్చులకు సరిపడా మాత్రమే డబ్బులు ఉంచుకోవాలి. డబ్బులు ఎక్కువగా ఉన్న ఖాతాను యూపీఐకి అనుసంధానించకుండా బ్యాంకు ద్వారానే ఏర్పాటు చేసుకుంటే మేలు.
అగంతకుల నుంచి వచ్చే వాట్సప్ సందేశాల్లో ఏపీకే లింక్‌ను ఎట్టి పరిస్థితుల్లో తెరవొద్దు. తెరిస్తే మొత్తం సమాచారమంతా నేరగాళ్లకు చేరుతుంది. ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని ఖాతాను మొత్తం ఖాళీ చేస్తారు. ఫోన్ కాంటాక్టు వివరాలు తీసుకొని వారిని కూడా మోసగించే ప్రమాదం ఉంది.
స్టాక్ ఎక్స్ఛేంజిలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని ఆశపెడతారు. ఆ తర్వాత జీఎస్టీ పేరు చెప్పి పంపమంటారు. ఇది పక్కా మోసమని గుర్తించాలి. ఎవరూ డబ్బులు ఊరికే ఇవ్వరని తెలుసుకోవాలి.
కొన్ని బ్యాంకుల పేరు చెప్పి క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతామంటూ మోసగిస్తారు. ఉద్యోగాల ఆశ చూపి సామాజిక మాధ్యమంలో పంపే లింక్‌లను నమ్మొద్దు.
అపరిచితుల నుంచి వచ్చే వీడియోకాల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దు.
స్పామ్ కాల్స్‌ను లిఫ్ట్ చేయొద్దు. ఇది మోసగాళ్ల నుంచి వచ్చిందే అయి ఉంటుంది.
మహిళలు, యువతులు, విద్యార్థినులు తమ ఫొటోలను డీపీగా పెట్టుకోవద్దు. మార్ఫింగ్ చేసి మోసగించే ప్రమాదం ఉంది.
వాట్సప్‌లో రెండు దశల వెరిఫికేషన్ పెట్టుకుంటే మేలు.
బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఓటీపీ, బ్యాంకు వివరాలు అడిగితే అస్సలు చెప్పొద్దు.
సైబర్ క్రైమ్ ఫిర్యాదు నంబరు: 1930
ఆన్‌లైన్‌లో%cyber crime.gov.in% ను సంప్రదించాలి.

జాగ్రత్తలతోనే మోసాలకు చెక్
సైబర్ మోసాల్లో బాధితుల్లో ఎక్కువ మంది విద్యావంతులు, చరవాణి గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉన్న వారే ఉంటున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మోసపోకుండా చూడవచ్చు.
వెంకటరమణ, సైబర్ క్రైమ్ డీఎస్పీ

# వాగులు నిండినా అక్రమాలు ఆగునా!



మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ రవాణాను కొంతమంది ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్ల ద్వారా తీసుకొస్తూ మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలో డంప్ చేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమాలకు అడ్డే లేకుండా పోతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**నిశీధిలో కాసుల వేట**

ఇటీవలి వర్షాలకు వాగులు, చెరువులు పూర్తిగా నిండాయి. ఇదే అదనుగా అక్రమాలకు తెర లేపారు. ఇతర ప్రాంతాల్లో ఇసుక సమృద్ధిగా దొరకడంతో అక్రమార్కులు అక్కడి నుంచి తీసుకొచ్చి దందా కొనసాగిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కథలాపూర్, వేములవాడ తదితర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్ల ద్వారా ఇక్కడికి తీసుకొస్తున్నారు.కోనరావుపేట, పెద్దగుండు మీదుగా మెట్‌పల్లికి, ఆత్మకూర్ మీదుగా మండలానికి ఇసుక తరలిస్తూ పట్టణంలోని పలు చోట్లతో పాటు రామలచ్చక్కపేట వరద కాలువ, జగ్గాసాగర్-రామలచ్చక్కపేట గ్రామాల మధ్య నిల్వ చేస్తున్నారు. తెల్లవారుజామున ట్రాక్టర్లతో వివిధ గ్రామాలకు ఇసుక తరలిస్తూ డంపులను ఖాళీ చేస్తున్నారు. అడ్డూ అదుపూ లేకుండా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు.

లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకొనే వారే లేరన్న ఆరోపణలున్నాయి.
కొద్ది రోజుల కిందట మండల పరిధిలోని జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు ఇసుక లారీలు, టిప్పర్లను పట్టుకున్నారు. మండలంలోని పలు చోట్ల ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.
కేవలం ఫిర్యాదులు వచ్చినపుడే పట్టుకుంటున్న అధికారులు మిగతా సమయంలో కన్నెత్తి చూడకపోవడం వెనుక మతలబేమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసు శాఖ సహకారంతో అరికడతాం
మెట్‌పల్లి మండలంలోని వాగుల్లో నీరుండటంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ఇతర ప్రాంతాల నుంచి మండలానికి అక్రమ రవాణా అరికట్టేలా జీపీవోలకు ఆదేశాలు జారీ చేస్తాం. పోలీసు శాఖ సహకారంతో రాత్రి వేళ తరలింపును అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
నీత, మెట్‌పల్లి తహసీల్దారు

# ధాన్యం లేదు.. బియ్యం ఇవ్వరు

ఖమ్మం : వచ్చే నెల నుంచి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రారంభం కానుంది. జిల్లాలో 3.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయటం, సేకరించిన వడ్లను మిల్లర్లకు అప్పగించటం సాధారణ ప్రక్రియ. ఈక్రమంలో కొందరు మిల్లర్లు తిరిగి అప్పగించాల్సిన బియ్యం వద్ద పేచీలొస్తున్నాయి. గింజాగింజా పోగైనట్టు బియ్యం బకాయిలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి.

**ఉద్దేశపూర్వకంగా పక్కదారి..**

తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు మరపట్టించి బియ్యం రూపంలో ప్రభుత్వానికి అప్పగించాలి. ప్రతి సీజన్‌లో కొందరు మిల్లర్లు ఇచ్చిన ధాన్యం లెక్కలకు సరిపడా బియ్యం తిరిగి ఇవ్వటం లేదు. ఏటా ఇలా బకాయిలు మిగులుతూనే ఉన్నాయి. 2011-12 నుంచి 2023-24 వరకు ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 15 మిల్లులు రూ.88.25 కోట్ల విలువైన బియ్యం ప్రభుత్వానికి తిరిగి అప్పగించలేదు. ఆయా మిల్లుల్లో తగిన నిల్వలు లేకపోవటంతో సరిపడా నగదు లెక్కలు



తేల్చారు. ఇందులో కొద్ది మొత్తంలో బకాయిలున్న 12 మిల్లుల నిర్వాహకుల నుంచి మాత్రం బ్యాంకు గ్యారెంటీ తీసుకుని ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కేటాయించి, తిరిగి బియ్యం రాబడుతున్నారు. మూడు రైస్ మిల్లులు మాత్రం ఉద్దేశపూర్వకంగా ధాన్యం పక్కదారి పట్టించి బియ్యం ఎగ్గొట్టాయని గతేడాది టాస్క్‌ఫోర్స్ అధికారులు గుట్టురట్టు చేశారు. వాటిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చారు. తర్వాత దీనిపై కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఓ మిల్లు నుంచే రూ.67.36 కోట్లు రాబట్టాల్సి ఉంది.

జిల్లాలో 71 రైస్ మిల్లులుఉన్నాయి. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న మూడు మిల్లులకు ధాన్యం ఇవ్వం. రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలున్న వాటినుంచి బ్యాంక్ గ్యారెంటీ తీసుకుని ధాన్యం ఇస్తాం. బియ్యం సకాలంలో అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాం.
ఘంటా శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

# ఆర్టీసీకి దసరా పంట

ఖమ్మం : దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) ఖమ్మం రీజియన్‌కు అనూహ్యమైన ఆదాయం సమకూరింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు సర్వీసులను నడపటంతో మునుపెన్నడూ లేనంత భారీ లాభాలను ఈ ఏడాది ఆర్జించింది. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 6 వరకు ప్రముఖ పట్టణాలు, నగరాలకు సంబంధించి ఎగువ, దిగువ మార్గాల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ప్రధానంగా హైదరాబాద్ మార్గంలో సురక్షిత ప్రయాణం, ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఎంచుకోవటం మరింత కలిసొచ్చింది.

**రికార్డు స్థాయిలో ఆదాయం**

సాధారణ సర్వీసులతో పాటు ప్రయాణికుల డిమాండ్‌ను తీర్చటానికి ఖమ్మం రీజియన్‌లో 1,208 అదనపు సర్వీసులను నడిపారు. అన్ని బస్సులు 3.17లక్షల కిలోమీటర్లు తిరగ్గా ఓఆర్ 107 నమోదైంది. గతంలో ఒక్కరోజులో ఒక్క బస్సు 435 కిలోమీటర్లు తిరిగితే తాజాగా సగటున ఒక్కో బస్సు ఒక్క రోజులో 526 కిలోమీటర్లు సంచరించిందని అధికారులు తెలిపారు. సుమారు 37.50లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. అక్టోబర్ 6న రీజియన్‌లో రూ.2.18కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తమ్మీద ఖమ్మం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల ద్వారా ఆర్టీసీకి రూ.24.12కోట్ల ఆదాయం సమకూరింది. ప్రైవేటు రవాణా వ్యవస్థలో అధిక ధరల కారణంగా ప్రయాణికులు సరసమైన ప్రయాణానికి ప్రాధాన్యమివ్వటంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. ప్రణాళికాబద్ధంగా బస్సులను నడపటం, సరైన సమయంలో ప్రయాణికుల అవసరాలను గుర్తించటం వంటి అంశాలు రికార్డు స్థాయి ఆదాయానికి దోహదపడ్డాయి. ఆర్టీసీ కిందిస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు నిరంతరం సేవలందించటంతో ఈ ఘనత సాధ్యమైంది. డిపోల్లో సిబ్బంది సంబురాలు జరుపుకొన్నారు.

**డిపోల వారీగా ఆదాయం (రూ.కోట్లలో)**

ఖమ్మం: 5.53 మధిర: 3.00 సత్తుపల్లి: 4.40
భద్రాచలం: 4.34 కొత్తగూడెం: 2.48 మణుగూరు: 3.25
ఇల్లెందు: 1.12 ముందస్తు ప్రణాళికతోనే ఆర్టీసీకి అత్యధిక ఆదాయం సమకూరింది. డిపోల వారీగా డీఎంలతోపాటు అన్ని విభాగాల సిబ్బంది అంకితభావంతో పనిచేశారు. ప్రయాణికుల సహకారం మరువలేనిది.
ఎ.సరిరాం, ఆర్టీసీ ఆర్ఎం, ఖమ్మం

# కోడ్‌తో.. కొత్త పనులకు ఆటంకం

నల్గొండ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కొత్తగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు కొత్త పనులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రారంభోత్సవాలకు ఆటంకం ఏర్పడటంతో.. సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆశించిన వారికి నిరీక్షణ తప్పేలా లేదు. ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులను ఎంపిక చేయగా.. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మొదటి, రెండో విడతల్లో దాదాపు అన్ని గ్రామాల్లో అర్హులను ఎంపిక చేశారు. పలువురు ఇప్పటికే ప్రారంభించగా.. రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. బిల్లులు కూడా మంజూరవుతున్నాయి. ఇళ్లు మంజూరైనా కొంతమంది ప్రారంభించేందుకు డబ్బులు లేక, వర్షాకాలం ఇంటి నిర్మాణ సామగ్రిని తరలించేందుకు తదితర ఇబ్బందులతో ప్రారంభించలేదు. వర్షాలు తగ్గిన వెంటనే నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. పథకం కింద కొత్తగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించడంతో పాటు నిధులు విడుదల చేయడానికి వీలు లేకుండా పోయింది.ఎన్నికల కోడ్ ముగిసే వరకు కొత్తగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించడం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వివిధ కారణాలతో ఆలస్యమైన ఇందిరమ్మ పథకానికి ఎన్నికల కోడ్ మరో అడ్డంకిగా మారిందని వాపోతున్నారు. భవన నిర్మాణ కార్మికుల కు, సప్లయిర్స్‌కు తాత్కాలిక నిలిపివేతతో.. పని దొరకని పరిస్థితి నెలకొంది. జిల్లాలో పథకం వివరాలుజిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు : 18615

చురకలు



# అనంతగిరి.. వైద్య సిరి

వికారాబాద్ : అనంతగిరిలోని శ్రీ అనంత పద్మనాభ కళాశాల ఎదురుగా రూ.30కోట్లతో కొత్తగా భవనాన్ని నిర్మించారు. 300పడకలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి భవనం పక్కనే రూ.16కోట్ల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మిస్తున్నారు. ఈ కేంద్రం కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో అందిస్తున్న కథనం.

**17 రకాల సేవలు**

కొత్తగా ప్రారంభించిన జనరల్ ఆసుపత్రిలో 17రకాల సేవలను అందిస్తున్నారు. ఈ కేంద్రంలో సాధారణ రోగుల పరీక్షలు, ప్రత్యేక వైద్య పరీక్షలు, మహిళలకు సంబంధించిన వ్యాధులను పరీక్షిస్తున్నారు. నేత్ర సమస్యలు, పిల్లల వ్యాధులు పరీక్షించి మందులు పంపిణీ చేస్తున్నారు. మానసిక రోగులకు పరీక్షిస్తున్నారు. మూడు రకాల ప్రయోగశాల పరీక్షలకు సంబంధించిన సేవలున్నాయి. పోస్టుమార్టం సేవలు, క్యాన్సర్ డే కేర్ కేంద్రం ఉన్నాయి. ఈ కేంద్రానికి 25 మంది క్యాన్సర్ రోగులను పంపించారు. ఎముకలు, దంత వ్యాధులున్న వారిని పరీక్షిస్తున్నారు. త్వరలో వయోవృద్ధులకు ప్రత్యేకమైన గదిని కేటాయించి సేవలను అందించనున్నారు. ఐసీయూ, వెంటిలేటర్లు గదులను ఏర్పాటు చేశారు. విశాలమైన గదులు, వార్డులు ఉన్నాయి.

**ఇదిగో ఇలా..**



ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యులు: 80 మంది
నర్సులు: 135
ఫార్మసిస్టులు 04
ల్యాబ్ టెక్నీషియన్లు: 03
బయటి రోగులు రోజుకు: 500–600

సేవలు సద్వినియోగం చేసుకోండి

వికారాబాద్ పట్టణ ప్రజలే కాకుండా పరిసరాల ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి. ఈ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నాం. రోగులను ప్రత్యేకమైన వైద్య నిపుణులు పరీక్షిస్తారు. అధునాతనమైన పరీక్షా పరికరాలుఅందుబాటులో ఉన్నాయి.

డాక్టర్. రాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్

# రూ.20తో బీమా.. కుటుంబానికి ధీమా

సిరిసిల్ల : గ్రామీణ ప్రాంతాల్లో వలసలు అరికట్టడమే ధ్యేయంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలవుతోంది. పల్లెవాసులకు వ్యవసాయ పనులు లేని సమయంలో స్థానికంగా ఉపాధి కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. దురదృష్టవశాత్తు పని ప్రదేశాల్లో ప్రమాదాల్లో బాధితులకు అందే సాయం ఏ మాత్రం సరిపోయేది కాదు. ప్రస్తుతం కేంద్రం ఉపాధిహామీ కూలీలకు అమలు చేస్తున్న పీఎంఎస్‌బీవై (ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన)తో అదనంగా పరిహారం అందనుంది.

**అదనపు సాయం ఇలా..**

ఈజీఎస్‌తోపాటు పీఎంఎస్‌బీవై ద్వారా అందే సాయం కుటుంబాలకు అదనంగా ప్రయోజనం చేకూరనుంది. 18 నుంచి 70 ఏళ్లలోపు ఉపాధి కూలీలు దరఖాస్తుకు అర్హులు. పోస్టాఫీస్, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతాలున్న కూలీలు రూ.20 చెల్లించి నమోదు చేసుకోవాలి. అయితే ఈ పథకంపై చాలామంది కూలీలకు అవగాహన లేదు. బీమా వాటాధనం తక్కువైనా తెలియక చాలామంది చెల్లించడం లేదు. దీంతో ఉపాధిహామీ సిబ్బంది అవగాహన కల్పిస్తూ బీమా చేయిస్తున్నారు. అనుకోని ఘటనలతో కూలీ మృతి చెందినా, శాశ్వత వైకల్యం పొందిన రూ.2 లక్షలు సాయం అందుతుంది. పాక్షిక వైకల్యానికి రూ. లక్ష పరిహారం వస్తుంది. ప్రమాదాలు జరిగిన సమయంలో కూలీలకు భరోసా దక్కనుంది.

**కేంద్రం ఆదేశాలు..**

జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది కేంద్రం 12 లక్షల పనిదినాలు కేటాయించగా ఇప్పటికే 10 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి.

కార్డులో సుమారు 1.99 లక్షల మంది నమోదైనప్పటికీ యాభై శాతం మాత్రమే జనాలు ఉపాధి హామీ పథకంలో ఆర్థికంగా లబ్ధి



పొందుతున్నారు. మిగతావారు ప్రభుత్వ ప్రయోజనాలకు నమోదై ఉన్నారు. – పనులకు హాజరయ్యే కూలీల్లో నిరుపేద కుటుంబాలే అధికం. వృద్ధాప్యంలో సైతం కుటుంబ పోషణకు ఉపాధి పనులకు వస్తున్నారు. కూలీల శ్రమ ఫలితంగా జిల్లాలో పనులు బహుళ ప్రయోజనాలు ఇస్తున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా పని ప్రదేశాల్లో ఏవైనా అనుకోని ప్రమాదాలు బాధితులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేది. మరణం సంభవిస్తే రూ.2 లక్షలు, అంగవైకల్యానికి రూ.లక్ష, గాయాలకు అవసరమైన వైద్య ఖర్చులు అందేవి. ఈ సాయం కుటుంబాలకు ఏమాత్రం సరిపోయేది కాదు. దీంతో అదనంగా సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వం పీఎంఎస్‌బీవైని కూలీలకు వర్తింపజేయాలని ఆదేశాలిచ్చింది.

జిల్లా వివరాలు
గ్రామాలు 260
ఉపాధి హామీ కార్డులు 98,036
కార్డుల్లో సభ్యులు 1,99,728
యాక్టివ్ కార్డులు 60,697
యాక్టివ్ సభ్యులు 93,353

# అడిగినంత ఇస్తే.. 'రెడీ'మిక్స్



హైదరాబాద్ : కొల్లూరు సమీపంలోని ఉస్మాన్‌నగర్‌లో నివాసాలకు సమీపంలోనే రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) యూనిట్ ఏర్పాటైంది. వసూళ్లకు అలవాటు పడిన ఓ అవినీతి అధికారి నిర్వాకంతో నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికీ ఆ యూనిట్ నడుస్తోంది. దుమ్ము, వాయు కాలుష్యంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు శూన్యం. ఇలా ఈ ఒక్కచోటే కాదు, నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్ఆర్‌కు అతి సమీపంలో అనేక చోట్ల అక్రమ యూనిట్లు వెలిశాయి.

**యూనిట్‌కు రూ.3 లక్షలు..**నిబంధనలు ఎలా ఉన్నా.. ఆమ్యామ్యా ఇస్తే ఆర్ఎంసీలకు అనుమతి వచ్చినట్టే. ఓ పీసీబీ ఉన్నతాధికారి నిర్వాకంతో నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ఆర్ఎంసీ, క్రషర్లకు అనుమతుల జారీలో అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించి ప్రాంతీయ స్థాయిలో అనుమతులు జారీ చేయొద్దని పీసీబీ సభ్య కార్యదర్శి ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. యూనిట్‌కు సుమారు రూ. 3లక్షల చొప్పున వసూలు చేస్తూ ఇష్టానుసారం అనుమతులివ్వడంతో నిషేధిత ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా ఈ యూనిట్లు వెలిశాయి.

**'కన్సల్టెన్సీ'లో హాజరు.. ఆ తర్వాతే అనుమతి**

ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తున్న సదరు అధికారి శేరిలింగంపల్లిలో కుటుంబ సభ్యులు, కిందిస్థాయి సిబ్బందితో కలిపి ఓ ఏజెన్సీని ఏర్పాటు చేశారు. అక్కడ హాజరు వేసిన తర్వాతే కార్యాలయంలో అడుగుపెట్టాలంటూ హుకుం జారీ చేశారు. అక్కడ పచ్చజెండా ఊపితేనే ఇక్కడ కాగితాలు ముందుకు కదులుతాయనేలా వ్యవహారం సాగుతోంది. దీంతో ప్రయివేటు దందా చేసేవారంతా కన్సల్టెన్సీని సంప్రదించి అడిగినంతా ముట్టజెబుతున్నారు. అనంతరం కన్సల్టెన్సీ వారు రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ కాంట్రాక్టు పనులు అంటూ ఇంజినీరింగ్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి కార్యాలయానికి పంపితే ఇట్టే అనుమతులు జారీ అవుతున్నాయి. ఇలా కొల్లూరు, నల్లగండ్ల, బీహెచ్ఇఎల్, పటాన్‌చెరు, తెల్లాపూర్, లింగంపల్లి, అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో యూనిట్లు ఏర్పాటయ్యాయి. దుమ్ము రేగకుండా స్ప్రింక్లర్లు, క్లోజ్డ్‌షెడ్‌లో ఆర్ఎంసీని ఏర్పాటు చేయాలన్న నిబంధనను పట్టించుకోకపోవడంతో విపరీతంగా కాలుష్యం నమోదవుతోందంటూ స్థానికులు వాపోతున్నారు.

# రూపాయి రాకెంత.. పోకెంత?



తాండూరు: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులు, ఆదాయం, వివిధ పనులకు చేసిన వ్యయాలపై ఉన్నతాధికారులు లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలను పంపించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖను ఆదేశించింది. అన్ని పంచాయతీల కార్యదర్శులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. 2019 ఏప్రిల్ నుంచి 2025 మార్చి చివరకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, మంజూరైన నిధుల దస్త్రాలు పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులే ఎక్కువ**

ఆర్థిక సంవత్సరాల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు 2011 జనాభా ప్రాతిపదికన ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం నుంచి, రెండు నెలలకోసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. ఈలెక్కన ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.లక్షల్లో మంజూరైతే తక్కువ జనాభా ఉన్న వాటికి రూ.వేలల్లోనే విడదలయ్యాయి. పంచాయతీలకు 2024 మార్చి నుంచి పాలక వర్గాలు లేవు. ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. దీంతో నిధుల మంజూరులో స్తబ్ధత నెలకొంది. అందుబాటులో ఉన్న సాధారణ నిధులతోనే కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. అయితే చేసిన పనులకు వెచ్చించిన నిధులెన్ని అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

**అంశాల వారీగా..**

గ్రామ పంచాయతీల్లో అమలయ్యే పదిహేను అంశాల వారీగా చేసిన ఖర్చు పద్దులకు సంబంధించి లెక్కలు అడుగుతున్నారు. సంతలు (త్రైబజార్‌లు), మార్కెట్లు, కార్యాలయం నిర్వహణ, మౌలిక వసతులు, వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది వేతనాలు, సాంకేతిక నైపుణ్యం, దళిత, గిరిజన సంక్షేమం, చిన్నారులు, మహిళల భద్రత, కుటుంబ ఆరోగ్య సంరక్షణ, తాగునీటి వనరుల నిర్వహణ, పారిశుద్ధ్యం అంశాలున్నాయి.

గ్రామ పంచాయతీల్లో సంతల నిర్వహణకు ఏడాది కోసారి త్రైబజార్ వేలం వేస్తారు. నీటి శుద్ధి ప్లాంట్లు ఉంటే వాటి నిర్వహణకు వేలం వేస్తారు. వచ్చిన ఆదాయాన్ని దేని కోసం వ్యయం చేశారు? ఎంత చేశారు? వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

మంజూరైన నిధులను ఏ పనికి ఎంత వ్యయం చేశారు. మిగిలిన డబ్బులు ఎన్ని? చేసిన పనికి డబ్బులు సరిపోక పోతే వేరొక పద్దు నుంచి ఎంత మేరకు తీసుకుని ఖర్చు చేశారు. అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఇవీ వివరాలు
మండలాలు: 20
గ్రామ పంచాయతీలు: 594
వార్డులు: 5,058

**వివరాలు పంపించాలని ఆదేశించాం**

జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యదర్శులను 2019 నుంచి 2025 వరకు నిధుల మంజూరు వ్యయాలకు సంబంధించిన వివరాలను పంపించాలని కార్యదర్శులను ఆదేశించాం. ఉన్నతాధికారులు ఆదేశించిన మేరకు పద్దుల వారీగా లెక్కలు అడుగుతున్నాం.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# ప్రచారం చేస్తున్నా.. ఫలితం లేదు



జమ్మికుంట : శుభకార్యాలు, చిన్నపాటి వేడుకలు, విందులు ఇలా కార్యక్రమం ఏదైనా ప్లాస్టిక్ వస్తువులు అనివార్యంగా మారాయి. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు తదితర రకాల వస్తువులకు స్వస్తి పలికి పర్యావరణాన్ని కాపాడే దిశగా జిల్లాలో ఎంపిక చేసిన పురపాలికల పరిధుల్లో ఏర్పాటు చేసిన బర్తన్(స్టీల్) బ్యాంక్‌ల వినియోగం తక్కువగా ఉంది. స్టీల్ సామగ్రి తక్కువ ధరకు అద్దెకు ఇస్తున్నా.. పుర, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు ప్రచారం చేసినా స్పందన నామమాత్రంగానే కనిపిస్తోంది.

**14 రకాల సామగ్రి**

ఏడాది క్రితం మెప్మా ఆధ్వర్యంలో జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. వండే పాత్రలు, 200 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, నీటి జగ్గులు, ఆహార పదార్థాలు వడ్డించే బకెట్లు తదితర 14 రకాల సామగ్రి అందుబాటులో ఉంచారు. మెప్మా చేయూతతో రూ. 55 వేల విలువతో కేంద్రాన్ని ప్రారంభించారు. చిన్నపాటి వేడుకకు సామగ్రి అద్దె రోజు రూ. 2,536 నిర్ణయించినా స్పందన కనిపించటం లేదు. ఏడాది కాలంలో రూ. 16,500 ఆదాయం లభించింది. మున్సిపల్ ఆధ్వర్యంలోని కార్యక్రమాలు, ఓ ప్రైవేట్ వ్యక్తి మాత్రమే ఉపయోగించుకున్నారు. హుజూరాబాద్‌లో ఒకటి, కరీంనగర్ నగరపాలికలో 7 బర్తన్ బ్యాంక్‌ల నిర్వహణ గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో జరుగుతోంది. హుజూరాబాద్‌లో రెండేళ్ల క్రితం రూ. 40వేల పెట్టుబడితో ఏర్పాటు చేయగా.. రూ. 21వేల ఆదాయం లభించింది. తక్కువ ధరకే అద్దెప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో బర్తన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాం. చిన్నపాటి వేడుకలకు సరిపడేలా 14 రకాల స్టీల్ సామగ్రిని తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నాం. పుర పరిధిలోని మహిళా సంఘాలు, ప్రజలు వినియోగించుకోవాలి.

# వన్యప్రాణులతో కర్షకుల్లో కలవరం

వీర్నపల్లి : మెడలో ఒడిసెతో పొలానికి కాపలాగా ఉన్న ఈ రైతు పేరు పిట్టల చిన్న లింబయ్య. కంచర్లకు చెందిన ఈయన.. అటవీ సరిహద్దులో రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తి, అర ఎకరంలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పత్తి కాతకు వచ్చింది కానీ.. నిత్యం వానరాలు పంట పొలంపై దాడికి దిగుతున్నాయి. రాత్రి వేళలో పత్తిని ఆనుకుని ఉన్న వరి పొలంలోకి అడవి పందులు వస్తున్నాయి. దీంతో భోజన సమయం మినహా రోజంతా లింబయ్య అక్కడే ఉంటున్నారు. సవాళ్లను అధిగమించి పంట సాగు చేసిన రైతులను అడవి జంతువులు



కలవర పెడుతున్నాయి. వనాల సరిహద్దులోని పంట పొలాలపై వరుస దాడులకు దిగుతున్నాయి. అన్నదాతల ఆరుగాలం కష్టాన్ని ఒక్క రాత్రిలోనే తుడిచిపెడుతున్నాయి. ఫలితంగా కర్షకులు రేయింబవళ్లు వ్యవసాయ క్షేత్రాల్లో కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఇదీ పరిస్థితి**

మెట్టప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో బోరుబావులు ప్రధాన ఆధారం. గతంతో పోలిస్తే భూగర్భ జలాలు పెరగడంతో ఆరుతడి పంటలతో పోలిస్తే వరిసాగుకు అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆ తర్వాత స్థానంలో పత్తిని వేస్తున్నారు.

వరి ఇప్పటికే చేతికి రాగా, పత్తి పంట కాత దశలో ఉంది. చివరి దశలో పంటలపై వన్యప్రాణుల దాడులు పరిపాటిగా మారాయి. అటవీ సరిహద్దు గ్రామాల్లో వరిపై అడవిపందులు, దుప్పులు, మనుబోతులు, జింకల దాడులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పత్తి చేలల్లో వానరాలు, పక్షులు, మర్నాగిలు కలవరపెడుతున్నాయి. అడవిలో ఉండాల్సిన జంతువులు పంట పొలాల్లోకి రావడంతో అన్నదాతలు కమతాలకు కాపలాగా ఉండాల్సి వస్తుంది.

ఇటీవల వీర్నపల్లి, చందుర్తి మండలాల్లో అడవి పందులు పదుల ఎకరాల్లో పంటను ధ్వంసం చేశాయి. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల వద్ద ఉంటున్నారు. పత్తి రైతులు కోతులను తరిమేందుకు కూలీలను పెడుతుండటం సమస్యకు అద్దం పడుతోంది.

**జిల్లాలో ఇలా..**

అటవీ సరిహద్దు గ్రామాలు: 64
సాగు విస్తీర్ణం: 2.4 లక్షల ఎకరాలు
వరి సాగు: 1.84 లక్షలు పత్తి: 49,760
ఇతర పంటలు: 9,153

# పత్తి రైతులకు అధనపు భారం..

కొణిజర్ల : అధిక వర్షాలతో పత్తి దెబ్బతింది.. పంట కళకళలాడుతున్న తరుణంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు కాయలు నల్లబడి ఆగం కావడంతో పాటు పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. వాతావరణ పరిస్థితుల వల్ల కొన్నేళ్లుగా పత్తి సగటు దిగుబడి ఐదు క్వింటాళ్లకు మించి రావడం లేదు. అన్నదాతలు ఈ పంటను సాగుచేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరో పంటను వేయలేక నష్టాలు వస్తున్నా సాగు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది.

గతేడాది ఈ సమయంలో పత్తి తీసేందుకు కిలోకు రూ.10 చెల్లించిన రైతులు ప్రస్తుతం రూ.15 చెల్లిస్తున్నారు. మరికొందరు రోజు కూలీ రూ.350వరకు ఇవ్వాల్సి రావడంతో అదనపు భారం పడుతోంది. వర్షాల వల్ల కాయల్లోకి నీరు వెళ్లి సరిగ్గా విచ్చుకోలేదు. ఈ పరిస్థితి వల్ల అందులోని పత్తిని తీసేందుకు కూలీలకు అధిక సమయం పడుతోంది. అందుకే ఎక్కువ కూలి అడుగుతున్నారు. మొదటి పత్తితీత ఎకరాకు రెండు క్వింటాళ్ల వరకు వస్తోంది. ఇందుకోసం కూలీలకు రూ.1,500 అవుతుండగా, పొలం నుంచి ఇంటి వరకు పత్తిని రవాణా చేసేందుకు రూ.700 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తీసినదాన్ని తరుగుపోను అమ్మినా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు.

**సగటు దిగుబడి గగనం..**



ఈ ఏడాది అధిక తేమ వల్ల పత్తి ఎర్రబారటం, వర్షాల వల్ల కాయల్లోకి నీరు చేరి నల్లబడి రాలిపోయాయి. కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్, తిరుమలాయపాలెం, కూసుమంచి, బోనకల్లు, రఘునాథపాలెం, ఇల్లెందు మండలాల్లో పత్తి అధికంగా దెబ్బతింది. సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో క్వింటా రూ.3వేల చొప్పున మాత్రమే అమ్ముకోవాల్సిన పరిస్థితి.

విస్తీర్ణం ఇలా.. (ఎకరాల్లో)
ఖమ్మం: 2,25,613
భద్రాద్రి: 2,40,345

కూలీల కొరత, వర్షాలు వస్తుండటంతో ఉన్న కొద్ది పత్తిని తీయడానికి కష్టాలు పడుతున్నాం. కాయలు నల్లబడి రాలిపోయాయి. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల దిగుబడే వచ్చే పరిస్థితి ఉంది. సుమన్, మల్లుపల్లి

# వీడాలి.. 'చెక్కు'ముడి..!

వైరా : వైరా పురపాలిక ఖజానాకు చిల్లు పడింది. ఓ ఉద్యోగి తన పేరిట రూ.50లక్షలకు పైగా విలువైన 25 చెక్కులను రాసుకుని డ్రా చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పురపాలికలో జరిగే అభివృద్ధి పనులు, వాహన మరమ్మతులు, సామగ్రి కొనుగోలు సహా ప్రతి అంశానికి చెల్లించే చెక్కుల బాధ్యతలు తన వద్దే ఉండటంతో సదరు ఉద్యోగి ఆలోచన పక్కదారి పట్టింది.

**నిబంధనల ప్రకారం..** ఉద్యోగుల పేరిట ఏ ఒక్క చెక్కు రాయకూడదు.. మున్సిపాలిటీ పనులు, కొనుగోళ్లకు చెందిన చెల్లింపులు జరపకూడదు. మున్సిపాలిటీ నుంచి ఏమైనా కొన్నా లేదా చేపట్టిన పనులకు ఇతర వ్యక్తులు లేదా సంస్థల పేరిట చెక్కులు ఇవ్వాలి. ప్రతి చెక్కు నంబర్, చెల్లింపు విలువ, ఏ పనికి ఇస్తున్నామనే వివరాలను క్యాష్‌బుక్‌లో నమోదుచేయాలి. ఉద్యోగి తన పేరిట రాసుకున్న 25 చెక్కుల్లో 13 చెక్కుల వివరాలను క్యాష్‌బుక్‌లో నమోదు చేయకపోవటం గమనార్హం. **ఏం జరిగింది?**నూతన కమిషనర్ గురులింగం ఈ ఏడాది ఆగస్టు మూడో వారంలో బాధ్యతలు చేపట్టారు. నెల క్రితం కొత్తగా అకౌంట్స్ బాధ్యతలు స్వీకరించిన అధికారి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గత ఏడాది కాలంలో అక్రమాలు జరిగాయని గుర్తించారు. చెక్కుల అవినీతిపై కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఇటీవల లిఖితపూర్వక ఫిర్యాదు వెల్లింది.

# భావి పౌరులకు విలువల విద్య

వెల్గటూరు: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందింపజేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. దీని కోసం సోమవారం విద్యార్థులకు టీ-శాట్ విద్యా ఛానెల్‌లో ప్రత్యేక కార్యక్రమాల ప్రసారానికి చర్యలు చేపట్టారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి సందేశాన్ని ఇవ్వనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రసారం కానుంది.

**గతంలోనూ అమలు**

'విలువల విద్య, జీవన నైపుణ్యాల'ను ఒక ప్రధాన అంశంగా పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పెట్టడం ద్వారా హేతుబద్ధమైన పౌరులుగా ఎదుగుతారని భావించారు. ఉన్నత విలువలు, వైఖరులతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ



రూపొందించింది. దీని ప్రకారం పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడటం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించేలా రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం 2011లోని రాష్ట్ర దృక్పథంలో పేర్కొన్నారు. తరగతులవారీగా ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించి పంపిణీ చేశారు. **ప్రాథమిక స్థాయికి 12, ఉన్నత స్థాయికి 18 విలువలు**

స్వేచ్ఛ, సంతృప్తిగా జీవించడం, శీల నిర్మాణం, జీవన నైపుణ్యాలు, బాధ్యత వహించడం, పొదుపు చేయడం, ఆరోగ్య, పర్యావరణ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం, శాస్త్రీయ దృక్పథం, న్యాయం, శాంతి, కలిసిమెలిసి జీవించడం, శ్రమ విలువ, సేవాభావం, సమానత్వం-సోదర భావం, స్త్రీలపట్ల గౌరవం, జాతీయ భావన, దేశభక్తి, లౌకికతత్వం, మత సామరస్యం, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం.

**ఉద్దేశాలివే...** విలువలను పాఠ్యాంశానికే పరిమితం చేయకుండా అన్ని సబ్జెక్టులతో సమన్వయం చేస్తూ సామర్థ్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తున్నారు. విజ్ఞానశాస్త్రం వంటి సబ్జెక్టులు బోధించేటప్పుడు విలువల విద్యను అనుసంధానం చేయనున్నారు. తద్వారా విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిగత, సామాజిక బాధ్యతను గుర్తించే వీలుంది.

**జిల్లాలవారీగా పాఠశాలలు**

జగిత్యాల 765
కరీంనగర్ 631
పెద్దపల్లి 532
సిరిసిల్ల 488

# అతివలకు ఆర్థిక చేయూత

సిరిసిల్ల : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ తయారు చేసి, 11 రకాల యూనిట్లను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు లబ్ధి చేకూరేలా కార్యాచరణ సిద్ధం చేశారు. దీనికి బ్యాంకు రుణాలతోపాటు స్త్రీనిధి రుణాలను అందిస్తున్నారు. మొదటి విడత విజయవంతం అయితే మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**1,16,538 మంది సభ్యులు**

మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందజేస్తోంది. జిల్లాలోని 12 మండలాల్లో 411 మంది వీవోలు ఉండగా, 10,038 సంఘాల్లో 1,16,538 మంది సభ్యులు ఉన్నారు. వీరిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించగా దానికి అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. చిరు



వ్యాపారాలు, పెరటికోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్లు, గేదెలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, చేపల విక్రయం, పాల డైరీ, క్యాంటీన్‌లు, టెంట్‌హౌస్‌లతోపాటు జిల్లాలోని 9 మండలాలకు 9 బస్సులను అందించారు. మరో 3 బస్సులతోపాటు సోలార్ విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంకులు అందించడానికి ప్రణాళికలు రూపొందించారు.

**సద్వినియోగం చేసుకోవాలి** మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకం కింద వివిధ రకాల యూనిట్లను అందజేశాం. ప్రస్తుతం అందించిన యూనిట్లతోపాటు మహిళా సంఘాల సభ్యులతో సోలార్ విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాం. మహిళా సంఘాలకు మరో 3 బస్సులను అందజేయనున్నాం. శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# ఏళ్లుగా ప్రయాణానికి పాట్లు



తాండూరు : తాండూరు- హైదరాబాద్ ప్రధాన దారి నిర్మాణానికి పదహారేళ్లుగా అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. నిధులు మంజూరై పనులు చేస్తున్న వేళ బిల్లులు రాకపోవడంతో అప్పట్లో గుత్తేదారు అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయాడు. తాజాగా అదనపు నిధులు మంజూరు కావడంతో టెండరు దక్కించుకున్న ఓ సంస్థ గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఫలితంగా లక్షలాది మంది ప్రయాణికులు, వాహనదారులు గుంతల దారిలో నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

**గుంతలతో తప్పని కష్టాలు..**

తాండూరు పట్టణం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వ్యాపారం, వివిధ పనులు, ఉద్యోగరీత్యా లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పదహారేళ్ల కిందట ఒకే వరుస తారు దారి మాత్రమే ఉండేది. ఆ తరవాత రెండు వరుసలుగా మార్చేందుకు కాంగ్రెస్, భారాస ప్రభుత్వాలు సుమారు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయడంతో వికారాబాద్‌కు చెందిన ఓ గుత్తేదారు పనులు ప్రారంభించారు. ఇరువైపులా మట్టి, కంకర, అక్కడక్కడా తారు వేసి రోడ్డు వెడల్పు చేశారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. దారి గుంతలమయంగా మారింది. పాలకులు మారుతున్నా.. దారి మాత్రం బాగు పడలేదు. ఇటీవల ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.101 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు మాత్రం ముందుకు రావడం లేదు.

**హైదరాబాద్‌కు నాలుగు గంటల ప్రయాణం..**

వికారాబాద్ వరకు 40 కి.మీ., మన్నెగూడ జాతీయ రహదారి వరకు 10కి.మీ. మేర దారి అధ్వానమైంది. మన్నెగూడ నుంచి హైదరాబాద్ నగరంలోని తెలంగాణ పోలీసు అకాడమీ వరకు వాహనాలు నెమ్మదిగా ఒకదానివెంట ఒకటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తాండూరు నుంచి మన్నెగూడ వరకు గుంతలు, కంకర తేలింది. ఇటీవల ధారూరు-మంబాపూర్ మధ్యలో కొన్ని పనులు చేసినా.. మళ్లీ గుంతలు పడ్డాయి. నిత్యం లారీలు, బస్సులు, చిరువ్యాపార వాహనాలు తరుచూ మొరాయిస్తున్నాయి. ఖాంజాపూర్, కందనెల్లి వద్ద మూడు చోట్ల తారు పెకిలించి వదిలేయడంతో కంకర, దుమ్ముతో సతమతమవుతున్నారు. హైదరాబాద్ వెళ్లేందుకు నాలుగు గంటలకుపైగా సమయం పడుతోందని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈనెల 8న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి సమస్య వివరించారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వివరించారు.

# యూరియా క్రమబద్ధీకరణ



గజ్వేల్: యూరియా కోసం మహాభారతమంత ప్రణాళికలు సాగుతున్నాయి. ఒకచోట కొట్టుకుంటున్నారు, మరోచోట ధర్నాలు చేస్తున్నారు ఇంకోచోట రాత్రంతా పంపిణీ కేంద్రం వద్ద పడుకుంటున్నారు. కాదేదీ అనర్హం అన్నట్టుగా చెప్పులు, కాగితాలు, పుస్తకాలు, ఖాళీ సంచులు, కర్రలు, రాళ్లను యూరియా టోకెన్ల వరుసలో పెడుతున్నారు. వానాకాలం సీజన్ పొడవునా రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. కిలోమీటర్ల పొడవునా గంటల కొద్దీ సమయం కర్షకులు బారులు తీరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎరువు అధిక వినియోగాన్ని నియంత్రించి అర్హులైన రైతులకు సరిపడా యూరియా అందేలా ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుడుతోంది.

**పంపిణీ వ్యవస్థపై ఒత్తిడి**


వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సూచన మేరకు ఏ పంటకు ఎంత వేయాలనే అంశంపై పూర్తిస్థాయిలో లెక్కలు తీస్తున్నారు. అదే మోతాదులో సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. వచ్చే యాసంగి సీజన్లో కష్టాలు ఏర్పడకుండా ఉండేందుకు ఇప్పటి నుంచి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాగు విస్తీర్ణాన్ని లెక్క కట్టి జిల్లాకు కేటాయింపులు జరుగుతున్నాయి. ఒకానొక సందర్భంలో ఇతర జిల్లాల రైతులు వస్తున్నారు. కొందరు ఇతర అవసరాలకు కొంటున్నారు. దీనివల్ల పంపిణీ వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. యూరియా కష్టాలు ఏర్పడుతున్నాయని అధికారులు గ్రహించారు. ఇలాంటి పరిస్థితులు అన్ని జిల్లాల్లో ఉన్నాయి.

వర్షాకాలంలో సాగు విస్తీర్ణం: 5,46,363 ఎకరాలు

**మరింత అవగాహన**

వచ్చే యాసంగి నుంచి ప్రతి రైతుకు సాగు చేసే పంటలకు ప్రతి ఎకరాకు రెండు బస్తాల యూరియా, ఒక లీటరు నానో యూరియా పక్కాగా అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆధార్ కార్డు ఆధారంగా ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. సాగు విస్తీర్ణంలో ఎకరాకు రెండు బస్తాల యూరియా పంపిణీ చేస్తారు. ఇంకోసారి వరుసలో నిలబడేందుకు వీలు ఉండదు. పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఎరువు ఇబ్బందులను పూర్తిస్థాయిలో నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు నానో యూరియా వినియోగంపై మరింత అవగాహన కల్పిస్తారు. పూర్తి స్థాయిలో దీనినే విస్తృతం చేసేందుకు యోచిస్తున్నారు. నానోను తప్పకుండా ఇవ్వనున్నారు.

# బాల్యంలోనే బాధ్యతలు.. భవితకు బాటలు



పరిగి : చాలామంది తల్లిదండ్రులు కేవలం పిల్లల మార్కులే చూస్తున్నారు. పరీక్షలు అయ్యాక మార్కులు.. గ్రేడ్ల గురించే అడుగుతున్నారు. దీంతో విద్యార్థులు బట్టీ పడుతున్నారు. ఇతర విషయాల్లో మాత్రం వెనకబడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి విధానానికి పాఠశాల స్థాయి నుంచే స్వస్తి పలికేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. జిల్లాలో 1,066 బడుల్లో 90,650 మంది ఉన్నారు.

**పలు అంశాల మెరుగుకు..:** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, విలువల పెంపు, క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, తోటి వారితో కలిసి మెలగడం వంటి అంశాల మెరుగుకు విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. బాల్యదశ నుంచే బాధ్యతలు అప్పగిస్తే భవిష్యత్తులో ఉత్తమంగా ఎదగడానికి అవకాశముంటుందని భావిస్తోంది. ప్రాథమికోన్నత, ఉన్నత, ఆదర్శ, కేజీబీవీల్లో 'హౌజ్ సిస్టమ్, స్టూడెంట్ కౌన్సిల్-స్కూల్' కార్యక్రమాన్ని చేపట్టేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ఈనెల 5న సీఎం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి సంబంధించి శాఖాపరంగా ఉత్తర్వులు జారీ కావడంతో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో జూమ్ సమావేశం నిర్వహించి విధివిధానాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, గ్రామస్థులతో ఏర్పాటు చేసే సమావేశంలో విద్యార్థులు బాధ్యతలను స్వీకరించనున్నారు.

**పాఠశాల కౌన్సిల్ ఏర్పాటు ఇలా..**

పాఠశాలలోని ఎక్కువ (10వ) తరగతి చదువుతున్న బాలబాలికలను హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను తీసుకోవాలి. అలాగే అదే పాఠశాలలో పైనుంచి తక్కువ 9వ తరగతి చదువుతున్న బాలబాలికలను డిప్యూటీ హెడ్‌బాయ్, గర్ల్‌గా నియమిస్తారు. కేజీబీవీల్లో మాత్రం 12వ తరగతి చదువుతున్న విద్యార్థినులను తీసుకోనున్నారు.

**క్లబ్‌ల నిర్వహణతో..** పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, బాలికా సాధికారిత, భద్రత, ప్రహరీ, డిజిటల్, లైబ్రరీ వంటి ఆరు రకాల క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రార్థన, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, పరిశుభ్రత, తల్లిదండ్రుల సమావేశానికి వచ్చేలా ప్రోత్సహించడం, రోజువారీగా హాజరు, సమయపాలన, పుస్తక పఠనం తదితర వాటిని పర్యవేక్షించాల్సి ఉంది. **బృందాలుగా విభజన..**

ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భాగస్వాములను చేసేలా నాలుగు బృందాలుగా విభజించనున్నారు. వాటికి ప్రత్యేక రంగులు కేటాయించనున్నారు. ఇందులో అబ్దుల్ కలాం(ఎరుపు), శకుంతలా దేవి(ఆకుపచ్చ), సీవీ రామన్(నీలి), రవీంద్రనాథ్ ఠాగూర్(పసుపు) హౌజ్‌లుగా విభజించి ప్రతి పాఠశాల నుంచి కెప్టెన్, వైస్ కెప్టన్లను నియమించనున్నారు. ప్రతి హౌజ్‌కు ఒక టీచర్ మెంటార్‌గా ఉంటారు.

**క్రమశిక్షణ, నైతిక విలువలు.. - రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి**

విద్యార్థుల బంగారు భవితకు చదువు ఒక్కటే ప్రామాణికం కాదు. అన్ని అంశాల్లోనూ విషయ పరిజ్ఞానం అవసరం. క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత ప్రతి విద్యార్థికి ఆభరణాలుగా మారాలి.

# శివారు.. పారిశుద్ధ్యం బేజారు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని శివారు కాలనీల నివాస ప్రాంతాల్లోని ఖాళీ ఇళ్ల ప్లాట్ల స్థలాలు, వీధులు మురుగు కూపాలకు నిలయంగా మారాయి. మరికొన్ని ప్రాంతాల్లో ముళ్ల పొదలు, చెత్తా చెదారంతో డంపు యార్డులుగా మారి దోమలు, పందులకు అడ్డాగా మారడంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టింపు కరవై..** వేములవాడ పట్టణంలోని శివారు ప్రాంతాల్లో చాలావరకు కొత్తగా కాలనీలు వెలుస్తుండటంతోపాటు ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కానీ మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేక వీధుల్లో మురుగు పారుతోంది. ఇళ్లను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా, ముళ్లపొదలకు నిలయాలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ ప్లాట్లలో వర్షం నీరు నిలిచి మురుగు కుంటలుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి విష కీటకాలకు ఆవాసంగా మారాయి. ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచుకోవాల్సి ఉండగా అవేవి పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఇటీవల మున్సిపల్ అధికారులు వంద రోజుల ప్రణాళిక అమలు చేశారు. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించినా పట్టణంలోని శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడలేదు. సాయినగర్, విద్యానగర్, అంజనీనగర్, కోరుట్ల



వైపు బస్టాండ్, కోనాయిపల్లి రోడ్డు, న్యూఅర్బన్ కాలనీ శివారు, వరలక్ష్మి కాలనీ, రెండో బైపాస్ రోడ్డు, మహాలక్ష్మీ వీధి, గుడి చెరువు కట్టకింద తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. సరైన మురుగు నీటి వ్యవస్థ లేక స్థానిక నివాస గృహాల పరిసరాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు గతంలో నోటీసులు ఇచ్చామని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో చాలాప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**ప్లాట్లు కొని.. వదిలేసి**

వేములవాడ పట్టణం ఆధ్యాత్మిక పట్టణం కావడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి తమ పేర రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాలు చేయక ఖాళీగా వదిలేయడంతో పిచ్చి మొక్కలు పెరిగి వర్షం నీరు నిలిచి ఇబ్బందులను తెచ్చి పెడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మున్సిపల్ అధికారులే ఖాళీ స్థలాల్లోని ముళ్ల పొదలను తొలగించి చదును చేసిన సందర్భాలున్నాయి.

**వేములవాడ పట్టణం వివరాలు**

వార్డులు 28
మొత్తం జనాభా 56 వేలు
నివాస గృహాలు 15 వేలు

# 'ఇరుకు' వంతెనలు.. 'ఇక్కట్లు'

కూసుమంచి : నిర్మించాం.. వదిలేశాం.. ఆపై ఎవరి జాగ్రత్త వారిదే అన్నట్టుంది జిల్లాలోని కాల్వలపై వంతెనల పరిస్థితి. నాగార్జున సాగర్ కాల్వలపై నాటి అవసరాల మేరకు నిర్మితమైన వాటిని అనంతర కాలంలో అవసరాలకు తగినట్టు విస్తరించిన దాఖలాలు లేవు. కనీసం రక్షణ ఏర్పాట్లు చేపట్టారా? అంటే అదీలేదు. వాహనాలు ప్రమాదవశాత్తు అదుపుతప్పి కాల్వల్లోకి దూసుకెళ్తూ ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నా ర.భ. శాఖ, జలవనరుల శాఖ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇటీవల ఖమ్మం గ్రామీణం మండలంలోని గొల్లగూడెం వద్ద సాగర్ కాల్వలో కారు దూసుకెళ్లి ఓ వ్యాపారి దుర్మరణం పాలయ్యారు.

1. పాలేరు ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ వంతెన

పాలేరు జలాశయం నుంచి జిల్లాకు నీటిని అందించే గేట్లు ఉన్న వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుకుగా ఉండే దీనిపై రక్షణ ఏర్పాట్లు లేక వాహనదారులు భయంభయంగా నడుపుతుంటారు. ఇటీవల బైక్‌పై వస్తున్న జలవనరుల శాఖ ఉద్యోగి దుర్మరణం చెందారు. ఎదురుగా వస్తున్న బస్సు డ్రైవర్ అతణ్ని తప్పించే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. 40మంది ప్రయాణీకుల బస్సు కాల్వలోకి దూసుకెళ్లేది. ఆత్మహత్య చేసుకోవాలని



నిర్ణయించుకున్న వారికీ ఈ స్థలం వేదికగా మారింది.

2. జలవిద్యుత్తు కేంద్రం కాల్వ వంతెన...

పాలేరు జలాశయం నుంచి చిన్నతరహా జలవిద్యుత్తు కేంద్రానికి నీరందించే కాల్వ వంతెనపై ఇరువైపులా రక్షణ గోడ లేదా ఇనుప జాలీ ఏర్పాటుచేయాలి. జీళ్లచెర్వుకు చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులిక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డారు.

3. గొల్లగూడెం వద్ద..

వరంగల్ - ఖమ్మం రహదార్లోని గొల్లగూడెం వద్ద వంతెన ప్రమాద నిలయంగా మారింది. విస్తరణ జరిగినా రక్షణ ఏర్పాట్లు లేవు. గతంలో కాల్వపై కారు రివర్స్ చేస్తున్న సందర్భంలో అదుపుతప్పి దూసుకెళ్లింది. ముగ్గురు మృత్యువాత పడ్డారు.

4. నేలకొండపల్లి మూలమలుపులో..

నేలకొండపల్లి సమీపంలోని 16, 17 బ్రాంచి కాల్వ వంతెన ప్రాంతం మలుపు ఉండటంతో ప్రమాదకరంగా ఉంది. కూసుమంచికి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిలో వంతెన ఉంది.

5. జక్కేపల్లి, మేడేపల్లి ప్రాంతాల్లో..

కూసుమంచి మండలంలోని జక్కేపల్లి నుంచి రాజేశ్వరపురం వెళ్లే మార్గంలో ప్రధాన కాల్వ, పాలేరు కాల్వల వంతెనలపై, అదేవిధంగా నేలపట్ల - ముదిగొండ రోడ్డులో మేడేపల్లి వద్ద రక్షణ లేదు.

# ఛార్జీలు ట్రూడౌన్

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో వివిధ రకాల పేర్లతో విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో వినియోగదారులు అల్లాడిపోయారు. ట్రూఅప్, ఇతర ఛార్జీల పేర్లతో విద్యుత్తు బిల్లులు పెంచడంతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. కూటమి ప్రభుత్వం తొలిసారిగా 'ట్రూడౌన్' పేరిట విద్యుత్తు బిల్లుల భారం తగ్గించనుంది. నవంబరు నుంచి ఈ తగ్గింపు ప్రయోజనాలను అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది.

**వచ్చే నెల నుంచి** గత ప్రభుత్వం హయాంలో ట్రూఅప్ ఛార్జీల పేరుతో 36 నెలల పాటు విద్యుత్తు వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చే నెల నుంచి సంవత్సరం పాటు ట్రూడౌన్ పేరిట విద్యుత్తు బిల్లులు తగ్గించనుంది. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని.. అవసరమైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు తీసుకున్నారు.



**వర్తింపు ఇలా...**

ఉచిత విద్యుత్తు ఇస్తున్న వ్యవసాయ కనెక్షన్లు మినహాయిస్తే.. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 9.48 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 887మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. విద్యుత్తు కొనుగోళ్లు, సరఫరా, పంపిణీ, నష్టాలు ఇతర వ్యయాలు కలిపి ఎఫ్‌పీపీసీఏ కింద ట్రూఅప్ పేరిట యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన కొనుగోళ్లు, వాస్తవ లెక్కలపై సమీక్షించిన కూటమి ప్రభుత్వం అదనంగా వసూలు చేసిన మొత్తంలో కొత్త వినియోగదారులకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన విద్యుత్తు వినియోగం ఆధారంగా యూనిట్‌కు 13పైసల చొప్పున తగ్గించనున్నారు. నవంబరు నుంచి ఏడాది పాటు(అక్టోబరు 2026 వరకు) తగ్గించనున్నారు. ట్రూడౌన్ ద్వారా జిల్లాలోని వినియోగదారులకు రూ. 11.78 కోట్ల మేర లబ్ధి చేకూరనుందని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు.

# ఉపాధి మరింత మందికి

నెల్లూరు : ఉపాధి హామీ పథకంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాల వారీగా పనులను చేయనున్నారు. ఈమేరకు మరింత మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రణాళికలు తయారుచేయనున్నారు. ఈనెల మూడో తేదీ నుంచి గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించనున్నారు. జిల్లాలో 37 మండలాలుండగా 723 పంచాయతీలున్నాయి. దాదాపు అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. పథకం కింద పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, కందకాల తవ్వకాలు, పండ్ల తోటల పెంపకం తదితర వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 229 కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు. వచ్చే ఏడాది ఎక్కువ కుటుంబాలకు 100 రోజులు పని కల్పించాలనే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కూలీలంతా వ్యవసాయ పనుల్లో ఉండడంతో పనులు నెమ్మదించాయి. ఈ పరిస్థితి డిసెంబరు వరకు కొనసాగే అవకాశాలున్నాయి. ఈ ఏడాది మిగిలిన పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాగానే కొత్తగా పనులను గుర్తించి మొదలు పెట్టాలి. ఆ తరువాత వేసవి కావడంతో కూలీలు ఎక్కువ మంది పథకాన్ని వినియోగించుకుంటారు.

**గ్రామాలవారీగా సభలు**

డిసెంబరు నెలాఖరు వరకు గ్రామాల్లో సభలు నిర్వహించి వచ్చే ఏడాది చేపట్టాల్సిన పనులపై నిర్ణయం తీసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్న



నేపథ్యంలో ఈసారి ఎక్కువ ప్రతిపాదనలు వెళ్లే అవకాశం ఉంది. ఈక్రమంలో అధికారులు స్థానికంగా ఏయే పనులు చేయాలో గుర్తిస్తారు. వీటిని కలెక్టర్‌కు పంపించి ఆమోదం తీసుకుంటారు.

**మరింత అదనంగా గంగాభవాని, పీడీ, డ్వామా**

ఏటా కూలీలతో చేయించాల్సిన పనులను ముందుగానే గుర్తించి పంపిస్తాం. ఈనెల మూడో తేదీ నుంచి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం కూడా ఏటా కూలీల వేతనాలను పెంచుతోంది. దీనికనుగుణంగా ప్రస్తుత ఏడాది కంటె వచ్చే ఏడాది ఎక్కువ పనులు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఈసారి గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యం ఉండే అవకాశం ఉంది.

పథకం వివరాలు

మొత్తం మండలాలు: 37
పనులు జరుగుతున్న పంచాయతీలు : 723
యాక్టివ్‌లో ఉన్న జాబ్ కార్డులు : 2.76 లక్షలు
నమోదైన కూలీలు : 4.33 లక్షలు
ఇప్పటివరకు జరిగిన పనుల విలువ : రూ. 229 కోట్లు
100 రోజులు పని చేసిన కుటుంబాలు: 2,447

# రక్షణ వేదిక.. భక్షణ వేడుక



కర్నూలు : జిల్లా పోలీసు శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. పట్టుకుంటాం.. పైసలిస్తే వదిలేస్తామనే తీరులో కొందరు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వారు.. జేబులు నింపుకోవడమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొంగలు, దోపిడీదారులు, మాదకద్రవ్యాలు, నాటుసారా విక్రేతలు, జూద కేంద్రాల నిర్వాహకులతో అంటకాగుతున్నారు. పలు కేసుల్లో పట్టుకున్న నిందితులను డబ్బులు తీసుకొని వదిలేస్తున్నారు. నగరం నుంచి పశ్చిమప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో 30 కి.మీ. దూరంలో ఉన్న ఓ ఠాణా ఇందుకు వేదిక అవుతోంది.. ఇక్కడ పని చేస్తున్న పోలీసు అధికారులు ఒక్కటై దందా చేస్తున్నారు.

**రంగులు మార్చారు**

చిత్రంలోని ద్విచక్రవాహనాన్ని గతంలో పోలీసులు పట్టుకున్నారు. ఆ వాహనం పాతగా ఉండటంతో కొత్తగా రంగులు వేయించి వినియోగిస్తున్నారు. ఈ ఠాణా పరిధిలో పోలీసులు పట్టుకొని సీజ్ చేసిన వాహనాలు 89... ఇందులో 25 ద్విచక్రవాహనాలు అదృశ్యం అయ్యాయి. ఇటీవల అధికారికంగా 5 వాహనాలే రికవరీ చేశారు.

**కారును వదిలేసి చెరబట్టారు**

కారు (ఏపీ 29 బీఎం 9946)లో అక్రమంగా 94 సెల్‌ఫోన్లు తరలిస్తుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాయి. ఆగస్టు 3న అర్ధరాత్రి పట్టుకొని 4న రికవరీ కింద 56 చూపారు. మిగిలినవి ఏమయ్యాయో తెలియని పరిస్థితి. అక్రమ రవాణాకు వినియోగించిన కారును వదిలేశారు.

**మూరా ఎంత ముట్టజెప్పిందో**

రూ.లక్ష ఇస్తే రూ.మూడు లక్షలిస్తాం.. మీకు నమ్మకం లేకపోతే కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారి పక్కనే పెద్ద వెంచరు ఉందంటూ ఓ ముఠా నమ్మబలికింది. తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా గట్టు ప్రాంతానికి చెందిన ఆంజనేయ నమ్మారు. ఆయన్ను ప్యాలకుర్తి బస్టాండు వద్దకు గత జులై 22న పిలిపించారు.. ఖయరాజు అనే వ్యక్తి వచ్చి రూ.3 లక్షలు అందజేస్తుండగా పోలీసునంటూ ఓ వ్యక్తి కారు (ఏపీ 26 బీఈ 3642)లో వచ్చి నగదు తీసుకెళ్లాడు. బాధితుడు అదే రోజు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. వారి వద్ద డబ్బులు తీసుకొని కారును, నిందితులను వదిలేశారు. బాధితుడు న్యాయం కోసం వెళ్లగా బెదిరించారు. చేసేదేమీలేక జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడుతుందని హుటాహుటిన బాధితుడిని ఠాణాకు పిలిపించి కేసు నమోదు చేసేందుకు ముందుకు వచ్చారు.

**ఫిర్యాదు చేసినా కేసులుండవు**

మార్కాపురానికి చెందిన చెందిన ఓ వ్యక్తి దోజరును పోలీసు అధికారి సొంత పనులకు వినియోగించుకున్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు అధికారిపై ఠాణాలో ఫిర్యాదు చేశారు.

పట్టుకున్న ఇసుకను అధికారులు తమ సొంత ప్రాంతానికి తరలించారు. గుప్తనిధుల కేసులో నిందితుల వద్ద డబ్బులు తీసుకొని స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు సమాచారం.

పట్టణంలోని ఓ ఇంట్లో గంజాయి తాగుతున్న వారిని పట్టుకొని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా పట్టుబడిన మద్యాన్ని మాయం చేసినట్లు సమాచారం.

గిరకల బావి వద్ద ఆగస్టు 31న ఓ వ్యక్తి స్కూటీలో రూ.1.35 లక్షలు చోరీ అయ్యాయి. బాధితుడు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు.

# మీ చెంతకే ఆధార్ సేవలు



నంద్యాల : జాతీయ తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 8 నుంచి 14వ తేదీ ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటుచేయనున్నారు. ఇందులో భాగంగా 5 నుంచి 17 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు బయోమెట్రిక్, ఆధార్ నవీకరణ సేవలను ఉచితంగా అందించనున్నారు. మిగిలినవారు అవసరమైన రుసుము చెల్లించి సేవలు వినియోగించుకోవచ్చు.

ఎలాంటి సేవలందిస్తారు

అవసరమైన వారందరికీ ఆధార్ నమోదు చేస్తారు. బయోమెట్రిక్‌ను నవీకరిస్తారు. నిబంధనలు అనుసరించి బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవచ్చు. మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు ప్రారంభించుకునే అవకాశం కల్పిస్తారు.

ఏ రోజు ఎక్కడ

కర్నూలు: ఈనెల 8వ తేదీ నుంచి 14 వరకు కర్నూలులోని ప్రధాన తపాలా కార్యాలయం, బాలాజీ నగర్‌లోని భాష్యం పాఠశాలలో 8, 9 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. 10, 11 తేదీల్లో ఎస్‌ఏపీ క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 13, 14 తేదీల్లో సంకల్‌బాగ్‌లోని భాష్యం పాఠశాలలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారు. ఈనెల 8వ తేదీ నుంచి 14 వరకు నంద్యాల గాంధీచౌక్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం, 8, 9 తేదీల్లో బస్టాండు సమీపంలోని బాలికోన్నత పాఠశాల, 10, 11 తేదీల్లో వైఎస్సార్ నగర్‌లోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాల (మైనార్టీ), 13, 14 తేదీల్లో వైఎస్సార్ నగర్‌లోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాలతోపాటు డోన్, పత్తికొండ ప్రధాన తపాలా కార్యాలయాల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆధార్ శిబిరాలు అందుబాటులో ఉంటాయి.

**దేనికెంత రుసుం**

డెమోగ్రాఫిక్ నవీకరణ : పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం, చరవాణి, ఈమెయిల్, ఫొటో, వేలిముద్ర, ఐరిస్ స్కాన్‌కు సంబంధించిన రుసుమును రూ. 75కు పెంచారు.

డాక్యుమెంట్ అప్‌లోడ్ : ఐడీ, చిరునామాకు పాత రుసుం రూ. 50 ఉండగా.. దీనిని రూ. 75కు పెంచారు.

బయోమెట్రిక్ నవీకరణ : 17 ఏళ్లకుపైబడిన వారికి సంబంధించిన రుసుము రూ. 100 నుంచి రూ. 125కు పెంచారు.

ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్ : పాత రుసుం రూ. 20 నుంచి రూ. 40కు పెంచారు.

# మేలు మరిచి పాత రకానికి జైకొట్టి



నంద్యాల : రబీ సీజన్ వచ్చేసింది.. రైతులు శనగ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలు పాత రకానివే కావడంతో అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. గత కొంతకాలంగా జేజీ 11 (ఎర్ర శనగ), కాబూలీ (తెల్ల శనగ) రకాలే ఇస్తున్నారు. ఇవి తెగుళ్లను తట్టుకోవడం లేదు.. ఏటా రైతులు భారీగా నష్టాన్ని చవిచూస్తున్నారు. అన్నదాతల కష్టాలు కళ్లార చూసిన శాస్త్రవేత్తలు మేలైన వంగడాలు అందుబాటులోకి తెచ్చారు. వాటిని రాయితీపై ఇవ్వడానికి వ్యవసాయశాఖ అధికారులు మనసొప్పడం లేదు.

**35,919.5 క్వింటాళ్ల విత్తనానికి ప్రతిపాదన**

కర్నూలు జిల్లా పరిధిలో 70 వేలు, నంద్యాలలో 50 వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం పప్పుశనగ విత్తన కేటాయింపులు చేసింది. కిలో రూ. 78 కాగా.. రూ. 19.50 రాయితీ పోను రైతులకు రూ. 58.50కు విక్రయించాలని ఆదేశించింది. నంద్యాల జిల్లాకు 35,919.5 క్వింటాళ్ల జేజీ 11 రకం విత్తనాలు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. మొదటి విడత 12,564 క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ. 7,800.. 25 శాతం రాయితీ పోనూ రైతులు రూ. 5,850 దిగుబడి దిగాలు గత రబీ సీజన్‌లో కర్నూలుకు 29,967, నంద్యాలకు 18,865 క్వింటాళ్లు కలిపి ఉమ్మడి జిల్లాకు జేజీ 11 రకానికి చెందిన 48,832 క్వింటాళ్ల విత్తనాన్ని రాయితీపై పంపిణీ చేశారు. వీటిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో వచ్చే తెగుళ్లను తట్టుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ఎండు తెగులు ఆశించినప్పుడు దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు పురుగు మందులకు అదనపు ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. 7 నుంచి 9 సంచులు రావాల్సిన దిగుబడి 3-5 సంచులకే పరిమితం అవుతోంది.


**ఆర్ఏఆర్ఎస్‌లో అందుబాటులో** తెగుళ్లు తట్టుకుని అధిక దిగుబడులు అందించే నూతన.. మేలైన శనగ విత్తన రకాలు నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్‌లో అందుబాటులో ఉన్నాయని ఏడీఆర్ జాన్సన్, ప్రధాన శాస్త్రవేత్త నీలిమ తెలిపారు. దేశవాళీ, కాబూలీ రకాలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. మేలైన నూతన శనగ వంగడాలను సాగు చేసి లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. దేశవాళీ రకాలైన (నంద్యాలగ్రామ్) ఎన్‌బీఈజీ 776, ఎన్‌బీఈజీ 924 రకాలు క్వింటా రూ. 10,500గా ధర నిర్ణయించారు. ఎన్‌బీఈజీ 452, ఎన్‌బీఈజీ 857 రకాలు రూ. 11,500, కాబూలీ రకాలైన ఎన్‌బీఈజీ 810, ఎన్‌బీఈజీ 119.. క్వింటా రూ. 15 వేలు, ఎన్‌బీఈజీ 833 రకం రూ. 16 వేల ధరగా ఉందన్నారు.

# పురాలకు అమృత్ ధారలు

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది మున్సిపాలిటీల్లో త్వరలో తాగునీటి సమస్యలు తీరనున్నాయి. గుక్కెడు నీటికి అల్లాడుతున్న జనానికి త్వరలో ఊరట కలగనుంది. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరు సరఫరా చేసేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్-2 కింద రూ. 403 కోట్లు మంజూరు చేశాయి. అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఈ పనులకు మంత్రివర్గ సమావేశం ఇటీవల ఆమోదం తెలిపింది. వీటికి త్వరలో టెండర్లు పిలవనున్నారు. అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులతోపాటు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కర్నూలులో రూ. 2.47 కోట్లు, నంద్యాలలో రూ. 74 కోట్లు, ఆదోనిలో రెండు ప్రాంతాల్లో రూ. 93.79 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**కర్నూలుకు రూ. 130 కోట్లు**

కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు రూ. 130 కోట్లతో కొత్తగా 20కిపైగా ఉపరితల నీటి ట్యాంకులు నిర్మించనున్నారు. సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ. 83 కోట్లతో పైపులైను పనులు పూర్తి చేయనున్నారు. కేసీ కాలువ నుంచి పైపులైనుతో నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనలు చేశారు. జగన్నాథగట్టు ప్రాంతంలో ప్లాంటు నిల్వ చేయనున్నారు.



**ఆదోనికి రూ. 35.17 కోట్లు**

ఆదోనిలో రూ. 12.9 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టులో 22 కి.మీ. పొడవునా నీటి గొట్టాలను ఏర్పాటు చేయనున్నారు. 15.45 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీలో రూ. 22.27 కోట్లతో నీటి పైపులైను ఏర్పాటు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, ట్యాంకులు, శుద్ధి కేంద్రంతోపాటు కాలనీలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు.

# నిధులు లేకుండానే పనులు.. ఆపై రద్దు

నెల్లూరు : గత ప్రభుత్వ పాపం ఇంకా వెంటాడుతోంది. నిధులు రాక ముందే, అధికారులపై ఒత్తిడి తెచ్చి.. గుత్తేదారులను ఒప్పించి పనులు చేయించారు. తీరా నిధులు రాలేదు.. కొన్ని పనులు చేసి ఆపేశారు. చివరకు సకాలంలో మొదలుపెట్టని కారణంగా దాదాపు 171 పనులు రద్దయ్యాయి. గతపాలన తీరుతో ఇంజినీరింగ్ అధికారుల ఇరకాటంలో పడ్డారు.

**నాబార్డు రుణం వస్తుందని..**

2022 అక్టోబరు, నవంబరు మాసాల్లో కురిసిన వర్షాలకు జిల్లావ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులు, కొత్త నిర్మాణాలకు నిధులు లేవు. దీంతో మార్కెటింగ్ శాఖకు చెందిన నిధులను పంచాయతీరాజ్ శాఖకు మళ్లించాలని అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిర్ణయించారు. పనులకు ప్రపంచ బ్యాంకు ద్వారా రుణం తీసుకోవాలని ప్రయత్నించారు. నిధులు రాక ముందే జిల్లా అధికారులు టెండర్లు పిలిచారు. రుణం ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు ముందుకు రాలేదు.. తిరిగి నాబార్డు రుణం తీసుకోడానికి ప్రయత్నం చేశారు. నిధులు రాకముందే అధికారులు టెండర్లు పూర్తిచేసి గుత్తేదారులను ఒప్పించి పనులు మొదలు పెట్టించారు. పనులకు సంబంధించి నిధులు రాలేదు... ఆర్థిక పరమైన అనుమతి లు పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఎస్ఈ కోటేశ్వరరావు తెలిపారు.

**171 పనులు**

222 బీటీ నిర్మించాలని నిర్ణయించారు. పనులకు సంబంధించి జిల్లాకు రూ. 185 కోట్ల నాబార్డు నిధులు వస్తాయని ఆశించారు. నచ్చచెప్పి గుత్తేదారుల చేత ముందుగానే ఆత్మకూరు, మనుబోలు, వెంకటాచలం, పొదలకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్‌లో తదితర మండలాల్లో పనులు ప్రారంభించారు. ఇలా దాదాపు 20 పనులు పూర్తయ్యాయి. 31 పనులు దాదాపుగా వివిధ దశల్లో ఉన్నాయి. చివరకు రుణం మొత్తం నేటికీ విడుదల కాలేదు. ఈలోపు రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. పనులు ప్రారంభం కానివి రద్దు చేయమని కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో 171 రద్దయ్యాయి.

# అరటి... ధరలు దిగజారి!

కంభం : పదిహేను రోజుల వ్యవధిలో అరటి ధరలు సగానికి పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి సమయంలో గెల రూ. 300కు పైగా పలికింది. దసరా నాటికి రూ. 230 నుంచి రూ. 250 మధ్య ధరలు కొనసాగాయి. ప్రస్తుతం రూ. వందకూ అడిగేవారు కరవయ్యారు. రెండు రోజుల క్రితం కంభానికి చెందిన ఓ రైతు గుంటూరు మార్కెట్‌కు పంటను తరలించగా గెల రూ. 30 నుంచి రూ. 40 మాత్రమే పలికింది. రవాణా ఛార్జీలూ రాలేదని ఆయన వాపోయారు. **ఇతర ప్రాంతాల నుంచి రాకతో...:** జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల్లో అరటి తోటలు వేశారు. పశ్చిమ ప్రకాశంలోని కంభం,



బేస్తవారపేట, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, రాచర్ల మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం పంటంతా కోత దశలో ఉంది. ఇదివరలో రోజుల క్రితం వరకు గుంటూరు వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేశారు. పంటను ఒడిశాకు ఎగుమతి చేయడంతో గిట్టుబాటు ధరలు లభించాయి. ప్రస్తుతం నంద్యాల, మహానంది తదితర ప్రాంతాల నుంచి గుంటూరు, విజయవాడ, ఒంగోలు, వినుకొండ తదితర మార్కెట్లకు పెద్ద మొత్తంలో సరకు వస్తుండడంతో డిమాండ్ తగ్గినట్లు చెబుతున్నారు.

**చెట్లపైనే మగ్గుతున్న కాయలు...:** ఇప్పటి వరకూ చాలా తక్కువ మంది మాత్రమే పంట అమ్ముకున్నారు. డిసెంబర్ వరకు దిగుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మరోవైపు చెట్లపైనే కాయలు మగ్గిపోతుండడంతో వేసేది లేక వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎకరంలో అరటి సాగుకు రూ. 80 వేలకు పైగా ఖర్చయ్యింది. పంట చేతికొచ్చేసరికి అమాంతం ధరలు పడిపోవడంతో నష్టపోయామ'ని కంభానికి చెందిన రైతు గౌస్ మొహిద్దీన్ వాపోయారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

# అంత్యక్రియలకు ఆరడుగులు కరవు!

కణేకల్లు మనిషి చనిపోతే సాధారణంగా మృతదేహాన్ని శ్మశానంలో పూడుస్తారు. కాని ఆ గ్రామంలో మాత్రం రోడ్డు పక్కనే అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి.! వినడానికి, చూడటానికి వింతగా ఉన్నా.. అంత్యక్రియలకు ఆరడుగుల నేల కరవైన దీన పరిస్థితి కణేకల్లు మండలం బెణికల్లు పంచాయతీ పరిధిలోని సీతారామనగర్ క్యాంపువాసులది. ఇక్కడ సుమారు 100 కుటుంబాలకుపైగా వలసొచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నావారున్నారు. వీరంతా పేద కూలీలే కావడం గమనార్హం. గ్రామంలో కాస్త డబ్బులున్నవారు, మోతుబరి రైతులు మృతిచెందితే వారివారి పొలాల్లో శవ దహన



సంస్కారాలు నిర్వహించుకొంటుండగా.. ఇతరులంతా రోడ్డు పక్కన మృతదేహాలు పూడ్చి పెట్టాల్సిందే. అంతిమ క్రియలకు స్థలం చూపించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా.. పట్టించుకొనే వారే లేరని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట మృతిచెందిన క్యాంపు వాసి లోకిరెడ్డి(70) శవాన్ని బెణికల్లు వైపు ర.భ రోడ్డు పక్కన పూడ్చిపెట్టడం విశేషం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ చూపి శ్మశానవాటికకు స్థలం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# హస్తకళా ప్రశస్తి.. శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి: కలంకారీ వస్త్రోత్పత్తులను పలు ప్రాంతాల్లో తయారు చేస్తున్నా.. శ్రీకాళహస్తి కలంకారీ మాత్రం అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఆర్జించింది. ఇక్కడి కళాకారులు వాడే సహజ రంగులే ఇందుకు ప్రధాన కారణం. 3 వేల ఏళ్ల నాటి కళ ఇప్పటికీ వైభవాన్ని సంతరించుకోవడం విశేషం. ఎక్కువ కాలం మన్నికగా ఉండటం వీటి ప్రత్యేకత. దీని వెనక రహస్యాలు మనమూ తెలుసుకుందామా.. ఏం చేస్తారంటే.. వీటి తయారీలో ప్రధాన భూమిక వస్త్రం సిద్ధం చేసుకోవడమే. నేతన్నలు ముందుగా ఎంపిక చేసుకున్న వస్త్రాన్ని కరక్కాయపొడి, పాలు మిశ్రమంలో నానబెడతారు. అలాగే ఆరనిస్తారు. ఆ తర్వాత వేయాల్సిన చిత్రాలకు అనుగుణంగా ఔట్‌లైన్ వేసుకొని, వాటిలో రంగులు వేస్తారు. వెదురుపుల్లను కుంచెగా చేసుకొని చిత్రాలు గీస్తారు. వాటికి రంగులు అద్ది.. కొంగొత్త హంగులు తీర్చిదిద్దుతారు.

**ఆన్‌లైన్ మార్కెట్..**కరోనా తదనంతరం ఆన్‌లైన్ మార్కెట్ పెరిగింది. ప్రస్తుతం దీని ద్వారా అమ్మకాలు పెరిగాయి. పలు వెబ్‌సైట్లలో ఈ వస్త్రాలు లభ్యమవుతున్నాయి.



**రంగులు సృష్టిస్తారిలా..**

కలంకారీలో ప్రధానంగా నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, ఊదా తదితర రంగులు సహజంగా సిద్ధం చేసుకుంటారు. ఇనుప ముక్కలు, బెల్లం సమపాళ్లలో తీసుకుని ఊరబెడితే నలుపు రంగు ఏర్పడుతుంది. కరక్కాయ పూలు, దానిమ్మ గింజలను వారం కంటే ఎక్కువ రోజులు నానబెట్టి ఉడకబెడితే పసుపు రంగు సిద్ధం.

జాజి ఆకుతో పలు రకాల ఆకులు నానబెట్టి ఉడికిస్తే ఎరుపు రంగు వస్తుంది. నలుపు, ఎరుపు మిశ్రమంతో ఆకుపచ్చ రంగు, మంజిష్ట్రా వేరు ద్వారా ఊదా రంగు అందుబాటులోకి వస్తుంది.

ఇండిగో బ్లూకు, ఆలం కలిపి ఊరబెడతారు. పది రోజుల తర్వాత ఉడకబెడితే నీలం రంగు సిద్ధం.

# రక్తపోటు.. చక్కెర కాటు

భీమవరం: మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. మహిళ ఆరోగ్యం- బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి ఈ నెల 2 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పరీక్షలు చేసి... వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఔషధాలు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరాల్లో మహిళలతోపాటు పురుషులకు అధిక రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, క్షయ వ్యాధి నిర్ధారణ, రక్తహీనత పరీక్షలు చేశారు.

34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆవరణల్లో 3584 వైద్యశిబిరాల్లో 1,15,773 మందికి పరీక్షలు చేసినట్లు డీఎంహెచ్‌వో జి.గీతాబాయి తెలిపారు. కొన్ని రుగ్మతలను




వెంటనే గుర్తించి వైద్య సేవలు అందించామన్నారు. మరికొన్ని పరీక్షల నివేదికలు రావాల్సి ఉందన్నారు. 47719 మందికి క్యాన్సర్, 20,326 మందికి క్షయ పరీక్షలు నిర్వహించారు.

**కారణాలు అనేకం..** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రక్తపోటు, చక్కెర వ్యాధితో ఉంటున్నవారి సంఖ్య అధికంగా ఉంది. పనుల్లో ఒత్తిళ్లు, సమయానికి నిద్ర లేకపోవడం, ఆహారంలో ఉప్పు, కారం మోతాదుకు మించి వినియోగించడం, సరైన వ్యాయామం లేకపోవడం తదితర కారణాలతో రుగ్మతల బారిన పడుతున్నట్లు గుర్తించారు. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయాలని వైద్యులు సూచించారు.

# పుర.. రహదారిద్ర్యం



తాడిపత్రి : జిల్లాలోని పురపాలికల్లో రహదారులు దారుణంగా ఉన్నాయి. వీటి నిర్వహణను రోడ్లు, భవనాల శాఖ అధికారులు గాలికొదిలేశారు. ప్రధానంగా గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పురపాలికలోని ప్రధాన రహదారులు పరిస్థితి చెప్పేలా లేదు. గత ఐదేళ్లల్లో వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుంతలకు ప్యాచ్ వర్కులు చేయించినా ఫలితం లేకుండాపోయింది. గుత్తిలోని పత్తికొండ, గుంతకల్లు, అనంతపురం, కర్నూలు రహదారులు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తాయి. గుత్తి శివారులోని బసినేపల్లితండా నుంచి గుత్తి వరకు ఉన్న పత్తికొండ- మంత్రాలయం రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది.

గుత్తిఆర్.ఎస్.లోని రైల్వే వంతెనపై రహదారి శిథిలావస్థకు చేరింది. అనంతపురం మార్గం బీసీకాలనీ వద్ద గోతులమయమైంది. గాంధీచౌక్ నుంచి గుత్తిచెరువు మరువ వరకు గుంతలున్నాయి.

గుంతకల్లులో జట్కాస్టాండు వద్దే కాకుండా అంజుమన్ కాలనీ క్రాస్, మండీబజార్ క్రాస్, ఆసుపత్రి, పొట్టిశ్రీరాములు కూడలి, పెట్రోలు పంపు తదితర చోట్ల దారులు దెబ్బతిన్నాయి. ప్రధానంగా అంజుమన్ కాలనీ, తిలక్‌రోడ్డు, వన్‌వే, ధర్మవరం గేట్ వద్ద వాహన రాకపోకలకు కష్టంగా ఉంది. దాదాపు 15 కి.మీ.ల పొడవైన రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేయాల్సి ఉంది.

తాడిపత్రిలో యల్లనూరు, పుట్లూరుకు వెళ్లే ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఒక్క గుంతకల్లు రోడ్డులోనే గడిచిన ఆరు నెలల కాలంలో ముగ్గురు మరణించారు.

**రూపుకోల్పోయి.. దారుణ స్థితి**

ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు తూతూమంత్రంగా మరమ్మతులు చేయించి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్యాచ్ వర్కులు దెబ్బతినడంతో వర్షాకాలంలో మోకాలు లోతు నీళ్లు నిలబడుతున్నాయి. ఇటీవల గుత్తిలో రూ.2 లక్షలతో మరమ్మతులు చేయించారు. మళ్లీ యథాస్థానానికి రావడం గమనార్హం.

**రూ.2 కోట్లతో టెండర్లు పిలిచాం**-హనీఫ్‌వలి, ఏఈఈ, గుత్తి రహదారులకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్యాచ్ వర్కులు చేయించాం. వర్షాల కారణంగా పాడయ్యాయి. తిరిగి రోడ్లు గోతుల మయం అయ్యాయి. గోతులను పూడ్చివేసి మందంగా తారువేయిస్తాం. రూ.2 కోట్లతో పనులకు టెండర్లు పిలిచాం.

# సాగుకు వేళాయె.. రాయితీ విత్తనం రాకపాయే!



ఉరవకొండ: నల్లరేగడి భూముల్లో రబీలో సాగయ్యే పప్పుసెనగ విత్తుకోవడానికి అన్నదాతలు దుక్కులు సిద్ధం చేసుకున్నా.. రాయితీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి అనంత జిల్లాలో సుమారు 68 వేలకు పైగా ఎకరాల్లో పప్పుసెనగ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా ఉరవకొండ, వజ్రకరూరు, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, కణేకల్లు, డి.హీరేహాళ్, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో పంట విస్తారంగా సాగవుతుంది. ఈ ఏడాది 14 వేల క్వింటాళ్లకు పైగా విత్తనాన్ని సర్కారు కేటాయించింది. ప్రభుత్వం రాయితీ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

**విత్తుకు అనుకూలం**

ఇటీవల కురిసిన వర్షాలకు నేలలోని తేమ విత్తనానికి అనుకూలంగా ఉంది. ఈ సమయంలో విత్తితే మొలక సరైన తీరులో వచ్చి అధిక దిగుబడులకు వాతావరణం అనుకూలిస్తుంది. ఈక్రమంలో నేటికీ రైతుసేవా కేంద్రాలకు విత్తనాలు చేరలేదు. రైతుల పేర్లు నమోదుకు ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

**ప్రాసెసింగ్ దశలోనే..**

ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో సాగుకు రైతులు సమాయత్తం అయ్యారు. ఈక్రమంలో రాయితీ విత్తనం ఇంకా ప్రాసెసింగ్ దశలో ఉందని అధికారులు చెబుతుండటం గమనార్హం. గత వైకాపా పాలనలో విత్తన ఏజెన్సీలు, సరఫరాదారులకు రూ.74 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వాటిని చెల్లిస్తేనే మళ్లీ సరఫరా చేస్తామని పేర్కొంటున్నాయి.

**అధిక ధరలకు..**

ప్రస్తుతం విత్తనాలకు డిమాండ్ పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ.5,300తో వ్యాపారులు కొనుగోలు చేసి.. తిరిగి అధిక ధరలకు అంటగడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. నగదు చెల్లించే వారికి రూ.5,800, అప్పు అడిగే రూ.6,200 మేర విక్రయిస్తున్నట్లు వాపోతున్నారు.

**వారంలో వచ్చే అవకాశం**

రాయితీ విత్తనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిర్దేశించిన విత్తనం వారంలో చేరుకునే అవకాశాలున్నాయి. ఈవిషయంగా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

- సత్యనారాయణ, ఏడీ, ఉరవకొండ

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

- సుబ్బయ్య, డీఎం, ఏపీసీడ్స్

విత్తన సేకరణ ఏజెన్సీలు పాత బకాయిలు చెల్లించాలని పట్టుబడుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాసెసింగ్ వేగవంతం చేయిస్తాం. రైతు సేవా కేంద్రాలకు విత్తనాలు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

# కసాపురం.. ప్రగతిపథం



గుంతకల్లు : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గుంతకల్లు మండలంలో కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయ రూపురేఖలు, ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ఇది వరకు ఆలయానికి దగ్గరలో పలు వ్యాపార దుకాణాలు ఉండటంతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు వాటన్నింటికీ చెక్ పెడుతూ ప్రగతికి శ్రీకారం చుట్టారు. దాతల విరాళాలతో పనులు చేపట్టనున్నారు.

**పాత విడిది కేంద్రాల కూల్చివేత**

కోవెల దక్షిణ గోపురం ఎదురుగా, వెనకాలా ఏళ్లనాటి భక్తుల వసతి భవనాలు శిథిలావస్థకు చేరి వృథాగా ఉండేవి. సుందరీకరణ పనుల్లో భాగంగా వారం రోజుల నుంచి జేసీబీలతో ఆయా భవనాల కూల్చివేత పనులు జరుగుతున్నాయి. దేవస్థానం ముందర, ఆలయ పరిసరాల్లో వ్యాపార దుకాణాలను పూర్తిగా తొలగించారు.

కోనేటి కల్యాణ కట్టకు వెళ్లే దారిలో ఉన్న దుకాణాలు గోశాలకు చెందిన షెడ్లను తొలగిస్తున్నారు. దుకాణదారులకు మరోచోట షెడ్లు ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతి ఇచ్చారు. ఎట్టకేలకు దుకాణాలు, వసతి గదుల తొలగింపు తర్వాత క్షేత్ర పరిసరాలు చూడముచ్చటగా విశాలంగా కనిపిస్తున్నాయి.

**భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం**

- విజయరాజు, ఈవో, కసాపురం ఆలయం

భక్తుల సౌకర్యార్థం కోసం ఆలయ అభివృద్ధికి, భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. దుకాణదారులకు మరో చోట సుమారు 40 మందికి పైగా షెడ్లు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చాం. ఆలయ ఆవరణలోని ఉద్యానాన్ని బాగు చేయిస్తాం.

# అదను చూసి చదును

ఏలూరు: మొగల్లు పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఆనుకుని అల్లూరి సీతారామరాజు స్మారక ట్రస్టుకు చెందిన భూమిని పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు చేశారు. దీనిపై గతంలో స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సర్వేచేసి హద్దులు నిర్ణయించారు. ఆక్రమణలు తొలగించలేదు.

దువ్వ సెంటర్లో రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని దుకాణాలు, ఇంటి నిర్మాణం చేపట్టారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. వాటిపై ఎవరైనా ప్రశ్నిస్తే నోటీసులిచ్చామంటూ సమాధానం దాటవేస్తున్నారు.

సీతారామపురం సౌత్‌లో రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అయినపర్తి వీరవెంటసత్యనారాయణ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

చినమల్లంలో దశాబ్దాలుగా రైతులు పొలాలకు వెళ్లేందుకు దారిగా వినియోగిస్తున్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. మండల అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదని, అనేక ఇబ్బందులు పడుతున్నామని గుడాల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఉదాసీన వైఖరితో జిల్లాలోని విలువైన పంచాయతీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. అదను చూసి చదును చేస్తుండటంపై స్థానికులు ఫిర్యాదు చేసినా రాజకీయ



ఒత్తిళ్లతో అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. అడపాదడపా నోటీసులతో సరిపెడుతున్నారు. ఫలితంగా ఒకర్ని చూసి మరొకరు ఆక్రమణలకు తెగపడుతున్నారు.

**చిన్నగా మొదలై**

చిన్నపాటి రేకుల షెడ్డు లేదా.. పశువులను కట్టడం, రాళ్లను పేర్చడం వంటివి చేసి ఆనక వాటిలో భవన నిర్మాణాలు చేస్తున్నారు. వాటిపై స్థానికులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు ఆక్రమణదారులతో చర్చలు జరపడం మినహా, తొలగింపునకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా సమస్యను పరిష్కరించినట్లు నివేదికను సమర్పిస్తున్నారు. మొదట్లోనే స్థానికులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్న కొందరు కోర్టును ఆశ్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో పంచాయతీకి చెందిన పలు భూములు ఆక్రమణలకు గురయ్యాయి. అక్కడ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అవి వివాదాలకు దారితీయడంతో పాటు ఒకర్ని చూసి మరొకరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఆక్రమణలో చెరలో ఉన్న పంచాయతీ భూములు, ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

# ఇసుక.. మస్కా!

ఏలూరు: ఎక్కడ తూర్పుగోదావరి.. ఎక్కడ ఎన్టీఆర్ జిల్లా. ఈ రెండు జిల్లాల మధ్య దూరం వందల కిలోమీటర్లు ఉంటుంది. అయినా తూర్పుగోదావరి జిల్లాలోని ఇసుక స్టాక్ పాయింట్లు, రీచ్‌ల నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని వత్సవాయి, వీరులపాడు మండలాలకు ఏమాత్రం ధ్రువీకరణ లేకుండా ఇసుక లోడ్ చేసి పంపుతున్నారు తూర్పుగోదావరి అధికారులు. ఆ జిల్లా నుంచి ఏలూరు జిల్లాలోని చింతలపూడికి 1.34 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందని తెలుసుకుని ఇప్పటికే అవాక్కయ్యారు. అయినా అధికారులు గుణపాఠాలు నేర్వలేదు. సోమవారం అర్ధరాత్రి తూగోజిల్లా రీచ్‌ల నుంచి వస్తున్న ఐదు లారీలు తెలంగాణలోకి ప్రవేశిస్తుండగా జీలుగుమిల్లి పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నారు.

**ఎందుకు ధ్రువీకరించుకోరు?..** వీరులపాడు, వత్సవాయిలో ఎవరికైనా ఇసుక కావాలంటే వారికి అదే జిల్లాలో కంచికర్ల, వీరులపాడు మండలాల సరిహద్దులో నిల్వ కేంద్రం ఉంది. ఆ విషయం అధికారులకు తెలుసు. అయినా ఇంతదూరం నుంచి ఎందుకు బుక్ చేసుకుంటున్నారు? వ్యయ, ప్రయాసలకోర్చి తీసుకెళ్లడం ఏమిటని వారి చిరునామా వివరాలు ఎన్టీఆర్ జిల్లా అధికారులకు పంపి ధ్రువీకరించుకుంటే అసలు లారీల్లోకి ఇసుక లోడ్ అయ్యేదే కాదు. ఆంధ్రప్రదేశ్ చిరునామాతో ఆధార్‌కార్డు ఉంది కదా? అని ధ్రువీకరణ లేకుండా పంపటం ఎంతవరకు సబబో ప్రశ్నించుకోవాలి.

**అయినా ఏలూరు మీదుగా వెళ్లాలి!..** వీరులపాడు, వత్సవాయికి వయా ఏలూరు, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలి. కాని గ్రీన్‌ఫీల్డ్ హైవేలో జీలుగుమిల్లి మండలం నుంచి వెళ్లటం అంటే పక్కదారి పట్టడమేనన్నది స్పష్టమౌతోంది. పోలీసులు పట్టుకున్న ఐదు లారీల్లో రెండు వీరులపాడు, వత్సవాయి మరో రెండు ఏలూరు, ఇంకొకటి చాట్రాయి చిరునామాతో ఉన్నాయి. వీటికి జీలుగుమిల్లి మార్గానికి పొంతనే ఉండదు. పక్కాగా ఆ లారీలు తెలంగాణకు తరలిస్తున్నారని పోలీసువర్గాలు తెలిపాయి.

వెయ్యి ఇస్తే ఆధార్ కార్డు.. కొందరు ఇసుక దళారులు, మాఫియా పేదలకు వెయ్యి రూపాయిలిచ్చి ఆధార్ నకలు సేకరించి అలా బుక్ చేస్తున్నారు. తీరా ఆ లారీలు తెలంగాణాకు పంపి అధికమొత్తంలో లాభపడుతున్నారని తెలుస్తోంది. అంతా కుమ్మక్కై ఒక పథకం ప్రకారం ఉచిత ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు.

# దారిచ్చిన.. గోదారి..

కుక్కునూరు : గోదావరి వరద ఎట్టకేలకు దారిచ్చింది. అయిదు నెలలుగా తగ్గుతూ, పెరుగుతూ తీరప్రాంత వాసులను నానా ఇక్కట్లకు గురిచేసిన వరద ఉదయం వంతెనల పైనుంచి వైదొలగింది. దీంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వరదల సరళిని పరిశీలిస్తే జూన్ 15న మొదలైన వరద ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉంది. 1976 నుంచి వరదల సరళిని పరిశీలిస్తే 50 సార్లు వచ్చాయి. ఈ ఏడాది వచ్చిన స్థాయిలో వరదలు పోటెత్తిన దాఖలాలు గతంలో లేవు. ఈ ఏడాది 9 దఫాలు గ్రామాలను చుట్టుముట్టి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు చెరిపేశాయి. అక్టోబరులో వరదలు రావటం కూడా అరుదు. 1995లో ఒక్కసారి మాత్రమే వరదలు వచ్చాయి. దాదాపు 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ఏడాది అక్టోబరు నెలలో వరదలు రావటం జరిగింది. తగ్గినట్లే తగ్గి, వెంటనే పెరగటం నిత్యకృత్యంగా మారింది. మొత్తం మీద ఈ ఏడాది పడినన్ని కష్టాలు గతంలో ఎన్నడూ చూడలేదని వాపోతున్నారు. ఈ ఏడాదిలో మూడు దఫాలు మొదటి, మరో మూడు దఫాలు రెండో ప్రమాద హెచ్చరికలను అధిగమించి, వరద ప్రవహించటం గమనార్హం.

# చెత్తశుద్ధి.. స్వచ్ఛత వృద్ధి

ఆదోని : ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్త గుట్టలు త్వరలో ఖాళీ కానున్నాయి. పురపాలికల్లో స్వచ్ఛతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. కంపోస్టు యార్డుల్లోని చెత్త తరలించేందుకు రంగం సిద్ధం చేసింది. వందల టన్నుల మేర పోగైన చెత్తను శుద్ధి చేసే పనులను ప్రజారోగ్య విభాగం ద్వారా చేపట్టనుంది. అక్టోబరు 2వ తేదీ నాటికి కంపోస్టు యార్డులన్నీ ఖాళీ మైదానాలుగా మార్చి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సంకల్పించింది.

**కూటమి ప్రభుత్వం చొరవతో..**

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించింది. కంపోస్టు యార్డులన్నీ ఖాళీ చేయించే పనులు చేపట్టింది. ఈ ఏడాది జులై ఆఖరులో పనులను ప్రజారోగ్య విభాగానికి అప్పగించింది. మహారాష్ట్రకు చెందిన సౌరాష్ట్ర కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. మెట్రిక్ టన్ను చెత్త శుద్ధి చేసేందుకు రూ.840 చెల్లించనుంది. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, గూడూరు తదితర పురపాలక సంఘాల్లో యంత్రాలు తెప్పించి పనులు చేపట్టింది. కర్నూలులో 60, ఆదోని 8, ఎమ్మిగనూరు 30, డోన్ 30, నంద్యాలలో 77 మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేసినట్లు సమాచారం. శుద్ధి చేసిన మట్టిని పొలాలకు ఎరువుగా, మండే స్వభావం ఉన్న చెత్తను పరిశ్రమలకు, శుద్ధి కాని వాటిని గుంతలు తీసి పూడ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఆయా పనులకు టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు.



**గతంలో నిధులివ్వక..**


ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలిక సంఘాలున్నాయి. రోజూ సుమారు 500-600 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఫలితంగా జనం చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఎన్జీటీ బృందాలు కంపోస్టు యార్డులను తనిఖీ చేసి వేల టన్నులకొద్దీ పోగైన చెత్తను చూసి చీవాట్లు పెడితే తప్ప గత ప్రభుత్వంలో కదలిక రాలేదు. చివరికి చెత్తను శుద్ధి చేసేందుకు తమ వద్ద నిధులు లేవని చేతులెత్తేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటుతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని సూచించినా పట్టించుకోలేదు. మరోవైపు మహారాష్ట్రకు చెందిన సాగర్ కంపెనీకి టన్ను చెత్త శుద్ధి చేసేందుకు రూ.640 చెల్లించేలా పనులు అప్పగించింది. సాంకేతిక, ప్రణాళిక లోపంతో పనులు మధ్యలో ఆగిపోయాయి.

# ఉల్లి గుట్టలు.. తరగక కష్టాలు

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లి నిల్వలతో నిండిపోయింది. గోదాములు, కమీషన్ ఏజెంట్ల దుకాణాల ఎదుట, జంబోషెడ్డు, మాధవాచారి షెడ్లలో ఎటుచూసినా ఉల్లి బస్తాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన సరకు రెండు వారాలుగా సంచుల్లోనే మగ్గుతోంది. దీంతో చాలాభాగం కుళ్లిపోయింది. కొనుగోలు చేసిన నిల్వలు ఏమాత్రం బయటకు వెళ్లడం లేదు.

**ఫలించని ప్రయత్నాలు**

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లిని విక్రయించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇప్పటివరకు 5 వేల టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో 2 వేల టన్నుల సరకు మాత్రమే రైతుబజార్లు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 3 వేల టన్నుల ఉల్లి నిల్వలు మార్కెట్‌లోనే ఉన్నాయి. అన్ని షెడ్లలోని ఉల్లి నిల్వలను ఖాళీ చేయించాలన్న ఉద్దేశంతో శని, ఆదివారం.. రెండు రోజులపాటు మార్కెట్‌లో ఉల్లి క్రయవిక్రయాలు నిలిపేసి నిల్వ ఉన్న సరకుకు వేలం నిర్వహించారు. రెండు రోజులు కలిపి వ్యాపారులు అతి తక్కువ ధరకు 1,500 టన్నుల సరకు మాత్రమే కొనుగోలు చేశారు. మరో 1,500 టన్నుల నిల్వలు షెడ్లలో, కమీషన్ ఏజెంట్ల దుకాణాల ముందు పేరుకుపోయాయి. వీటిని వేలం వేసినా వ్యాపారులు కొనుగోలు



చేయని పరిస్థితి నెలకొంది.

**వ్యాపారికి లాభసాటి**

గత రెండు వారాలుగా మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ. 1,200 మద్దతు ధరతో ఉల్లి కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన సరకుకు ఇప్పటివరకు వేలం వేయగా వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. క్వింటా రూ.10, రూ.30, రూ.50, రూ.60, రూ.90, రూ.100కు కొనుగోలు చేస్తున్నారు. పది లాట్లకు మాత్రమే రూ.450 నుంచి రూ.900 వరకు ధర పలికింది. మిగిలిన సరకును క్వింటా రూ.200లోపే కొన్నారు.

**కొత్త సరకు దించేదెలా..**

ఆదివారం రాత్రికే షెడ్లలో ఉన్న ఉల్లిని ఖాళీ చేయాల్సి ఉంది. వేలం ద్వారా కొనుగోలు చేసిన ఉల్లిని వ్యాపారులు బయటకు తీసుకెళ్లలేదు. అక్కడే గ్రేడింగ్ చేసుకుంటున్నారు. దీంతో షెడ్లలో నిల్వలు ఉండిపోయాయి. శని, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో సోమవారం ఒక్కరోజే 25 వేల క్వింటాళ్లకు పైగా ఉల్లి దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశాలున్నాయి.

**ప్రభుత్వానికి రూ.3.5 కోట్ల నష్టం**

ప్రభుత్వం క్వింటా రూ.1200కు కొనుగోలు చేసిన ఉల్లిని వేలం ద్వారా వ్యాపారులకు అతి తక్కువకే విక్రయించడం ద్వారా ఇప్పటికే రూ.కోటిన్నర నష్టం వాటిల్లింది. వేలంలో కొనుగోలు చేయని సరకును మరోమారు వేలం వేసినా ఎవరూ కొనే పరిస్థితి లేదు. వ్యాపారులు కొనుగోలు చేయనిది, కుళ్లిపోయిన ఉల్లి ద్వారా మరో రూ.2 కోట్లు దుర్వినియోగమైనట్లే. మొత్తంగా ప్రభుత్వం సుమారు రూ.3.5 కోట్ల మేర నష్టపోతోంది.

# డీసీసీబీ అక్రమాల ఫలితం



చిత్తూరు : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో వైకాపా ప్రభుత్వంలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యల కింద 11 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేశారు. డీసీసీబీ పూర్వపు సీఈవో మనోహర్‌గౌడ్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న చీఫ్ మేనేజర్లు సందీప్, నవీన్‌కుమార్, త్యాగరాజు, ఏజీఎం చంద్రకళ, మేనేజర్లు వెంకటేష్ బాబు, పుష్పలత, రమేష్, మోహన్ కుమార్, స్టాఫ్ అసిస్టెంట్లు యాసిన్, లక్ష్మారెడ్డిని సస్పెండ్ చేశారు. వీరితో పాటు అక్రమ మార్గంలో సర్వీసుల క్రమబద్ధీకరించుకున్న మేనేజర్ లక్ష్మి ప్రసన్న, స్టాఫ్ అసిస్టెంట్లు జయప్రకాష్, గురునాథంను విధుల నుంచి తొలగించారు. గత పాలకవర్గానికి సహకారం అందించిన మరో నలుగురు విశ్రాంత ఉద్యోగులకూ నోటీసులు జారీ చేశారు. మరో 30 మంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

**ఇదీ సంగతి..**

వైకాపా హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండానే.. నామినేటెడ్ కమిటీలతో ఐదేళ్లూ కొనసాగించారు. డీసీసీబీ పాలకవర్గాన్ని సైతం ఏడుగురు సభ్యులున్న కమిటీతోనే ఐదేళ్లూ నడిపారు. జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి అనుచరుడి భార్యను డీసీసీబీ పాలకవర్గానికి ఛైర్‌పర్సన్‌గా నియమించారు. దాదాపు రూ.మూడు వేల కోట్ల వ్యాపార లావాదేవీలు కలిగిన డీసీసీబీ పరిధిలో 40 శాఖలు, 75 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. భారీ స్థాయిలో లావాదేవీలు కలిగిన బ్యాంకును.. ఇష్టారీతిన వినియోగించుకుని అక్రమాలకు పాల్పడ్డారు.

**నియామకాలకూ వసూళ్లు..**

డీసీసీబీ పరిధిలో రెగ్యులర్ ప్రాతిపదికన స్టాఫ్ అసిస్టెంట్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల నియామకాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల నుంచి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖల భవన నిర్మాణాల పేరుతో ఆన్‌లైన్ టెండరు లేకుండా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని నిర్మాణ ముసుగులో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఈ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుమారు ఆర్నెళ్ల పాటు విచారణ కొనసాగగా.. అప్పటి పాలకవర్గానికి సహకరించిన డీసీసీబీ సిబ్బందిపై తాజాగా వేటు వేశారు.

# నిధులొచ్చేనా.. నీళ్లు పారేనా?



నర్సీపట్నం : ఇటీవల కురిసిన వర్షాలకు నర్సీపట్నం ప్రాంతంలోని పలుచోట్ల పంట కాలువలకు గండ్లు పడి సాగునీరు వృథా అవుతోంది. అత్యవసర పనులకు తాత్కాలిక మరమ్మతులకైనా నిధులివ్వకపోతే ఈ ఏడాది ఖరీఫ్‌లో వందల ఎకరాల్లో వరికి సాగునీరు ప్రశ్నార్థకమవుతుంది. మాకవరపాలెం ఆనకట్ట కాలువకు మళ్లీ గండి పడింది. గతంలో కర్రలు పాతి ఇసుక బస్తాలు వేసిన చోట వర్షాలకు గట్టు కొట్టుకుపోయింది. తక్షణమే గోడ నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ కాలువ కింద మాకవరపాలెం, పైడిపాల గ్రామాల్లో 400 ఎకరాల ఆయకట్టు ఉంది. తాత్కాలిక మరమ్మతుకు రూ.2 లక్షలు, శాశ్వత మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరమని అంచనా.

కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద మల్లవరం కాలువకు గండి పడింది. ఈ కాలువ కింద కోటవురట్ల మండలం ఎండపల్లి, మాకవరపాలెం మండలం మల్లవరం, గిడుతూరు పంచాయతీల్లో 700 ఎకరాల ఆయకట్టు ఉంది. కొద్దిరోజుల కిందట గిడుతూరు పర్యటనకు వచ్చిన సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి అక్కడి రైతులు గండి పడిన విషయాన్ని తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రైతులతో కలిసి గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులకు నిధులివ్వాలని కలెక్టర్‌కు సూచించారు.

గండి పూడ్చేందుకు రూ.2 లక్షలు, శాశ్వత మరమ్మతుకు రూ.25 లక్షలు అవసరమని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం వరి ఎదుగుదల దశలో ఉంది. గండి నుంచి నీరు వృథా అవుతుండటంతో సాగునీటి వినియోగదారుల సంఘ సభ్యులు, రైతులు రెండు రోజులుగా ఇసుక బస్తాలతో గండిని పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కాలువ ద్వారానే గిడుతూరు సుకలయ్య చెరువుకు నీరు చేరుతుంది. ఈ చెరువుకు నీరు రాకుంటే సాగునీటికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట భీముని చెరువు, పప్పుశెట్టిపాలెం పాలేపు చెరువు కాలువలకు గండ్లు పడ్డాయి. ఈ రెండు చెరువుల కింద 320 ఎకరాల ఆయకట్టు ఉంది. శాశ్వత మరమ్మతులకు రూ.23 లక్షలు అవసరమని అంచనా. జలవనరుల శాఖ ఏఈఈ రామన్న పాత్రుడిని సంప్రదించగా.. నిధుల విడుదల కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

# పైసలిస్తే చకచకా.. లేకపోతే నత్తనడక..!

విశాఖ : మూడేళ్ల క్రితం గాజువాకలో జీప్లస్3 భవనం నిర్మించారు. అందులో 20 ఫ్లాట్లు ఉన్నాయి. ఆస్తి పన్ను విధించాలని ఫ్లాట్ల యజమానులు తిరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

ఆరిలోవకు చెందిన సాంబమూర్తి 60 గజాల ఇంటిని కొనుగోలు చేశారు. తన పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఆస్తి పన్ను బదలాయింపు చేయాలని ఆర్నెళ్లుగా తిరుగుతున్నా కుదరదంటూ రెవెన్యూ అధికారులు దరఖాస్తును తిరస్కరిస్తున్నారు.

అక్కయ్యపాలేనికి చెందిన సుబ్బారావు 800 చదరపు గజాల ఇంటిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇంట్లో 400 చదరపు గజాలను మరొకరికి విక్రయించి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. అయితే సుబ్బారావుకు ఇప్పటికీ 800 చదరపు గజాల స్థలానికి ఆస్తి పన్ను వస్తూనే ఉంది. అధికారులకు విన్నవించినా స్పందనలేదు.

ఆస్తి పన్ను విధింపులో రెవెన్యూ సిబ్బంది తీరుపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. వారు వేస్తున్న కొర్రీలతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడటంతోపాటు ఏటా మహా విశాఖ నగరపాలక సంస్థ రూ.10 కోట్ల వరకు అదనపు ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. నిబంధనల పేరుతో డబ్బులివ్వకపోతే పన్ను విధించడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ పట్టా కలిగి ఉంటే ఆస్తి పన్ను విధించాల్సి ఉన్నా, పట్టాకు అర్హత ఉందా లేదా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కూడా చేశామని ఆధారాలు చూపుతున్నా పట్టా అర్హతపైనే మాట్లాడుతున్నారని వాపోతున్నారు.

ప్రసన్నం చేసుకుంటేనే: ఆస్తి పన్ను కోసం దరఖాస్తు చేసినవారు రెవెన్యూ సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటే అనుకూలంగా నిర్ణయాలు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అపార్టుమెంట్లలో ఫ్లాట్లకు ఆస్తి పన్ను విధించడానికి ఒక్కో దానికి రూ.5వేల నుంచి రూ.7వేల వరకు తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి.



డబ్బులివ్వకపోతే నెలలు, సంవత్సరాల తరబడి తిప్పించుకుంటున్నారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే నిబంధనలు అడ్డుగా ఉన్నాయని తప్పుడు సమాచారం ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఆస్తి పన్ను విధింపు, బదలాయింపునకు నిర్ణీత గడువు నిర్ణయించడంతోపాటు, పట్టణ ప్రణాళిక విభాగంలో ఏవిధంగా ప్లానును ఆన్‌లైన్‌లో మంజూరు చేస్తున్నారో అదే తరహాలో పన్ను విధించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వానికి లేఖ రాశాం..

ఆస్తి పన్ను విధింపులో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో పరిష్కారం లభించే అవకాశం ఉంది. నిర్ణీత గడువులోగా ఆస్తి పన్ను విధింపు లేక బదలాయింపు చేయాలన్న నిబంధనలున్నాయి. వాటిని కచ్చితంగా అమలు చేసేలా చూస్తాం. జీవీఎంసీకి ఆర్థిక నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటాం. సత్తారు శ్రీనివాసరావు, జీవీఎంసీ ఉపకమిషనర్(రెవెన్యూ)

# పారకాలువలో.. ఆక్రమణల పరంపర

తిరుపతి: స్థలం.. పొలం.. ఇలా ఏది కనిపిస్తే అది ఆక్రమిస్తున్నా పట్టించుకోకపోవడంతో చివరికి శ్మశానాలూ కబ్జా చేశారు. రామచంద్రాపురం మండలం కమ్మపాళెం పంచాయతీ పారకాలువ గ్రామంలోని సర్వే నంబర్ 134లో రావిళ్లవారిపల్లి లెక్క దాఖలాలోని 4.06 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన వైకాపా నేత ఆక్రమించారు. ఇది కశిం కాలువ పోరంబోకు కాగా గ్రామస్థులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో 50 అడుగుల మేర బాగు చేసుకుని శ్మశాన స్థలంగా వాడుకొనేవారమని, వైకాపా నేత ఆక్రమించడంతో ఆఖరి మజిలీకి సైతం అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరిక బోర్డు..** ఈ ఏడాది సంక్రాంతి రోజున రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయబోతుండగా సదరు వైకాపా నేతలు అడ్డుకొని వారిపైనా దౌర్జన్యం చేశారు.. గతంలో ఓవ్యక్తి చనిపోతే.. దహనక్రియలు చేసేందుకు స్థలంలోకి తీసుకెళ్తుండగా...



అక్రమార్కులు అడ్డుకున్నారు. ఆక్రమణలపై తహసీల్దారు మధుసూదనరావు వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, విచారణ అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

**ఏళ్లుగా పోరాడుతున్నాం..**

కసిం కాలువలోని శ్మశాన స్థలాన్ని ఆక్రమించారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కలెక్టరేట్లో అర్జీ ఇచ్చినా పరిష్కారం కరవైంది. ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ముఖ్యమంత్రికి అర్జీ ఇచ్చాం. – పులిపాటి నాథముని నాయుడు, పారకాలువ

**న్యాయం చేయండి సారూ..!**

కాలువ అందరికీ సంబంధించింది.. కానీ ఓ వైకాపా నేత, ఆయన కుమారుడు. కబ్జా చేయడంతో అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడే పశువులు మేపుకొంటూ సంక్రాంతికి పొంగలి పెట్టుకుంటూ కాలువ నీళ్లు వాడుకునేవాళ్లం. ఆక్రమణతో ప్రస్తుతం శివాలయం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి. పి.చంద్రబాబు నాయుడు, పారకాలువ

# దయ చూపితే దాచుకుంటాం..!

పోలాకి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా.. గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడానికి వీలుగా వైకాపా ప్రభుత్వం గ్రామ స్థాయిలో బహుళార్థ సాధక గోదాంల నిర్మాణం చేపట్టింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పనులు జరిగేలా నాబార్డు నుంచి నిధులు కేటాయించింది. జిల్లాలో కొన్నిచోట్ల భవనాలు నిర్మించినా వినియోగంలోకి రాక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**ఇదీ పరిస్థితి** జిల్లాలో 37 పీఏసీఎస్‌ల పరిధిలో 25 గోదాంలు మంజూరు కాగా 18 నిర్మించారు. 5 వివిధ దశల్లో ఉండగా మిగిలినవి స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో ఒక్కో నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. సారవకోట మండల కేంద్రానికి 20 కి.మి. దూరంలో నిర్మించడంతో అక్కడికెవరు వెళ్తారంటూ అన్నదాతలు ఆసక్తి చూప డం లేదు. ఇదే పరిస్థితి దాదాపు అన్నిచోట్లా ఉండటంతో ప్రారంభించినా ఎక్కడా వినియోగంలోకి వచ్చిన దాఖలాలు లేవు

**నిర్మాణం వరకే..:** గోదాంల నిర్మాణం చేపట్టడం వరకే మా బాధ్యత. పూర్తయిన వాటిని జిల్లా సహకార శాఖకు అప్పగిస్తాం. వాటి వినియోగంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. రామారావు, డీఈఈ, మార్కెటింగ్ శాఖ శ్రీకాకుళం

**వినియోగంలోకి తీసుకొస్తాం..:** నిర్మాణం పూర్తయిన గోదాంలను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ అథారిటీతో ఎంవోయూ చేసుకుంటున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే నిల్వ చేసుకున్న పంటలకు బీమా సౌకర్యం లభిస్తుంది. త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. ఎ.మురళీకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి, శ్రీకాకుళం

# మదుం మెరుగైంది.. రైతు కష్టం తీరింది!

సోంపేట : మహేంద్రతనయ నదిపై అనంతపురం వద్ద మదుం, ఇతర నిర్మాణాలు దెబ్బతినడంతో దశాబ్ద కాలంగా ఆయకట్టు రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడ్డారు. ఏటా ఖరీఫ్‌లో రూ.2 లక్షలకు పైగా సమకూర్చుకుని శ్రమదానంతో ఇసుక బస్తాలు అడ్డంగా పెట్టి కొంతమేర నీరు పొలాలకు మళ్లించుకునేవారు. నదికి భారీగా వరద చేరితే ఇసుక బస్తాలు కొట్టుకుపోయి పంటలకు నష్టం వాటిల్లేది.

**వైకాపా పాలనలో నిర్లక్ష్యం**

బారువ, మరో 5 పంచాయతీల పరిధిలో గ్రామాలకు సంబంధించి 3 వేల ఎకరాల మేర బారువ గ్రోయిన్ ద్వారా సాగునీరందేది. ఏడేళ్ల కిందట మదుం నిర్మాణానికి నిధులు మంజూరు కాగా వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు సాగలేదు.

అప్పట్లో మంజూరైన రూ.25 లక్షలతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. గ్రోయిన్ పరిధిలో పనికిరాని మొక్కలు పేరుకుపోవడం.. సామగ్రి ధరలు పెరిగిపోవడంతో పాత ధరల ప్రకారం పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. ఈ అంశంపై వరుస కథనాలు ప్రచురితం కాగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ స్పందించారు. కలెక్టర్, జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడారు.


**శరవేగంగా నాట్లు**

ఖరీఫ్ సాగుకు నీరందించేలా అధికారులు చొరవ చూపి గుత్తేదారులను సంప్రదించడంతో మదుం పనులు పూర్తయ్యాయి. ఏటిబట్టి కాలువ మెరుగుపడటంతో ఆయకట్టు భూములకు సాగునీటి కష్టాలు గట్టెక్కాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నదికి వచ్చిన వరద నిలిచేందుకు అవకాశం ఏర్పడింది. ప్రధాన కాలువ నుంచి నాలుగు పిల్ల కాలువలకు నీరు చేరడంతో నాట్లు వేయడానికి ఇబ్బందులు తప్పాయని జలవనరుల శాఖ ఏఈ సూర్యప్రకాశ్ తెలిపారు.

చురకలు



# దేవుడి మాన్యం.. పరాధీనం



కళ్యాణదుర్గం :కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయం 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఒక ఎకరాలో ఆలయ నిర్మాణం ఉంది. 1.5 ఎకరాలను ఆక్రమించి గడ్డి వాములు, రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి తొండపాడు, గొందిపల్లితోపాటు నంద్యాల జిల్లాలో భూములున్నాయి. రూ.కోట్లు విలువజేసే ఈ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గొందిపల్లిలో సుమారు 5 ఎకరాలు ఉండగా.. అందులో కొందరు వామిదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు పక్కాగృహాలు నిర్మించుకున్నారు. గుత్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆలయ భూములకు రక్షణ కొరవడుతోంది. రూ.కోట్లు విలువైన భూములు స్వార్థపరుల చేతుల్లోకి వెళుతున్నాయి. భద్రత కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతూ పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

గుత్తి మండలం రజాపురం గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయానికి సర్వేనంబర్ 82లో 17.65 ఎకరాలు, 83లో 17.45 ఎకరాల భూమి ఉంది. ఓ సర్వే నంబర్‌లోని భూమిని గ్రామస్థులు వేలం వేసి గుత్తలు రాబడుతున్నారు. ఆ సొమ్మును గ్రామాభివృద్ధికి వాడుకుంటున్నారు. మరో భూమిని శ్రీపురానికి చెందిన 15 మంది ఆక్రమించారు. వీరికి రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం గమనార్హం.గుత్తిలోని రామస్వామి దేవాలయానికి సుమారు ఐదెకరాలు ఉండగా భజంత్రీల పేరుతో పదేళ్ల కిందట రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. వాటిని ఇప్పటికీ రద్దు చేయడం లేదు.

జక్కలచెరువులో రంగనాథస్వామి ఆలయానికి ఇనామ్ భూమి ఉండగా ఓవ్యక్తికి మూడేళ్ల కిందట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం కొనుగోలు చేసిన వ్యక్తి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.

గుత్తిలోని వ్యాసరాయమఠానికి చెందిన సుమారు 6 ఎకరాల్లో రెవెన్యూ అధికారులు ముందు వెనుక ఆలోచించకుండానే ప్రజలకు నివేశన స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేశారు.

చెట్నేపల్లిలో శివుడి మాన్యం ఇతరుల ఆధీనంలో ఉంది.

**అక్రమణదారులపై కేసులు వేస్తున్నాం**

ఆలయ భూముల పరిరక్షణకు ఆర్డీవో కోర్టులో కేసులు వేస్తున్నాం. గుత్తిలోని రామస్వామి దేవాలయం, రజాపురంలోని విఘ్నేశ్వరుడి ఆలయ భూముల్లో ఉంటున్న వారిపై ఇప్పటికే కేసులు వేశాం. పట్టాదారు పాసుపుస్తకాలను రద్దుచేయాలని ఆర్డీవోకు విన్నవించాం.నాగేంద్రుడు, గ్రూపు ఆలయాల ఈవో, గుత్తి

# అద్భుత కట్టడాలు..

# ఇంజినీరింగ్ ఆవిష్కరణలు

అనకాపల్లి : ఒక ప్రాంతం అభివృద్ధి అక్కడ కట్టడాలు, నిర్మాణాలపై ఆధారపడి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపి చేపట్టే కట్టడాలు అభివృద్ధికి సోపానంగా నిలుస్తాయి. ఇందులో అనకాపల్లి – ఆనందపురం రహదారే నిదర్శనం. అనకాపల్లి వద్ద నిర్మించిన ఇంటర్‌ఛేంజ్ రహదారి ఇంజినీరింగ్ ప్రతిభను చాటుతోంది. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆ విశేషాలంటే చూద్దామా.. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు చేపట్టిన విస్తరణ పనుల్లో భాగంగా అనకాపల్లి వద్ద ఇటు ఆనందపురం.. అటు ఎలమంచిలి.. విశాఖపట్నం వైపుంతెన మీదుగా వెళ్లేల వాహనాల రాకపోకలకు ఇంటర్ ఛేంజ్ రహదారి నిర్మించారు. దేశంలో తొలుత చెన్నైలో నిర్మించగా.. ఇక్కడిది రెండోది కావడం గమనార్హం. ఈ రహదారి మీదుగా అనకాపల్లి వచ్చే వారంతా ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు.

**రోడ్డుపై ఆక్విడక్టు.. నదిపై వంతెన**

ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద వరాహ నదిపై ఆక్విడక్టు నిర్మాణం జరుగుతోంది. పోలవరం ఎడమ కాలువ పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో కాలువ తవ్వడం అసాధ్యమని భావించిన ఇంజినీరింగ్ అధికారులు అడ్డురోడ్డు – నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డు, వరాహ నదిపై ఆక్విడక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2017-18లో తెదేపా



ప్రభుత్వం రూ.154.86 కోట్లు మంజూరు చేసింది. సుమారు 1.3 కిలోమీటర్ల పొడవునా ఆరు కాలువలుగా ఆక్విడక్ట్ నిర్మాణం ప్రారంభించారు.

**మన్యం సిగలో కేకే లైను**

అరకులోయ పర్యాటకం అంటే ముందుగా గుర్తుకొచ్చేది బొర్రా గుహలే. విశాఖపట్నం నుంచి రైలు మార్గంలో సొరంగాలు, ఎత్తయిన వంతెనలు, కొండల మీదుగా గుహలకు చేరుకోవచ్చు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఇంజినీరింగ్ అద్భుతాల్లో ఒకటైన కేకే లైను మన్యానికి మణిహారంగా నిలుస్తోంది. అధునాతన సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే అటవీ ప్రాంతంలో నిర్మించిన ఈ రైల్వే లైను చరిత్ర పుటల్లో నిలుస్తోంది. 1960లో జపాన్ సహకారంతో రూ.55 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమై.. 1966లో పూర్తయింది. 445 కి.మీ. పొడవున్న ఈ రైల్వే మార్గంలో కొత్తవలస, బొర్రా, అరకు, జగదల్‌పూర్, దంతెవాడ, కిరండూల్ స్టేషన్లున్నాయి.

నాడు అధునాతన పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో టన్నెళ్ల నిర్మాణానికి థియోడోలైట్ సర్వే చేశారు. కొండల మధ్య ఎంత ఎత్తులో వంతెనలు నిర్మించాలి, మలుపులను గుర్తించేందుకు కంటార్ మ్యాపింగ్‌ను వినియోగించారు.

సొరంగాల నిర్మాణంలో భాగంగా కొండలను తొలిచేందుకు బ్లాస్టింగ్, పెద్ద పెద్ద యంత్రాలతో డ్రిల్లింగ్ చేశారు. ఒక్కో టన్నెల్ నిర్మాణానికి ఏడాదికిపైగా పట్టింది. తొలుత బ్రాడ్ గేజ్ వినియోగించగా ప్రస్తుతం హెవీ హైల్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు.

టైడా నుంచి సిమిలిగుడ స్టేషన్ మధ్యలో 58 సొరంగాలు (టన్నెళ్లు), 84 వంతెనలున్నాయి. ఈ టన్నెల్స్‌లో ఒకటి 520 మీటర్ల మేర విస్తరించి ఉంది. ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు ఐరన్ ఓర్ (ముడి ఖనిజం) తరలించేందుకు ఈ రైల్వే లైన్ నిర్మించారు. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలుపుతూ వెళ్లే ఈ మార్గంలో సిమిలిగుడ రైల్వేస్టేషన్ సముద్ర మట్టానికి 3,271 ఎత్తులో ఉంది.

# ఇసుక దిబ్బలనూ వదలా..!

పాయకరావుపేట : ఇసుక అక్రమ రవాణాపై నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. ఇసుకాసురులు పగలు, రాత్రి తేడా లేకుండా దందా సాగిస్తున్నారు. అధికారులు నీరో చక్రవర్తుల్లా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతోంది. ఇసుక దిబ్బలు కనుమరుగవుతున్నాయి. రవాణాలో ట్రాక్టర్లు, నాటు బళ్ల యజమానులు ప్రత్యేక పంథా అవలంభిస్తున్నారు.

కేశవరంలో రాత్రి 9 గంటల తర్వాత ఇసుక తవ్వకాలకు తెరలేపుతున్నారు. రాత్రిపూట గ్రామాన్ని అడ్డాగా చేసుకుంటున్నారు. రైతుల పొలాల్లోని ఇసుకను ర్యాంపులు ఏర్పాటు చేసుకుని తెల్లావారే వరకు నాటుబళ్లపై తరలిస్తున్నారు. సమీపంలోని కొబ్బరితోటలు, రోడ్ల పక్కన నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లపై అమ్మకాలు సాగిస్తున్నారు.

1.పగటి పూట ఇసుక తవ్వకాలకు కుమారపురం కేంద్రంగా మారింది. పంపా నది ఒడ్డున భూముల్లో ఇసుక దిబ్బలు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పెద్దఎత్తున ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నారు. ఇంటి నిర్మాణాలకు, పునాదుల్లో ఇసుక నింపేందుకు, పాల్మన్‌పేట



పరిధిలోని హేచరీల్లో చదును చేసేందుకు వినియోగిస్తున్నారు.

2.ట్రాక్టర్ ఇసుక రూ.మూడు వేల వరకు అమ్ముతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో దర్జాగా తవ్వకాలు సాగుతున్నాయి. నదుల్లో తవ్విన ఇసుకలో అధిక ధరకు అంటగడుతున్నారు. 3.వాహనాల రాకపోకల కారణంగా పుంతరోడ్లు ధ్వంసమవుతున్నాయి. పంట భూములకు రైతులు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. పదుల సంఖ్యలో నాటుబళ్లు, ట్రాక్టర్లపై ఇసుక తరలిపోతున్నా పట్టించుకునే నాథుడే లేరు. అధికారులకు ఫిర్యాదులు అందినా స్పందన శూన్యం. తవ్వకాల విషయమై సీఐ అప్పన్నను సంప్రదించగా.. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

# మార్కెట్లలో నమూనా యూనిట్లు



అనంతపురం : స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్తతో సంపద సృష్టించడం, నీటిని ఆదా చేయడం.. ఈ రెండు ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలి. ప్రధానంగా వానపాములు యూనిట్లతో ఎరువు తయారు చేయడం, ఇంకుడు గుంతలు తీసి నీటిబొట్టును భూమిలో ఇంకేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయం. ప్రతి వ్యవసాయ మార్కెట్ యార్డులో బహిరంగ ఖాళీ ప్రదేశాల్లో కనిపించేలా ఈ రెండు నమూనాలను విధిగా ఏర్పాటు చేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ కార్యదర్శి తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏఎంసీల్లో పనులు మొదలయ్యాయి.

**4 ఏఎంసీల్లో ఏర్పాట్లు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సంతలు జరిగే అనంతపురం, హిందూపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో చీనీ, పండ్లు, పశువులు, చింతపండు, ఎండుమిరప వంటి సంతలు జరుగుతాయి. రైతులు పెద్ద సంఖ్యలో రైతులు వస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆ నాలుగు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఇంకుడు గుంతలు, వానపాములు తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. యార్డులో చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో వానపాముల యూనిట్లు వినియోగించుకోనేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్మికంపోస్టు యూనిట్లును ఏర్పాటు చేసి రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వానపాములు కొనుగోలు చేసి యూనిట్లో వదిలినట్లు గ్రేడ్–2 కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

# 22 వరకు ఆగుదాం..అందరి చూపు జీఎస్టీ కొత్త స్లాబులపైనే




అనంతపురం : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈనెల 22న జీఎస్టీ (వస్తు సేవల పన్ను) విధానంలో కొత్త శ్లాబులను అమలు చేయనుంది. కొత్తగా కార్లు, బైకులు, టీవీలు, గృహోపకరణాలు, బీమా పాలసీలు తీసుకునే వారు అప్పటి వరకు ఆగాల్సిందేనని అంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 60 వేల మంది జీఎస్టీలో నమోదు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరి నుంచి నెలకు రూ.90 కోట్లు జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అందులో సింహభాగం స్టీలు, సిమెంటు, ఆటోమొబైల్, నిర్మాణ రంగం ద్వారా వసూలవుతోంది. జీఎస్టీ రేట్ల సవరణ ప్రకటన వెలువడిన నాటి నుంచి ధరలు తగ్గే ఆయా ఉత్పత్తుల విక్రయాలు తగ్గిపోయాయి. వంటనూనెలు, నిత్యావసర సరకులపై జీఎస్టీ స్లాబులు తగ్గే నేపథ్యంలో టోకు వ్యాపారులు సరకు నిల్వలను, కొనుగోళ్లు తగ్గించారు.

**పుంజుకోనున్న వ్యాపారాలు**

స్టీలు, సిమెంటు ధరలు తగ్గి నిర్మాణ రంగం పుంజుకుంటుంది. కూలీలకు ఉపాధి లభిస్తుంది. ఓ మోస్తరు పెద్ద హోటళ్లు, లాడ్జిలలో రూముల అద్దెపై జీఎస్టీ పన్ను కొంత తగ్గిపోవడంతో పర్యాటక రంగం జోరుగా సాగుతుందని ఆయా రంగంలోని వ్యాపారులు అభిప్రాయంతో ఉన్నారు. ఆటోమొబైల్, వ్యవసాయ ఆధారిత రంగాలు బలోపేతమయ్యే అవకాశముంది. మధ్య తరగతి కుటుంబాలు, నిరుద్యోగులకు వాహనాలు కొనుగోలు చేసే వీలు కలుగనుంది. కొత్త శ్లాబుల ప్రయోజనాలను ఇప్పటి నుంచే కల్పిస్తామని హామీ ఇస్తూ.. కొన్ని కంపెనీలు ఒక్కో కారు ధరపై లక్ష రూపాయల నుంచి లక్షన్నర వరకు తగ్గించి అమ్ముతున్నాయి. కొత్త స్లాబులతో వివిధ వస్తువుల ధరలు తగ్గిపోయి వ్యాపారాలు తగ్గినా.. మళ్లీ పుంజుకుంటాయని వ్యాపారులు విశ్వసిస్తున్నారు.

# వందేళ్ల భవనాలు.. వన్నెతగ్గని కార్యాలయాలు

పెనుకొండ : 20వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన అనేక భవంతులు 21వ శతాబ్దంలోనూ చెక్కు చెదరకుండా ఆనాటి ఇంజినీరింగ్ నిపుణులు, నాణ్యతకు అద్దం పడుతున్నాయి. 120 ఏళ్ల క్రితం నిర్మించిన అనేక భవనాల్లో నేటికీ వివిధ ప్రభుత్వ కార్యాలయలాలు నిర్వహిస్తున్నారు. పెనుకొండ పట్టణంలోని పాత 7వ జాతీయ రహదారి పక్కన 1904లో నిర్మించిన భవనాల్లో ఉపఖజానా కార్యాలయం, 1910(గ్రా.నీ.స(గ్రామీణ నీటి సరఫరా) డీఈ, సబ్‌కలెక్టర్, 1904లో నిర్మించిన భవనంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం, పశువైద్యశాల, పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన 1904లో నిర్మించిన భవనంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నగరపంచాయతీ కార్యాలయం వద్ద 1907లో నిర్మించిన భవనంలో జడ్పీ బాలికల ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. వీటితో పాటు బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన అనేక భవనాలు నేటికీ వినియోగంలో ఉన్నాయి. ఇప్పటికే పలు భవనాల లోపలి భాగంలో రినోవేషన్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన ఓ భవనం వాడుకలో లేకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. ప్రస్తుతం ఆభవనంలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్నారు. ఈ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన అనేక భవనాలు 40 ఏళ్లకే శిథిలావస్థకు చేరుతున్నాయి, కానీ ఆనాటి నిర్మాణ నైపుణ్యం, పాటించిన నాణ్యత ప్రమాణాలతో ఆ భవనాలు నేటికీ వన్నెతగ్గకుండా విలసిల్లుతున్నాయి.

# అ'ధనం' ఇవ్వాల్సిందే

కర్నూలు : గృహ అవసరాలకు వినియోగించే వాయుబండల సరఫరాలో అదనపు వసూళ్లు మితిమీరిపోయాయి. జనం కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు అంతంతమాత్రమే.

**నగదు ఇవ్వకుంటే..**

అదనపు నగదు వసూలు విషయమై వినియోగదారుడు ప్రశ్నిస్తే ఏజెన్సీల నిర్వాహకులు తమకు జీతాలు ఇవ్వడం లేదని డెలివరీ బాయిస్ వాపోతున్నారు. బుకింగ్ చేసిన రెండు, మూడు రోజులు.. లేదా వారం రోజుల్లోపే సిలిండర్ పంపిణీ చేయాలి. అదనపు నగదు ఇవ్వనివారికి ఆలస్యం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చే వాహనంలో యంత్రంతో తూకం వేసి అందించాలి. కానీ ఒక్క బండిలోనూ తూకం యంత్రం కనిపించదు.

**ఏటా రూ.36 కోట్ల వరకు భారం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 30 వేల గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతాయి. ఒక్కోదానికి రూ.40 చొప్పున లెక్కేస్తే ప్రతి నెలా రూ.3 కోట్లకుపైగా అదనంగా వసూలు చేస్తున్నారు.

ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ గోదాము నుంచి 15 కి.మీ. పరిధిలోని వినియోగదారుడి ఇంటి వరకు సిలిండరు చేర్చేందుకు రవాణా రుసుము వసూలు చేయకూడదు. అంతకుమించితే రూ.30 వసూలు చేయొచ్చు. కానీ పట్టణ పరిధిలోనే రూ.40–50, గ్రామీణ ప్రాంతాల్లో రూ.100 వరకు వసూలు చేస్తుండటం గమనార్హం.

**జరిమానా విధించినా..**

వాయుబండల సరఫరా, డెలివరీ బాయిస్ అదనపు వసూళ్లపై కూటమి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోంది. అదనపు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు గ్యాస్ ఏజెన్సీలను జేసీ గుర్తించి ఒక్కోదానిపై రూ.10 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లాలోనే 12 గ్యాస్ ఏజెన్సీలకు జరిమానా విధించారు. అయినప్పటికీ ఎలాంటి మార్పు రావడం లేదు.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి**

ఎవరైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తే జిల్లా పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, ఆయిల్ కంపెనీల మార్కెటింగ్ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. టోల్‌ఫ్రీ నంబరు 1967, 1800 2333555

# మన్నేసి.. ఆక్ర'ముంచేసి'

నంద్యాల : నంద్యాల పట్టణం మీదుగా వెళ్లే చామ కాలువ ఆక్రమణల చెరలో చిక్కుకుంది. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలోని పెద్ద చెరువు నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ బొమ్మలసత్రం ప్రాంతంలోని కుందూ నది వరకు సుమారు 6.7 కి.మీ. పొడవునా విస్తరించి ఉంది. మహానంది ప్రాంతంలో కురిసే వర్షాలతో వచ్చే వరద నీరు పాలేరు వాగు ద్వారా ప్రవహించి చామ కాలువలో కలుస్తుంది. కొంతవరకు కేసీ కాలువ నీళ్లు సైతం ఎస్‌బీఐ కాలనీలో ఇదే కాలువలో కలుస్తాయి. మద్దిలేరు వాగు.. ప్రథమనంది ఆలయం సమీపంలో ఇదే కాలువలో కలుస్తుంది. ఈ మూడు కలిసిన సమయంలో చామ కాలువకు వరద పోటెత్తుతుంది. ప్రస్తుతం ఆక్రమణలకు గురవడంతో చిన్నపాటి వర్షానికే ఉగ్రరూపం దాల్చి పట్టణాన్ని ముంచెత్తుతోంది.

**2 వేల క్యూసెక్కుల నుంచి..**

పట్టణంలో ఎస్‌బీఐ కాలనీ నుంచి సాయిబాబానగర్ వరకు 3.3 కి.మీ.లు, సాయిబాబానగర్ నుంచి బొమ్మలసత్రం వరకు 3.4 కి.మీ. పొడవునా చామ కాలువ విస్తరించి ఉంది. గత ఐదు దశాబ్దాలుగా ఈ కాలువలో గరిష్ఠ వరద ప్రవాహం 2 వేల నుంచి 2,500 క్యూసెక్కులు. రానురాను ఆక్రమణలతో కాలువ కుచించుకుపోయింది. ఎస్‌బీఐ కాలనీ, విశ్వనగర్, సాయిబాబానగర్, గోపాల్‌నగర్, సరస్వతి నగర్, పద్మావతినగర్, సలీంనగర్, హనీఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాలువ ఆక్రమణలకు గురైంది. ఫలితంగా 200 నుంచి 300 క్యూసెక్కుల వరద నీరు వస్తేనే పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

**విలువ రూ.70 కోట్ల పైమాటే**

పట్టణంలో ఎస్‌బీఐ కాలనీ, విశ్వనగర్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో చామ కాలువ పెద్దఎత్తున ఆక్రమణలకు గురైంది. దీనిని ఆనుకుని కట్టడాలు నిర్మిస్తున్నవారు కాలువలోకి మట్టి వేసి పూడ్చేస్తున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ అండదండలు ఉన్నాయన్న విమర్శలున్నాయి. విశ్వనగర్ ప్రాంతంలో కొందరు వాగు స్థలాలను ఆక్రమించి ప్రహరీ నిర్మించుకున్నారు. గోపాల్‌నగర్, సాయిబాబానగర్ తదితర ప్రాంతాల్లో ఆక్రమించి నిర్మాణాలు చేశారు. కేసీ కాలువ అధికారుల లెక్కల ప్రకారం 6.7 కి.మీ. పొడవునా చామ కాలువ విస్తరించి ఉంది. ప్రస్తుతం 2.5 ఎకరాలకు పైగా కాలువ స్థలం ఆక్రమణలకు గురైనట్లు అంచనా వేస్తున్నారు. బహిరంగ విపణిలో దీని విలువ రూ.70 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

# ఆక్రమణల'కేసీ' చూసేదెన్నడో!

కర్నూలు : కర్నూలు కడప (కేసీ) కాలువకు సంబంధించిన విలువైన స్థలాలు పెద్దఎత్తున ఆక్రమణలకు గురవుతున్నాయి. అయినప్పటికీ జలవనరుల శాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారులకు కనీసం తాఖీదులు కూడా జారీ చేయడం లేదు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కర్నూలు నగర పరిధిలో కేసీ కాలువ 4.50 కి.మీ.ల పొడవునా విస్తరించి ఉంది. ధర్మపేట, బంగారుపేట, లక్ష్మీనగర్, స్వామిరెడ్డినగర్, జొహరాపురం తదితర కాలనీల మీదుగా కాలువ వెళుతుంది. జొహరాపురం ప్రాంతంలో కేసీకి సంబంధించి విలువైన స్థలాలు ఉన్నాయి. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు కన్నేశారు. స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని పక్కా కట్టడాలు చేపడుతున్నారు.

ఎవరూ దృష్టి సారించక..

కర్నూలులో జలవనరుల శాఖకు సంబంధించి సీఈ, ఎస్ఈతోపాటు ఇతర అధికారులు, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఉన్నప్పటికీ ఆక్రమణలపై దృష్టి సారించడం లేదు. గతంలో ఇరిగేషన్‌లో పనిచేసే కొందరు సిబ్బందికి కేసీ కాలువ ప్రాంతంలో నిబంధనల మేరకు స్థలాలు కేటాయించారు. వీటిని ఆసరాగా చేసుకుని పలువురు బినామీలు రెచ్చిపోతున్నారు. మరోవైపు కొందరు నేతల ప్రోత్సాహంతో నిర్మాణాలు సాగుతుండటం గమనార్హం.

కేసీ కాలువ నిర్వహణకు సంబంధించిన ఇంజినీర్లు బృందంగా ఏర్పడి లస్కర్లతో కలిసి కాలువ వెంబడి నిరంతరం పర్యటించాలి. ఎక్కడైతే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో గుర్తించి తాఖీదులు జారీ చేయాలి. అవసరమైతే పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుని వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలి.

# సుజీత్ దెబ్బకు రాధికకు భారీ నష్టం..!

డీజే టిల్లు సినిమాలో రాధిక పాత్రతో భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది నేహా శెట్టి.. ముఖ్యంగా రాధిక అనే క్యారెక్టర్ ఈమెకు ఓవర్ నైట్ లోనే స్టార్ ఇమేజ్ ను అందించి పెట్టింది. అలాంటి ఈమె సుజీత్ కారణంగా స్టార్ స్టేటస్ కోల్పోయింది అంటూ అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. ప్రముఖ టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కళ్యాణ్ హీరోగా.. సాహో సినిమాతో డైరెక్టర్గా మంచి పేరు దక్కించుకున్న సుజీత్ కాంబినేషన్లో వచ్చిన చిత్రం ఓజీ. భారీ బడ్జెట్ తో వచ్చిన ఈ చిత్రం సెప్టెంబర్ 25వ తేదీన విడుదలై మొదటి రోజు మంచి కలెక్షన్స్ వసూలు చేసింది. కానీ ఆ తర్వాత రోజుల్లో క్రమంగా థియేటర్లకు ఆడియన్స్ రావడం మానేశారు. దాంతో కలెక్షన్లు కూడా బాగా తగ్గిపోయాయి. మరోవైపు రాధిక క్యారెక్టర్ తో భారీ పాపులారిటీ సంపాదించుకున్న నేహా శెట్టితో ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ రూపొందించిన విషయం తెలిసిందే. అయితే మొదట దీనిని గాసిప్ గానే చెప్పారు. కానీ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో నేహా శెట్టితో ఎటువంటి స్పెషల్ సాంగ్ చేయించలేదు అని అందరూ అనుకున్నారు. కానీ నేహా శెట్టితో ఈ సినిమా కోసం ఒక స్పెషల్



సాంగ్ చేశారు. అంతేకాదు నేహా శెట్టి కూడా తన కెరియర్లో తొలిసారి "కిస్ కిస్ బ్యాంగ్ బ్యాంగ్" అనే పాటతో ఐటమ్ నంబర్లలోకి అడుగు పెట్టింది. సాధారణంగా ఇటువంటి పాటలు అటు సినిమాకే కాదు.. ఆ పాటలు చేసిన హీరోయిన్స్ కి కూడా మంచి విజయాన్ని అందిస్తాయి. కానీ ఈ పాట చేసిన నేహా శెట్టికి మాత్రం ఈ పాట ఎటువంటి ప్రభావాన్ని చూపించలేకపోయింది. నిజానికి బ్యాంకాక్ లో చిత్రీకరించబడిన ఈ పాటను పవన్ కళ్యాణ్ ఓజీ రెండవ భాగంలో చూపించాలని మొదట మేకర్స్ అనుకున్నారట. అయితే దర్శకుడు సుజీత్, ఎడిటర్ నవీన్ మాత్రం కథకు అంతరాయం కలుగుతుందని భావించి, నిర్మాత అభ్యంతరం వ్యక్తం చేసినా దానిని తొలగించాలని భావించారు. అలా మొదటి భాగం నుండి పాటను తీసేశారు. కానీ థియేటర్లో విడుదలైన ఓజీ సినిమా.. మొదటి రెండు రోజులు బాగానే కలెక్షన్స్ వసూలు చేసినా.. ఆ తర్వాత కలెక్షన్లు మాత్రం రాలేదు. దీంతో అభిమానుల అభ్యర్థన మేరకు అయిష్టంగానే ఐదు రోజుల తర్వాత ఈ పాటను తిరిగి సినిమాలో జోడించారు. దురదృష్టవశాత్తు ఆలస్యంగా చేర్చడం వల్ల ఈ పాట పెద్దగా ప్రభావితం చూపించలేకపోయింది. దీనికి తోడు ఈ పాట చిత్రీకరణ అనవసరం అనిపించేలా చేసిందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

# డైరెక్టర్ గా షాక్ ఇచ్చిన చిరుత పిల్ల!

ఓడలు బళ్లు అవుతాయి. బళ్లు ఓడలవుతాయంటారు. తాజాగా ఈ మాట మరోసారి నిజం చేసేలా ఉంది ముంబై బ్యూటీ నేహాశర్మ. ఈ బ్యూటీ టాలీవుడ్ కి చిరుత సినిమాతో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమాతోనే గ్రాండ్ హిట్ అందుకుంది. కానీ ఆసక్సెస్ ని కంటున్యూ చేస్తూ తెలుగులో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. రెండు..మూడు తెలుగు సినిమాలతోనే బాలీవుడ్ కి పరిమితమైంది.

**హాట్ బ్యూటీ కొత్త అవతారం:** కెరీర్ ఆరంభంలోనే హిందీ అవకాశాలతో బిజీ అయింది. కానీ నటిగా మాత్రం రావాల్సినంత గుర్తింపు రాలేదు. ఖాళీగా లేకుండా దశాబ్దం పాటు ప్రయాణాన్ని కొనసాగించింది గానీ ఇండస్ట్రీలో నటిగా తన మార్క్ మాత్రం వేయలేకపోయింది. సినిమా ల్లో నటికంటే? సోషల్ మీడియాలో చిట్టిపొట్టి దుస్తుల్లోనే ఎక్కువగా ఫేమస్ అయింది. ఇన్ స్టా వేదికగా అమ్మడు చేసే అందాల రచ్చ అంతా ఇంతా కాదు.



**నిర్మాతగా స్టార్ హీరో:** తాజాగా ఈ బ్యూటీ దర్శకురాలిగా కొత్త ప్రయాణానికి రెడీ అవుతోంది. అదీ ఆషామాషీ చిత్రం కాదు. ఏకంగా ఓ భారీ యాక్షన్ చిత్రానికే సంకల్పించింది. ఇందులో సిద్దాంత్ చతుర్వే ది, మోహిత్ కీలక పాత్రలు పో షిస్తున్నారు. 1985 నేపథ్యంలో సాగే పిరియాడిక్ చిత్రమిది. ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది చిన్న చితాకా హీరో కాదు. నేహాశర్మ ట్యాలెంట్ ను నమ్మి ఏకంగా బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి రెడీ అవుతున్నారు.

**ఇదో సంచలనం:** ఆయన సొంత నిర్మాణ సంస్థలోనే ఈ చిత్రం నిర్మాణం కానుంది. దీంతో నేహా శర్మ పేరు మరోసారి నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. అమ్మడిలో క్రియేటివ్ యాంగిల్ కూడా ఉ ందా? అని చర్చించుకుంటున్నారు. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి ఎరుక? అన్నట్లు ఎవరి ట్యాలెంట్ ఎంత? అన్నది ముందే అంచనా వేయ లేం. నటిగా ఫేం సాధించలేని బ్యూటీ దర్శకురాలిగా సక్సెస్ అయితే? ఆమె జాతకమే మారిపోతుంది. అసలే బాలీవుడ్ లో లేడీ డైరెక్టర్లు చాలా తక్కువ. క్రియేటివ్ రంగంలో మహిళలు కూడా రాణించాలని మేథా వర్గం కోరుకుంటోన్న నేపథ్యంలో? నేహా శర్మ కెప్టెన్ కుర్చీ ఎక్కడం ఇప్పుడో సంచలనం.




# కిరణ్ అబ్బవరం 'కే- ర్యాంప్'.. ఎంత వసూలు చేయాలంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు కే- ర్యాంప్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. క సినిమాతో రీసెంట్ గా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అబ్బవరం.. ఒక్కసారిగా యమా క్రేజ్ సొంతం చేసుకున్నారు. క కలిసొచ్చిందనే ఉద్దేశంతో ఆ పదం ఇప్పుడు కే- ర్యాంప్ టైటిల్ లో పెట్టినట్లు ఉన్నారు. జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్ గా నటిస్తున్నారు. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకున్న మూవీ త్వరలో రిలీజ్ కానుంది. దీపావళి కానుకగా అక్టోబర్ 18వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్లే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సినిమాను రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించి థియేట్రికల్ బిజినెస్ కంప్లీట్ చేసినట్లు తెలుస్తోంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర (6 ప్రాంతాలు)- రూ. 3 కోట్లు, సీడెడ్ - రూ. 1.25 కోట్లు, నైజాం - రూ. 2 కోట్లు. రెస్టాఫ్ ఇండియా - రూ. 45 లక్షలు. మొత్తం- రూ. 6.75 లక్షలు. అయితే కే- ర్యాంప్ థియేట్రికల్ బిజినెస్ అలా జరగ్గా.. బాక్సాఫీస్ వద్ద హిట్ స్టేటస్ సాధించాలంటే సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 8 కోట్ల షేర్ వసూలు చేయాలట. అది చిన్న నంబర్ అనే చెప్పాలి. కిరణ్ అబ్బవరానికి ఇప్పుడు మంచి క్రేజ్ ఉంది. సినిమాకు కనుక పాజిటివ్ టాక్ వస్తే.. రూ. 8 కోట్లు వసూలు చేసి క్లీన్ హిట్ గా నిలవనుంది. కాగా.. మూవీపై ఇప్పటికే ఆడియన్స్ లో సూపర్ బజ్ క్రియేట్ అయింది. అనౌన్స్మెంట్ నుంచే పాజిటివ్ హైప్ ఏర్పడింది. మేకర్స్ దాన్ని మంచిగా కాపాడుకుంటూ వస్తున్నారు. వరుస అప్డేట్స్ తో సందడి చేస్తున్నారు. క్రేజీ పోస్టర్స్ ను రిలీజ్ చేస్తున్నారు. అదిరిపోయే సాంగ్స్ ను ఒక్కొక్కటిగా తీసుకొస్తున్నారు. మ్యూజిక్ లవర్స్ ను తెగ మెప్పిస్తున్నారు. ఇప్పటికే టీజర్ తో అలరించగా.. మరికొద్ది రోజుల్లో ట్రైలర్ ను రిలీజ్ చేయనున్నారు. సినిమాపై మరింతగా బజ్ క్రియేట్ చేసేందుకు ట్రైలర్ ను కట్ చేసే పనిలో ఉన్నారు. త్వరలో ఎప్పుడు విడుదల చేయనున్నారో చెప్పనున్నారు. ఏదేమైనా మరో 10 రోజుల్లో రిలీజ్ కానున్న కే- ర్యాంప్ ఎంతటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

# ఆర్యన్ ఖాన్ ఏదో గట్టిగానే ట్రై చేస్తున్నాడు!





భారతదేశంలోని ఒక పెద్ద సూపర్స్టార్ వారసుడు మరో స్టార్ అవుతాడని ప్రజలంతా ఎదురు చూస్తారు. కానీ అందుకు భిన్నంగా, తాను కెమెరా వెనక దర్శకుడిగా సెటిలవుతానంటే అది నిజంగా షాకిచ్చే పెద్ద విషయం. కానీ అలాంటి ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రకటించాడు కింగ్ ఖాన్ షారూఖ్ కుమారుడు ఆర్యన్ ఖాన్. అతడు దర్శకత్వం వహించిన తొలి వెబ్ సిరీస్ ది బాలిలిలిడ్స్ ఆఫ్ బాలీవుడ్ ఈ బుధవారం నాడు ట్రైలర్ విడుదల తరుణంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇది ఒక బోల్డ్ వెబ్ సిరీస్ .. కానీ దానికి సంబంధించి కచ్చితమైన సమాచారం ఏదీ బయటకు లీక్ చేయలేదు. బాలీవుడ్ ప్రపంచంలోని చాలా గమ్మత్తయిన విషయాలను ఈ సిరీస్ లో రివీల్ చేస్తూనే, ఒక అందమైన ప్రేమకథను కూడా చూపిస్తున్నామని తొలి నుంచి కొన్ని విషయాల్ని రివీల్ చేసాడు ఆర్యన్. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రోమోకి మంచి స్పందన వచ్చింది. ఇంతకుముందు షారుఖ్ స్వయంగా ఈ సిరీస్‌ను ప్రమోట్ చేస్తూ ప్రోమో గురించి మాట్లాడారు. టీజర్‌లో రొమాన్స్, యాక్షన్, డ్రామా ఆకట్టుకుంటున్నాయి. విజువల్ రిచ్ గా ఈ వెబ్ సిరీస్ తెరకెక్కింది. సెప్టెంబర్ 18న ఈ సిరీస్ విడుదల కానుండగా, ట్రైలర్ వీక్షించాక ఆర్యన్ పనితనాన్ని పొగిడేస్తూ కరణ్ జోహార్ చాలా ఎగ్జయిట్ అయ్యాడు. ఆర్యన్ లవ్ యు.. ఇది అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుంది! అంటూ ఒకటే ఉత్సాహం కనబరిచాడు. అలాగే మన లక్ష్య లీడ్ పాత్రలో కిల్ చేస్తున్నాడు అని కూడా ప్రశంసించాడు. ముఖ్యంగా కింగ్ ఖాన్ తన వారసుడిని ప్రమోట్ చేస్తున్న తీరు చూస్తుంటే వెబ్ సిరీస్ పై ఉత్కంఠ అంతకంతకు పెరుగుతోంది. షారూఖ్ వారసుడిగా ఆర్యన్ పై చాలా ఒత్తిడి ఉంది. అందరి దృష్టి ఇప్పుడు అతడి మొదటి ప్రయత్నంపైనే.. అతడు తన తొలి వెబ్ సిరీస్ లో ఏం చూపించబోతున్నాడు? దర్శకుడిగా నిరూపించాడా లేదా? అనే ఉత్కంఠ నడుమ తాజాగా ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ ఆద్యంతం విజువల్ గా మెరిపించింది. బాలీవుడ్ స్వప్న ప్రపంచం అందరికీ చిక్కనిది.. అనే డైలాగ్ తో ట్రైలర్ ని ప్రారంభించారు. కథానాయకుడు లక్ష్యను యాక్షన్ స్టార్ గా ఆవిష్కరించారు. అతడు బాలీవుడ్ లో అవకాశాల కోసం ప్రయత్నించే యువకుడిగా కనిపించనున్నాడు. అలాగే ఇందులో అతిథులుగా సల్మాన్ ఖాన్, రణ్ వీర్ పాత్రలను కూడా పరిచయం చేసారు.

ఇండస్ట్రీ గ్లామ్ అండ్ గ్లింప్స్ ని హైలైట్ చేసిన ఈ ట్రైలర్ లో అజయ్ తల్వార్ గా బాబి డియోల్ పాత్రను ఇతరుల కంటే చాలా స్పెషల్ గా ఆవిష్కరించారని చెప్పాలి. అతడి లుక్, ఎంట్రీ ప్రతిదీ అందరి దృష్టిని ఆకర్షించాయి. సినీ పరిశ్రమ నేపథ్యంలో కాన్సెప్ట్ కాబట్టి ఇందులో పెద్దగా చెప్పుకోవడానికి ఏమీ కనిపించలేదు. కానీ ఆర్యన్ ఏదో కొత్తగా ప్రయత్నిస్తున్నాడని మాత్రం అర్థం చేసుకోవచ్చు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి అందుబాటులోకి రానుంది.

# బ్లాక్ గౌన్‌లో శోభితా ధూళిపాల క్లాసీ చార్మ్

సినీ ఇండస్ట్రీలో ఫ్యాషన్ కి కొత్త అర్థం చెప్పే హీరోయిన్స్ లలో శోభితా ధూళిపాల పేరు తప్పనిసరిగా ఉంటుంది. ఇటీవల ఆమె షేర్ చేసిన బ్లాక్ డ్రెస్ ఫోటోలు ఆ గ్లామర్ కు మరో అర్థం చెప్పాయి. జారా బ్రాండ్‌కి సంబంధించిన ఈ ఫోటోషూట్‌లో ఆమె లుక్ సింపుల్ అయినా స్టైలిష్‌గా ఉంది. మినిమల్ మేకప్, స్పెషల్ హీల్స్, గోల్డ్ క్లచ్‌తో ఆమె లుక్ స్టన్నింగ్ అనేలా ఉంది. శోభితా కెరీర్‌ని చూస్తే, మోడలింగ్‌తో ప్రారంభించి తర్వాత సినిమాల వైపు అడుగుపెట్టింది. 2016లో 'రామన్ రాఘవ్ 2.0'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె, ఆ తర్వాత 'గుడ్‌చారి'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించింది. నటనలోనూ, ఫ్యాషన్‌లోనూ తాను




వేరే స్థాయిలో ఉన్నానని నిరూపించుకుంది. 'మేడ్ ఇన్ హెవెన్' వెబ్ సిరీస్ ద్వారా ఆమె గ్లోబల్ లెవెల్‌లో గుర్తింపు పొందింది. ఆ సిరీస్‌లో ఆమె పాత్రలో ఉన్న స్ట్రాంగ్, ఎమోషనల్ వైబ్స్ ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేశాయి. ఆ తర్వాత హాలీవుడ్ ప్రాజెక్ట్ 'పొన్నియిన్ సెల్వన్'లో కూడా ఆమె నటనకు మంచి ప్రశంసలు అందాయి.

ఈ ప్రయాణం ఆమె వెర్సటిలిటీకి నిదర్శనం. తాజాగా ఆమె సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న "చీకట్లో" వెబ్ మూవీతో మళ్లీ తెలుగులోకి వస్తోంది. ఇది అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుందని సమాచారం. ఈ ప్రాజెక్ట్ గురించి ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయ్యింది. శోభితా యొక్క పాత్ర ఈసారి కూడా కొత్త షేడ్స్‌లో కనిపించనుందని టాక్. మొత్తం మీద శోభితా ధూళిపాల ప్రతి సారి తన ఫోటోషూట్స్, సినిమా ఎంపికలతో ఫ్యాన్స్‌కి కొత్త ఫీలింగ్ ఇస్తోంది. ఇక రానున్న రోజుల్లో ఆమె సినిమాలు ఎలాంటి క్రేజ్ ను అందుకుంటాయో చూడాలి.

# త్రిష, నయన్ ఇక్కడ ఫైట్ షురూ..?

కోలీవుడ్ స్టార్ హీరోయిన్స్ త్రిష, నయనతార ఇద్దరు కూడా అక్కడ ఇప్పటికీ మంచి ఫాం కొనసాగిస్తున్నారు. నయనతార అయితే లేడీ సూపర్ స్టార్ గా అదరగొట్టేస్తుంది. ఐతే మధ్యలో త్రిష కూడా నయన్ కి పోటీగా వస్తుంది. ఈమధ్య త్రిష తమిళ్ లో వరుస స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తుంది. త్రిష, నయనతార కోలీవుడ్ ఫైట్ కొనసాగుతుంది. ఐతే ఈ ఫైట్ కేవలం తమిళ్ లో మాత్రమే కాదు తెలుగు సినిమాలకు వచ్చింది.

**విశ్వంభర సినిమాలో త్రిష..** మెగా 156 సినిమాగా వస్తున్న విశ్వంభర సినిమాలో చిరంజీవికి జతగా నటిస్తుంది త్రిష. దాదాపు 13, 14 ఏళ్ల తర్వాత త్రిష తెలుగు సినిమా చేస్తుంది. విశ్వంభర ఆమెకు తెలుగులో మళ్లీ ఫాం కొనసాగించేలా చేస్తుందని నమ్ముతుంది. ఐతే త్రిష వచ్చిందో లేదో మెగా 157 సినిమాకు నయనతార మళ్లీ టాలీవుడ్





రీ ఎంట్రీ ఇస్తుంది. అంతకుముందు తమిళ్ తో పాటు తెలుగులో కూడా వరుస సినిమాలు చేసిన నయనతార ఎందుకో అమ్మడు సడెన్ గా తెలుగు సినిమాలు ఆపేసింది. ఐతే ఇప్పుడు మళ్లీ మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబో సినిమాలో ఆమె నటిస్తుంది. మెగా 157 సినిమాగా వస్తున్న ఈ మూవీ 2026 సంక్రాంతికి వస్తుంది. ఐతే చిరంజీవి వరుస రెండు సినిమాల్లో త్రిష, నయనతార నటిస్తున్నారు. ఈ సినిమాలు వాళ్లిద్దరికి మళ్లీ తెలుగులో ఫాం లోకి తీసుకు వచ్చేలా ఉన్నాయి. ఐతే సినిమాల పరంగా తమిళ్ లో త్రిష, నయనతార పోటీ పడుతున్నారు. ఇద్దరు కూడా ఒక సినిమాకు ఆమె మరో సినిమాకు ఈమె అనేలా పరిస్థితి ఉంది.

**తమిళ్ లో కాదు తెలుగులో ఇద్దరు మధ్య పోటీ..** త్రిష, నయనతార మధ్య ఈ ఫైట్ ఇంట్రెస్టింగ్ గా మారింది. తమిళ్ లో కాదు తెలుగులో ఇద్దరు మధ్య జరుగుతున్న ఈ పోటీ ఆసక్తికరంగా మారింది. ప్రత్యేకంగా ప్లాన్ చేయకపోయిన సరే త్రిష, నయనతార ఇద్దరు కూడా సడేన్ గా తెలుగు సినిమాలు టార్గెట్ చేసుకున్నారు.

తెలుగులో హీరోయిన్స్ కు మంచి డిమాండ్ ఉంటుంది. తప్పకుండా మళ్లీ త్రిష, నయనతార తిరిగి ఫాంలోకి వస్తే మాత్రం వరుస సినిమాల్లో నటించే ఛాన్స్ ఉంటుంది. త్రిష ఐతే ఇప్పటికీ గ్లామరస్ గా అదరగొట్టేస్తుంది. ఆమెతో లవ్ స్టోరీ తీసినా తీయొచ్చు అనేలా ఉంది. నయనతార ఇంకా తన పవర్ ఫుల్ సినిమాలతో అదరగొట్టాలని చూస్తుంది. ఈ ఇద్దరు మళ్లీ తెలుగు సినిమాల్లో నటించడంతో వాళ్ల తెలుగు ఫ్యాన్స్ కి సూపర్ హ్యాపీ అనిపిస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536